
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



4 అణాలు
2-5-'51

విషయానుక్రమణిక

2 మే 1951

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
Founder: K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 33
2-5-51

ఖర సంవత్సర చైత్ర బహుళ ద్వాదశి బుధవారము

బ్రిటిష్ కార్మికశాఖా మంత్రి రాజీనామా

[సూర్యనారాయణ]

★

బ్రిటిష్ కార్మికశాఖామంత్రి ఎన్యూరిన్ బెవాన్ రాజీనామా నివ్వడంతో బ్రిటిష్ సోషలిస్టు కార్యక్రమం గురించి ముఖ్యమైన వివాదం బయలుదేరింది. బ్రిటిష్ ప్రభుత్వపు ఆయుధబలనిర్మాణ కార్యక్రమం కొనసాగడం అసంభవమనీ, అది అమలుజరపడానికి ప్రయత్నించడం వల్ల బ్రిటన్ ఆర్థికవ్యవస్థ కూలిపోతుందనీ, బ్రిటిష్ కార్మికరంగంలో సంఘర్షణ బయలుదేరుతుందనీ బెవాన్ అన్నాడు. సోషలిస్టు కార్యక్రమాన్ని నెట్టివేసి, ఆయుధబల నిర్మాణాన్ని ప్రధానంగా పరిగణించడంవల్ల కమ్యూనిస్టుల కుట్రలకు తావేర్పడుతుందన్నాడు. ఇంతవరకూ కార్మికపక్షం కష్టపడి నిర్మించిన సోషలిస్టు వ్యవస్థ కూలిపోతుందన్నాడు. దీనికంతకీ కారణం అమెరికా విదేశాంగ విధానానికి బ్రిటన్‌ని అంటగట్టి బలవంతాన లాక్కుపోవడమే కారణమన్నాడు.

మానవసమాజ నిర్మాణ వ్యవస్థ విషయమై అమెరికన్ల పద్ధతినిగాని రష్యన్ల పద్ధతినిగాని పోలని విశిష్ట వ్యవస్థను బ్రిటిష్ సోషలిస్టులు నిర్మించడానికి యత్నించి, ప్రపంచానికి కొత్తతెన్ను చూపవలసిన బాధ్యతని ఇప్పుడు విడనాడుకొంటున్నారని బెవాన్ బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిందించాడు.

బ్రిటిష్ కార్మికపక్షం అనుసరిస్తున్న విధానాన్ని డెమోక్రటిక్ సోషలిజమ్ అని చెప్పుకుంటున్నారు. మార్క్సిజంలో కొన్ని సిద్ధాంతాల్ని విశ్వసిస్తారనీ, కొన్నిటిని విశ్వసించరనీ వీరు చెప్పుకుంటారు. సోషలిస్టు వ్యవస్థని నిర్మించడానికి సాయుధ విప్లవం అవసరం లేదనీ, పార్లమెంటరీ ఎన్నికల ద్వారా సోషలిస్టు ప్రభుత్వాన్ని స్థాపించవచ్చుననీ వీరి విశ్వాసం. సోషలిస్టు ప్రభుత్వాన్ని స్థాపించినప్పుడుకూడా, కార్మికవర్గ నియంతృత్వపాలన అవసరం లేదనీ, ప్రస్తుత బ్రిటిష్‌పార్లమెంటరీ పరిపాలనావిధానాన్ని అనుసరించి సర్వవర్గాలకూ స్వేచ్ఛనిస్తూ, శాసనాలద్వారానూ, సంస్కరణల ద్వారానూ సోషలిస్టు కార్యక్రమాన్ని క్రమక్రమంగా అమలు జరిపి సోషలిస్టు పరిణామం తేవచ్చునని వీరి విశ్వాసం. ఈ తత్వం రష్యన్ల విప్లవవాదానికీ, అమెరికన్ల స్వేచ్ఛావ్యాపార వాదానికీ భిన్నమైనమాట నిజమే. కాని 'ఈ సోషలిస్టు క్రమ పరిణామాన్ని' బ్రిటిష్ కార్మికపక్షం ఎంతవరకూ సాధించగలిగింది, సాధించిన కార్యక్రమా లెంతవరకూ ఫలించాయి అనే విషయమై రూఢిగా ఎవరూ సమాధానాలు చెప్పలేరు. ఇందుకు కారణం ప్రపంచ దుస్థితి అనీ, ప్రపంచయుద్ధభీతిఅనీ కొందరు సోషలిస్టులు చెప్పుకుని తృప్తిపడుతున్నారు. కాని బ్రిటిష్ కార్మికపక్షం కార్యక్రమాలు ఫలించకపోవడానికీ, బ్రిటన్ అమెరికా అండను చేరడానికీ కారణం స్వతహాగా వారి కార్యక్రమంలోనూ సిద్ధాంతాలలోనూ ఉన్న లోపాలేనని కమ్యూనిస్టుల వాదం.

బ్రిటిష్ కార్మికపక్షంలో రెండు వర్గాలున్నాయి; బెవాన్ వర్గం ఒకటి, మారిసన్ వర్గం ఒకటి. సోషలిస్టు కార్యక్రమాలను అమలుజరపడంలో వెనుకాడకూడదనీ, పెట్టుబడిదారీవర్గాల కుట్రలు సాగకుండా జాగ్రత్తపడాలంటే వారి ఆర్థికబలాన్ని శోషింపచేసి ప్రజాహిత కార్యాలను వెంటనే అమలుజరపాలనీ బెవాన్ వర్గం వాదం. పెట్టుబడిదారీవర్గాల వ్యాపార స్వేచ్ఛకు భంగంకలిగినాసరే వెనుదియ్యరాదని వీరి వాదం. అన్యదేశాలపై అంతగా ఆధారపడకుండా, అంతర్జాతీయ ఆర్థిక రాజకీయరంగాలలో పాటుపోటులకు చలించని ఆర్థిక వ్యవస్థను నిర్మించడం తక్షణకర్తవ్యమని వీరి అభిప్రాయం. మారిసన్ వర్గం ఈ వాదాన్ని అంగీకరించదు. బ్రిటన్ ఆర్థికవ్యవస్థ అన్యదేశాలపై ఆధారపడి ఉందనీ, అన్యదేశాలతో ఆర్థికబంధాలకు అనుగుణంగా బ్రిటిష్ ఆర్థిక, రాజకీయ విధానం నిర్వహించబడాలనీ, పెట్టుబడిదారీవర్గం ఆర్థికబలాన్ని శోషింపచెయ్యనవసరం లేదనీ, వారి సహకారంతోనే దేశీయ వస్తూత్పత్తిని వృద్ధిపరిచి, ప్రజల జీవన సదు

పాయాల నధికం చెయ్యాలనీ మారిసన్‌వర్గం అభిప్రాయం.

ఇంతవరకూ బ్రిటిష్ కార్మిక ప్రభుత్వం అవలంబించిన విధానం మారిసన్ వర్గానికి అనుకూలంగా ఉంది. అయితే బెవాన్ వర్గం కోరిన ప్రజాహిత కార్యక్రమాల్ని క్రమక్రమంగా అమలు జరపడానికి ప్రయత్నించింది. ముఖ్య పరిశ్రమలని చెప్పబడే వానిలో కొన్నిటినిమాత్రమే హస్తగతం చేసుకుంది. ఈ పరిశ్రమలలోకూడా చాల వరకు పెట్టుబడిదారులతో కలిసి ప్రభుత్వం ఆధ్వర్యం కింద సహకారోద్యమ (కోఆపరేటివ్ స్కీమ్) సిద్ధాంతాల ననుసరించింది. అమలు జరిగిన సర్వజనహిత కార్యక్రమాలలో చెప్పవలసినవి ఉచితవైద్య సదుపాయాలకార్యక్రమం, నిర్బంధ సామాజిక భీమా. సోషలిస్టు వ్యవస్థలో ప్రజల కివి కనీసావసరాలని బెవాన్‌వర్గం అభిప్రాయం.

బ్రిటిష్ సోషలిస్టుల కార్యక్రమాలవల్ల ప్రజల కెన్ని సదుపాయాలు లభించినప్పటికీ ఆహారం, వస్త్రం, నివాసాల సమస్య పరిష్కారం కానేలేదు. ఆహారాది అవసర వస్తువుల్ని విదేశాలనుంచి దిగుమతి చేసుకోడానికి అవసరమైన ఎగుమతివస్తువుల ఉత్పత్తి బ్రిటన్‌లో చాలా వృద్ధయింది. కాని ప్రపంచవ్యాపారంలో యుద్ధానంతరం వచ్చిన కల్లోలంవల్ల బ్రిటన్ ఎంత కృషిచేసినా కనీసావసరమైన వస్తువులు ఎప్పటిలాగే కొరవగా ఉన్నాయి.

యుద్ధానంతరం కమ్యూనిస్టుదేశాలు మినహా దాదాపు అన్నిదేశాలూ అమెరికాతో వ్యాపారంపైన ఆధారపడకతప్పడం లేదు. ఇందువల్లనే బ్రిటన్ కోలుకోలేకపోతున్నదని భావించి తృప్తిపడుతూ, కనీసం ఉచితవైద్యసదుపాయం మొదలైన కార్యక్రమాలవల్లనైనా సోషలిస్టు పరిపాలన ఉన్నట్లు ప్రజలకి గుర్తుకు తేవాలని కొందరి ప్రయత్నం. ఇది మొదటిమెట్టుగా పరిగణించి, వీలునుబట్టి క్రమంగా మిగతా కార్యక్రమాలు అమలుజరపాలని బెవాన్ వర్గం ఆశయం.

ఇప్పుడు ఆయుధబల నిర్మాణకార్యక్రమంవల్ల మొదటిమెట్టులోనే వెనక్కు తిరగవలసిరావడంతో బెవాన్ వర్గానికి ఒక విషయం స్పష్టపడింది. అమెరికా విదేశాంగవిధానాన్ని అనుసరిస్తున్నంత కాలమూ సోషలిస్టు కార్యక్రమాలు అమలు జరిగేమాట కల్ల.

డెమోక్రటిక్ సోషలిజమ్ ఆచరణ సాధ్యంకాదని ఇటు అమెరికన్లు, బ్రిటిష్ కన్సర్వేటివ్‌లు, అటు కమ్యూనిస్టులు చేస్తున్న ప్రచారాన్ని బెవాన్, బెవిన్ ప్రభృతులు ఖండిస్తూ, ప్రపంచంలో శాంతి ఏర్పడాలంటే, దేశాలకూ దేశాలకూ మధ్య కాని, వివిధవర్గాల మధ్య కాని సంఘర్షణను నివారించాలంటే, డెమోక్రటిక్ సోషలిజమ్ ఒక్కటే శాంతియుతమైన మార్గమని చెప్పారు. కాని ఆరేళ్లసోషలిస్టు పరిపాలనలో బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థలో చెప్పదగిన మార్పులేవీ రాలేదు. పన్నుల విధింపు సమాజంలోని అన్నివర్గాల మధ్యనూ న్యాయంగా పంచబడిందని సోషలిస్టులు చెప్పుకుంటున్నారు. కాని ఇంతవరకూ బ్రిటన్‌లో సాధ్యంకాగలిగిన వస్తూత్పత్తి వృద్ధి ఎగుమతులకు మాత్రమే ఉపయోగబడింది. దీనికి ప్రతిఫలంగా ప్రజల జీవన సదుపాయాలలో మార్పు కలగనేలేదు. వస్తువుల ధరల పెరుగుదల అరికట్టబడలేదు. వస్తువుల ధరలతోబాటు, పెట్టుబడిదారుల లాభాలు-పెరుగుతున్నాయే కాని కార్మికుల జీవన సదుపాయాలు సన్నగిలుతున్నాయి. డివిడెండ్లు పెంచినట్లు ఈమధ్య ప్రకటించిన 156 కంపెనీల లాభాలు 1950 లో 76 మిలియన్ల పౌనులు. 1949 లో ఈ కంపెనీలకు వచ్చిన లాభాలమొత్తం 59 మిలియన్ల పౌనులే. విదేశవ్యాపారంవల్ల ఈస్టర్ ప్రాంతాలఒక్క వారంలో 70 మంది 50 లక్షల పౌనులు లాభం(పన్నులు మినహాయించగా) గడించారు. ఒకవంక పెట్టుబడిదారుల లాభాలు పెరుగుతుండగా, మరొకవంక వస్తువుల ధరలు పెరిగి కార్మికుల వేతనాలకు ప్రతిఫలం తగ్గిపోతోంది. ప్రభుత్వం వశపరుచుకున్న పరిశ్రమలలో యూనియన్ల అనుమతితో నిమిత్తంలేకుండా కార్మికులు సమ్మెలు చేస్తున్నారు. కార్మికులలో కార్మికపక్షనాయకుల ప్రాబల్యం క్రమంగా క్షీణిస్తోంది.

రష్యన్ల విప్లవవిధానం, అమెరికన్ల స్వేచ్ఛా (ఆర్థిక కల్లోల) వ్యాపారవిధానం పనికిరానివనీ, డెమోక్రటిక్ సోషలిజమ్ ఒక్కటే నూతనసమాజవ్యవస్థానిర్మాణానికి మార్గమనీ ప్రపంచానికి నిరూపించాలని దీక్షపట్టిన బ్రిటిష్ కార్మికపక్షం పరాజయం పొందింది. ఈ పరాజయానికి ప్రపంచ రాజకీయపరిస్థితి, అమెరికా ఆయుధబల నిర్మాణమూ హేతువులని చెప్పి నిందిస్తున్నారు.


ఇప్పుడు బ్రిటన్ ఈ సంవత్సరానికి 149 కోట్ల పౌనులు, మొత్తం మూడేళ్లలో 470 కోట్ల పౌనులు ఆయుధబలసంపత్తి ఉత్పత్తి నిమిత్తం ఖర్చుపెట్టడానికి అంచనా వేసింది. ఏడాదికి 50 వేల విమానాలు, 35 వేల టాంకులు తయారుచెయ్యడానికి అంచనా వేశారు. అంటే దేశంలోని



ఎనైరిన్ బెవాన్

యావత్తు వస్తూత్పత్తిలోనూ నూరింట పది వంతులకు పెరుగుతుందన్నమాట. దీనివల్ల ప్రజలకు అవసరమైన వస్తుసామగ్రి ఉత్పత్తి తగ్గిపోక తప్పదు. ముడివస్తువుల ధరలు అమెరికా కొనుబడివల్ల ప్రపంచమంతటా పెరిగిపోతున్నాయి. అందువల్ల బ్రిటన్ ఆయుధబల నిర్మాణంమూలంగా ప్రజావసర వస్తువుల కొరవ, ధరల పెరుగుదల సంభవించక తప్పదు. ముడివస్తువుల లోటువల్ల కొన్ని పరిశ్రమలు దెబ్బతిని, కార్మికుల నిర్వృత్తి వృద్ధికాగల సూచనలున్నాయి. అమెరికానించీ, పశ్చిమ యూరప్‌నించి దిగుమతి చేసుకోవలసిన యంత్రపరికరాలు, ఆసియా, ఆఫ్రికా, అమెరికాలనుంచి దిగుమతి చేసుకోవలసిన ముడివస్తువుల ధరలు పెరుగుతున్నందువల్లనూ, ఈ వస్తువుల ధరలను బ్రిటన్ కంట్రోల్ చెయ్యడానికి వీలులేనందువల్లనూ, 140 కోట్ల పౌనులూ ఖర్చుపెట్టి, చివరికి ఇప్పుడంచనా వేస్తున్నంత ఆయుధ సామగ్రిని ఉత్పత్తిచెయ్యలేరు. ముడివస్తువుల ధరలను పరిమితంచేసి ఏ దేశానికెంత అవసరమో అంత సామగ్రిని దిగుమతి చేసుకోడం మంచిదనే ఉద్దేశంతో, అమెరికా ఆధ్వర్యంకింద సమావేశపరచబడిన వివిధదేశాల ప్రతినిధులు ధరల్ని, గురించికాని దిగుమతి ప్రమాణాల్నిగురించి కాని అంగీకారం సాధించలేకపోయారు. అందువల్ల బ్రిటిష్‌ప్రభుత్వం తలపెట్టిన

(5-వ పేజీ చూడండి)



సోమవారం, ఏప్రిల్ 23 :

—కొరియాలో నూరుమైళ్ల పొడుగున కమ్యూనిస్టులు యుద్ధం ప్రారంభించారు. సమితిసేనలు వెనుకంజ వేసినాయి.

—బ్రిటిష్ మంత్రి హెరాల్డ్ విల్సన్ (బోర్డ్ ఆఫ్ ట్రేడ్ ప్రెసిడెంట్) మంత్రి పదవికి రాజీనామా నిచ్చాడు.

—అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్‌లమధ్య అమలు జరగనున్న పసిఫిక్ రక్షణ ఒడంబడికనిమిత్తం మూడు దేశాల ప్రతినిధులతోనూ ఒక సమాలోచన సంఘాన్ని (కన్సల్టేటివ్ కమిటీ) నిర్మించగలరని ట్రూమన్ ప్రతినిధి జాన్ ఫాస్టర్ డలెస్ అన్నాడు.

—జాయింట్‌స్టాక్ కంపెనీల వాటాదార్లలో అధికసంఖ్యవాటాలు కలవారు పాకిస్తాన్ వెళ్లిపోయిఉన్నట్లయితే, అట్టివారికి చెందిన ఆస్తులను శరణార్థుల ఆస్తిగా పరిగణించడానికిగాను శరణార్థులఆస్తిశాసనాన్ని పార్లమెంటు సవరణ చేసింది.

—రంగాగారి అధ్యక్షకాలంలో ఆంధ్రకాంగ్రెస్ జమా ఖర్చుల్ని గురించి విచారణ జరిపించవలసిందిగా సంజీవిరెడ్డిగారి ఆంధ్రకాంగ్రెస్ అఖిలభారత కాంగ్రెస్ కార్యవర్గాన్ని కోరగలదని కళా వెంకట్రావుగారు చెప్పారు.

—ప్రకాశం, రంగాగార్ల ప్రజాపార్టీ, సోషలిస్ట్‌పార్టీల మధ్య సహకారం సాధించడానికి కృషి జరుగుతుందని జైప్రకాశ్ నారాయణగారు ఝరియాలో చెప్పారు.

మంగళవారం, ఏప్రిల్ 24 :

—కొరియాలో కమ్యూనిస్టుల ధాటి కాగలేక సమితి సైన్యాలు 38 వ అక్షాంశానికి దక్షిణంగా వచ్చేశాయి.

—జపాన్‌తో శాంతిసంధి చేసుకున్న తరవాత ఆ దేశంలో అమెరికన్ సైన్యాలు నిలవరించడానికి జాన్ ఫాస్టర్ డలెస్‌తో తాత్కాలికంగా సమ్మతికి వచ్చినట్లు జపాన్ ప్రధాని యొషీదా తెలిపాడు.

—జపనీస్ నౌకానిర్మాణాన్ని పరిమితం చెయ్యడానికి బ్రిటన్ ప్రయత్నించినట్లయితే అమెరికన్ ప్రభుత్వం ప్రతిఘటిస్తుందని జాన్ ఫాస్టర్ డలెస్ టోకియో వెళ్లబోతూ వాషింగ్టన్‌లో ప్రకటించాడు.

—బెవాన్, విల్సన్‌ల స్థానే బ్రిటిష్ కార్మిక మంత్రివర్గంలో ఆల్ఫ్రెడ్ రోబెన్స్, సర్ హార్ట్‌లీ షాక్రాస్ నియమించబడ్డారు. రాజీనామా నిచ్చినవారు పార్లమెంట్‌లో కార్మిక మంత్రివర్గాన్ని బలపర్చగలరని వాగ్దాన మిచ్చారు. (అంటే మంత్రివర్గం పతనమయ్యే ప్రమాదం తప్పిందన్నమాట.)

—మార్షల్ సహాయం పొందుతున్న దేశాలలో అమెరికన్ల పెట్టుబడిని ప్రోత్సహించడానికిగాను, విప్లవాలు యుద్ధాలవల్ల పరిపాలనలో మార్పులు వచ్చేపక్షంలో ఆ పెట్టుబడిధనానికి నష్టం ప్రాప్తిస్తే అమెరికన్ ప్రభుత్వం హామీ వహించడానికి వీలుగా ఎకనమిక్ కోఆపరేషన్ ఎడ్మినిస్ట్రేషన్ ఆక్టు సవరణ చెయ్యబడింది.

—భారత రాజ్యాంగం అడుగుజాడల్లో నేపాల్ దేశానికికూడా ఒక రాజ్యాంగాన్ని తాత్కాలికంగా సిద్ధపరిచినట్లు నేపాల్ విద్యామంత్రి ప్రకటించారు.

—పరిశ్రమలలో బాదుపుకి ప్రయత్నించడంవల్ల వృత్తి కోలుపోయినవారి సహాయంనిమిత్తం తగు చర్యలు తీసుకోడానికి కార్మికులు, యజమానుల ప్రతినిధుల సమిష్టిసంస్థ నొకదానిని నిర్మించాలని పారిశ్రామికాభివృద్ధిసంఘం సూచించింది.

బుధవారం, ఏప్రిల్ 25 :

—ఫార్మోజా రక్షణని మిత్తం చియాంగ్‌కైషేక్ ప్రభుత్వంతో 1951 ఫిబ్రవరిలో అమెరికన్ ప్రభుత్వం చేసుకున్న రహస్యపు టొడంబడిక వివరాలను డీన్ ఎచిసన్ ప్రకటించాడు.

—బ్రిటిష్ ప్రభుత్వపు ఆయుధబల నిర్మాణకార్యక్రమాన్ని బ్రిటిష్‌కార్మికపక్షకార్యవర్గం ఆమోదించి, బెవాన్ వాదాన్ని నిరాకరించింది.

—అమెరికాలో అపారంగా నిలవలు చేస్తున్నందువల్ల ముడిసరుకులు మిగతా దేశాలకు కొరవౌతున్నాయనీ, ముఖ్యంగా బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం వస్తున్నదనీ, అందువల్ల అమెరికా మిగతాదేశాలతో సహకరించవలసిన అవసరం ఉన్నదనీ బ్రిటిష్ విదేశాంగమంత్రి మారిసన్ అన్నాడు.

—ఆంగ్లో - ఇరానియన్ ఆయిల్ కంపెనీవారి అబడాన్ ఆయిల్ రిఫైనరీలలో కార్మికులసమ్మె అంతమయిందని బ్రిటిష్ జనరల్ మేనేజర్ ప్రకటించాడు.

—కొత్త పార్లమెంట్ ఎన్నుకోబడేవరకూ ఇప్పటి పార్లమెంట్‌ను రద్దుపరచబోరని మంత్రి డా॥ అంబేద్కర్ పార్లమెంట్‌లో ప్రకటించారు.

—భారత కమ్యూనిస్టుపార్టీ 34 అంశాల ఆశయ నివేదిక బొంబాయిలో ప్రకటించబడింది.

—'హిందూరాష్ట్ర' ఆశయాన్ని సాధించడం, పెట్టుబడిదారీ విధానానికీ, సామ్యవాదానికీ మధ్యేమార్గాన్ని అనుసరించడం, పాకిస్తాన్‌ను తిరిగి భారతదేశంతో కలిపి అఖండభారతాన్ని నిర్మించడం తమ లక్ష్యాలని హిందూమహాసభ పార్లమెంటరీబోర్డువారి ఎన్నికల నివేదికలో తెలపబడింది.

—జూన్ మూడోవారంలోగా సమ్మె విషయమై కార్మికుల అభిప్రాయం తీసుకోవాలని ఆలిండియా రైల్వేమెన్స ఫెడరేషన్ జనరల్ కౌన్సిల్ తీర్మానించింది.

—భాషారాష్ట్ర నిర్మాణం గురించి శంకర్రావుదేవ్, కళావెంకట్రావు, నిజలింగప్ప, టి. టి. కృష్ణమాచారి ప్రభృతుల విజ్ఞప్తికి పండిట్ నెహ్రూ సమాధాన మిస్తూ, సర్వ జనాంగీకారమైన కార్యక్రమాన్ని సాధిస్తేగాని భాషా రాష్ట్ర నిర్మాణం తలపెట్టరాదన్నారు.

—బియ్యంకొనే నిమిత్తం బర్మా ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడానికి మంత్రి మున్షీగారి నాయకత్వంకింద ఒక రాయబారవర్గాన్ని మే 1 వ తేదీని పంపడానికి భారత ప్రభుత్వం నిశ్చయించింది.

—శ్రీ అరవింద స్మారకసమావేశం పాండుచ్చేరిలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పడానికి తీర్మానించింది.

గురువారం, ఏప్రిల్ 26 :

—కొరియాలో పశ్చిమ రంగాన సమితి సేనలు పోల్ నగరంవరకూ వెనక్కి తగ్గాయి.

—187 మందిని మరణశిక్ష విధించి చంపినందుకుగాను దక్షిణ కొరియా న్యాయశాఖామంత్రిని ప్రధాని సింగ్మన్ రీ బర్తరఫ్ చేశాడు. హోంశాఖామంత్రి బుధవారం నాడు రాజీనామా ఇచ్చాడు.

—"సాధ్యమైనంతవరకు" యుద్ధాన్ని కొరియాకే పరిమితం చెయ్యడం అమెరికన్ ప్రభుత్వఆశయమని ట్రూమన్ ప్రకటించాడు.

—అమెరికాలో పన్నులు హెచ్చింపబడినాయి.

—భారతదేశానికి పదిలక్షల టన్నుల ఆహార ధాన్యాన్ని ఉచితంగానూ, పదిలక్షలు ఋణంమీదా ఇవ్వాలని అమెరికన్ సెనేట్ ఫారెన్ రిలేషన్స్ కమిటీ తీర్మానం చేసింది.

—ఇండోనీషియాలో డా॥ సుకిమాన్ ప్రధానిగా 20 మంది మంత్రులతో ముస్జుమీ - నేషనల్ పార్టీల సమిష్టి మంత్రివర్గం నిర్మించబడింది.

—చీనాదేశంనించి మొదటివాయిదా 50 వేల టన్నుల మైలో దిగుమతి చేసుకోడానికి ఒడంబడికపైన పెకింగ్‌లో చీనా, భారతప్రభుత్వ ప్రతినిధులు సంతకాలు చేశారు.

—భారతదేశానికి ఆధునిక శాస్త్ర నిపుణుల సహాయం ఇవ్వడానికిగాను భారత ప్రభుత్వం, అంతర్జాతీయ కార్మికసంస్థల మధ్య ఒడంబడికపై సంతకాలు జరిగాయి.

—ఫైనాన్స్‌బిల్లును భారత పార్లమెంటు ఆమోదించింది.

—కాశీ హిందూవిశ్వవిద్యాలయంలో హిందువులే కాక సర్వమతాలవారినీ చేర్చుకోడానికి వీలుగా కాశీ హిందూవిశ్వవిద్యాలయ శాసనానికి (1915) ఒక సవరణను మంత్రి అబుల్‌కలాం ఆజాద్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.

శుక్రవారం, ఏప్రిల్ 27 :

—భారతదేశానికి ఆహారధాన్యాల సప్లై విషయమై అమెరికన్ కాంగ్రెస్‌లో జరుగుతున్న తర్జనభర్జనల్ని మాస్కో రేడియో తీవ్రంగా నిరసించింది.

—గ్రీన్‌లాండ్‌లో విమానాశ్రయాలను గురించి డెన్మార్క్, అమెరికాల మధ్య ఒడంబడిక జరిగింది

—కొరియాలో సమితి సేనలు హాన్ నది వరకు వెనక్కు వచ్చాయి.

—ఫ్రాన్స్‌లో ఎన్నికల విధానం సవరణల గురించి నేషనల్ ఎసెంబ్లీ ఆమోదించనందువల్ల హెన్రీ క్యూల్ ప్రభుత్వం రాజీనామానిచ్చింది. అయితే రాజీనామాను ఫ్రెంచి ప్రెసిడెంట్ సమ్మతించలేదు.

—పర్షియా మజ్లిస్ (పార్లమెంట్) ఆయిల్ కమిటీ ఆయిల్ పరిశ్రమను వెంటనే ప్రభుత్వంఅధీనం చేసుకోవాలని నిర్ణయించింది.

—పర్షియాప్రధాని హుసేన్ ఆలా రాజీనామా నిచ్చాడు.

—డచ్చి-ఇండోనీషియన్ ఒడంబడికను సవరణచేసి, డచ్చి న్యూగినీని తమకు ఒప్పగించవలసిందిగా డచ్చిప్రభుత్వంపైన ఒత్తిడి తేగలదని కొత్త ఇండోనీషియా ప్రభుత్వం ప్రకటించింది.

—అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బాంకులలో భారత ప్రభుత్వం తరఫున గవర్నర్‌గా శ్రీ సి. డి. దేశ్‌ముఖ్ తిరిగి నియమింపబడ్డారు.

—ఇప్పటి టారిఫ్ బోర్డును 1951 మే 8 వ తేదీనుంచి మరి మూడు సంవత్సరాలు పనిచెయ్యాలని భారతప్రభుత్వం ఆజ్ఞ ఇచ్చింది.

—వ్యవసాయికావసరాల నిమిత్తం ధనమిచ్చే విషయంలో, కాలవ్యవధిని 12 మాసాలనుంచి 15 మాసాలకు పొడిగిస్తూ రిజర్వ్‌బాంక్ ఆక్టు సవరణశాసనాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఒప్పందాల ఆధారంపైన 'బి' తరగతి రాజ్యాలలో కూడా ప్రభుత్వ కార్యాలను రిజర్వ్ బాంక్ నిర్వహించవచ్చునని ఈ శాసనంలో మరొక సవరణ చెయ్యబడింది.

—వార్తాపత్రికల అమ్మకంపైనా, ప్రకటనల ఆదాయంపైనా కొన్ని రాష్ట్రాలు విధించిన పన్నులను రద్దుపరుస్తూ పార్లమెంట్‌లో ఒక శాసనం చెయ్యబడింది.

—చెన్నరాష్ట్రంలో రు 180 కోట్ల పంచవర్ష ప్రణాళికను అమలు జరిపే నిమిత్తం అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూములపై ఆరేడువాయిదాలలో వసూలు చెయ్యడానికి ఎకరానికి రు 100 మొదలు రు 300 చొప్పున అభివృద్ధిసుంకం విధించడానికి నిర్ణయమైనట్లు ఢిల్లీనుంచి వార్త వచ్చింది.

—మద్రాసు మంత్రులు కుమారస్వామిరాజా, భక్తవత్సలం, గోపాలరెడ్డి, సీతారామరెడ్డిగార్లు పండిట్ నెహ్రూను దర్శించి, కమ్యూనల్ జి. ఓ. గురించీ ఇతర సమస్యల్ని గురించీ చర్చించారు.

—డెమోక్రటిక్ ఫ్రంట్, సోషలిస్ట్ పార్టీలు ఎన్నికల్లో కలిసి పనిచెయ్యాలని కృపలానీకి తాము సూచించినట్లు జైప్రకాశ్ నారాయణగారు సూరత్‌లో చెప్పారు.

—ప్రకాశం రంగాగార్ల ప్రజాపార్టీ ప్రాథమిక సమావేశం విజయవాడలో జరిగింది.

శనివారం-ఏప్రిల్ 28 :

—పర్షియాలో ఆయిల్ పరిశ్రమను పభుత్వపరం చేసుకోవాలని ఆందోళన చేసిన నేషనల్ ఫ్రంట్ పార్టీ నాయకుడు డా॥ ముసాదిక్‌ను ప్రధానిగా మజ్లిస్ ఎన్నుకుంది.

—టిబెట్‌కు చెందిన పంచెన్‌లామా చీనాకమ్యూనిస్టునాయకులతో సంప్రదింపుల నిమితం పెకింగ్ వెళ్లాడు.

—ఆస్ట్రేలియాలో ఎన్నికల ఫలితంగా దిగువ శాసనసభలో మెంజీస్‌పార్టీకి అధిక స్థానాలు లభించాయి.

—కాశ్మీర్ భారతరిపబ్లిక్‌లో చేరికను ఆమోదించడానికిగాను రాజ్యాంగ పరిషత్తు నిర్మిస్తున్నట్లు కాశ్మీర్ యువరాజా ప్రకటించారు.

—రెండుకోట్ల రూపాయల ఖర్చుతో ప్రపంచ ఆరోగ్యసంస్థ ఆధ్వర్యంకింద భారతదేశంలో పెనిసిలిన్ ఫాక్టరీ నిర్మించడానికి భారతప్రభుత్వం సమ్మతించింది.

—పశ్చిమబెంగాల్లో డా॥ శ్యామప్రసాద్ ముఖర్జీ పీపుల్స్‌పార్టీ స్థాపించారు.

—హిందూమహాసభ పార్లమెంటరీ కార్యక్రమాలలోకి హిందూమతానికి చెందని వారిని కూడా చేర్చుకోడానికి జైపూర్ ప్రత్యేక సమావేశం నిర్ణయించింది.

—మద్రాసు రాజ్యంలో ఎన్నికలనియోజకవర్గ విభజనకు మద్రాసుప్రభుత్వం చేసిన ఏర్పాట్లలో, ఎలెక్షన్ కమిషన్ మార్పులు చేసినందుకుగాను పార్లమెంట్‌లోని కొందరు మద్రాసుసభ్యులు తమ అసమ్మతిని భారతప్రధాని నెహ్రూకు తెలియపరిచారు.

ప్రజాపార్టీ విజయవాడ సమావేశంలో సభ్యులు శాసనసభా సభ్యత్వాలకు కాని, కాంగ్రెస్‌ద్వారా ఎన్నికైన ఏ సభ్యత్వాలకు కాని రాజీనామా నివ్వనవసరం లేదని నిర్ణయించబడింది.

—శ్రీ యన్. రఘునాథయ్యర్ అధ్యక్షతకింద దక్షిణ భారత పత్రికారచయితల సమావేశం మద్రాసులో జరిగింది.

—హిందూ మతాదాయ ధర్మసంస్థ శాసన సవరణలు (1944, 1946) మూడింటినీ అములులో ఉంచడానికిగాను మద్రాసుగవర్నరు ఆర్డినెన్స్ జారీ చేశారు.

బ్రిటీష్ కార్మికశాఖా మంత్రి రాజీనామా

(2-వ పేజీ తరువాయి)

ఆయుధబల నిర్మాణకార్యక్రమం విఫలం కాకతప్పదని బెవాన్ అన్నాడు. ఇది విఫలం కాకతప్పని పరిస్థితిలో, ప్రజావసర వస్తుసామగ్రిఉత్పత్తిని తరగదియ్యడం, ఉచిత వైద్యసదుపాయంవంటి కార్యక్రమంలో వెనుకంజవెయ్యడం, అనేకమంది కార్మికులకు వృత్తిపోవడం వీని మూలంగా బ్రిటిష్ఆర్థికవ్యవస్థకి ముప్పురాకతప్పదనిబెవాన్ వాదం. 40 కోట్ల పౌనుల ఖర్చుతో అమలుజరిగిన ఉచితవైద్య సదుపాయాల కార్యక్రమంలో 30 లక్షల పౌన్లు. తగ్గించి, ప్రజలకు సప్లయిచేసే కట్టుడుపళ్లు, సులోచనాలకు సగంవెల వసూలుచెయ్యడం వల్లపెద్ద లోపం రాకపోవచ్చును. కాని ఇది ఇంతటితో ఆగదని బెవాన్ అభిప్రాయం. ప్రస్తుత పరిస్థితుల్నిబట్టి చూస్తే వచ్చే సంవత్సరం ఈ కార్యక్రమం మరింత వెనకపడకతప్పదు. సోషలిస్టు కార్యక్రమాలకంటె, ప్రజావసర వస్తువుల ఉత్పత్తికంటె ఆయుధబల నిర్మాణం ప్రధానమని బ్రిటిష్ ప్రభుత్వం పరిగణిస్తున్నందువల్ల బ్రిటన్ ఆర్థికవ్యవస్థ కూలిపోతుందని బెవాన్ అన్నాడు.

ప్రపంచ ఆర్థిక పరిస్థితులదృష్ట్యా సోషలిస్టు కార్యక్రమమే ప్రధానమని బెవాన్ అభిప్రాయం. కమ్యూనిజాన్ని నిరోధించడానికి ఆయుధబల సంపదకంటె సోషలిస్టు వ్యవస్థా నిర్మాణం అవసరమని అతని భావం. ప్రస్తుత ప్రపంచపరిస్థితుల దృష్ట్యా ఆయుధబల నిర్మాణం ప్రధానమని బ్రిటిష్ ప్రభుత్వం అభిప్రాయం. పశ్చిమ యూరప్‌లో ప్రజలు కమ్యూనిజాన్ని నిరోధించాలంటే ఆర్థికవ్యవస్థ పునర్నిర్మాణం కావాలని భావిస్తున్నారు. అమెరికా నాయకత్వంకింద క్రైస్తవమత రాజకీయపక్షాలూ, సోషలిస్టులని చెప్పుకునే రాజకీయపక్షాలూ కమ్యూనిజాన్ని నిరోధించడానికి ఆయుధ, సైనికబలనిర్మాణం అవసరమని భావించి కార్యక్రమాలు నడుపుతున్నారు. ఈ ద్విధాభిప్రాయాలే పశ్చిమ యూరప్‌లో యుద్ధమంతమైనది మొదలు చర్చించబడుతున్నాయి.

ఈ రెండు వర్గాలలోనూ బ్రిటన్‌లో మొదటివర్గానికి చెందిన బెవాన్ పరాజయం పొంది రాజీనామా నిచ్చాడు. ఈ ఆర్థిక కల్లోలపరిస్థితిలో అమెరికా తోడ్పడుతుందనే విశ్వాసంతో పశ్చిమ యూరోపియన్ రాజ్యాల ప్రభుత్వాలు ఆయుధ, సైనికబల నిర్మాణానికి ఉపక్రమించాయి. సైనికబలంతో కమ్యూనిజాన్ని నిరోధించాలనే వర్గంమాట నెగ్గింది. ఆహారం, వస్త్రం, నివాసా లిచ్చి కమ్యూనిజాన్ని నిరోధించాలనే వర్గం ఓడిపోయింది. ★

రామరాజ్యం

శాంతిభద్రతల రక్షణపేరిట
శాసనసమ్మత నేరాలు—

ప్రజాసౌఖ్య నిర్మాతల మంటూ
పదవులకోసం బేరాలు—

పట్టపగలు అధికారుల నీడల
చీకటిబజారు భూతాలు—

ఆకాశానికి పెరిగే ధరలకు
అర్రులు చాచే జీతాలు—

ఎన్నికలకు మును పాశలు రేపి
అమలుకు రాని ప్రణాళికలు—

అన్న మడిగితే తుపాకిగాల్పుల
జవాబు లిచ్చే పాలకులు—

అనాథశవాలు పునాదిరాళ్లుగ
నిలిచిన ప్రజాప్రభుత్వాలు—

అజాగళ స్తన్యాలకు మల్లే
ప్రజాస్వామిక స్వత్వాలు—

నిరంకుశత్వం, నియంతృతత్వం
ప్రజలకు మిగిలిన లాభాలు.

- సవ్యసాచి -

ఆదివారం, ఏప్రిల్ 29 :

ఆహారాన్ని ఇవ్వడంకోసం భారతదేశాన్ని అగౌరవపరిచి మన స్వాతంత్ర్యాన్ని హీనపరచడానికి యత్నించే అన్యదేశాలకు లొంగడం అనేది ఉండదని పండిట్ నెహ్రూ బులాంద్ షహర్ బహిరంగసభలో అన్నారు.

—కాశ్మీర్ గురించి భద్రతామండలి తీర్మానం అక్రమమైనదని ఆలిండియా జమియత్ - ఉల్ - ఉలేమా హైదరాబాద్ సమావేశం ప్రకటించింది.

—ఉత్తరప్రదేశ్ డెమోక్రటిక్ ఫ్రంట్ సభ్యులు కాంగ్రెస్‌నుంచి నిష్క్రమించాలని నిశ్చయించుకున్నారు.

—ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కార్యవర్గం (18 మంది సభ్యులు) ఎన్నికలు మద్రాసు రాజాజీహాల్ ఆవరణలో జరిగాయి.

—రు 135 కోట్ల ఖర్చుతో మద్రాను పంచవర్షప్రణాళిక గురించి మద్రాసు మంత్రులకు, సెంట్రల్ ప్లానింగ్ కమిషన్‌కీ మధ్య అంగీకారం కుదిరిందని మద్రాసు ఆర్థికశాఖాకార్యదర్శి వర్ఘీస్ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో రామపాదసాగరప్రాజెక్టుగాని, కృష్ణా-పెన్నాప్రాజెక్టుగాని లేవు. రు 135 కోట్లలో భారతప్రభుత్వం రు 20 కోట్లుమాత్రం భరిస్తుంది. ★

సీరియల్ నవల:

కౌంట్ ఆఫ్ మాంటె క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

29

మారెల్ కంపెనీ కార్యాలయాన్ని మంచిరోజుల్లో చూసినవారు ఇప్పుడు చూసినట్లయితే గుర్తుపట్టలేరు. వ్యాపారసంస్థలో ఉండవలసిన హడావిడి, పనిరద్దీ ఇప్పుడక్కడ కనిపించవు. కార్యాలయం చిన్నబోయినట్లుంది. పాత ఉద్యోగులలో ఇద్దరు మాత్రం ఇప్పుడు మిగిలారు. ఒకడు ఇరవైనాలుగేళ్ల యువకుడు. అతనిపేరు ఇమాన్యూల్ రేమండ్. మారెల్ కుమార్తెను ప్రేమించాడు. రెండో వ్యక్తి కాషియర్. వృద్ధుడు. ఒక కన్ను గుడ్డి. ఇతన్ని అందరూ కొక్లే అని పిలుస్తారు.

కొక్లే మొదటినించీ మారెల్ కంపెనీనే అంటిపెట్టుకుని ఉన్నాడు. అయితే అతని ఉద్యోగంలో చిత్రమైన మార్పు వచ్చింది. కాషియర్ దగ్గరనించి దర్వాన్‌వరకూ అన్ని ఉద్యోగాలూ అతనే చేస్తున్నాడిప్పుడు. మారెల్ కంపెనీకి చెడ్డరోజులు వచ్చినా ఇతనొక్కడే విడిచి వెళ్లిపోకుండా ఉన్నవాడు. ఈ కంపెనీ తప్పకుండా మళ్లీ వృద్ధిలోకి వచ్చి తీరుతుందని అతనికి గుడ్డినమ్మకం ఉంది. కంపెనీపట్ల అతనికి భక్తి ఎక్కువ.

మారెల్ కంపెనీలో కొక్లే ఇరవైఏళ్లనించి పనిచేస్తున్నాడు. కంపెనీస్థితి ఎలాగున్నప్పటికీ అతనికి జీతంమాత్రం నెలకి నిక్కచ్చిగా అందుతోంది. గడిచిన మాసానికి లెక్కలు తయారుచేసి ఉంచాడు.

లెక్కల్లో మారెల్ ఒక పొరపాటు చేసినట్లు కొక్లే కనిపెట్టాడు. డెభ్భైసెంట్లు తన కెక్కువ ఇచ్చాడు. అది తీసుకెళ్లి భక్తితో యజమాని కిచ్చి పొరపాటు చూపించాడు. మారెల్ విషాదం ఉట్టిపడే చిరునవ్వు నవ్వి, డబ్బుని ఖాళీడ్రాయర్‌లో పడేసి, "నిజంగా నువ్వు నీతికి బంగారంతో సమానమోయ్!" అన్నాడు.

గతమాసం కష్టంమీద గడిచింది. కాని అప్పటినించీ రోజులు మరింత గడ్డుగా ఉన్నాయి. ఇకముందు చెల్లింపులకోసం ఉన్న ధనమంతా అడుగంటాగీకి తియ్యవలసివచ్చింది. తన దుస్థితి నగరంలో తెలిసిపోతుందనే భయంతో, రహస్యంగా బుకేర్ సంతకి వెళ్లి భార్యవీ కూతురువీ నగలు కొన్నింటిని అమ్మి డబ్బు తెచ్చాడు. ఈ డబ్బుతో ఇప్పటికి ఖర్చు తట్టుకోవచ్చు. కాని ఖజానాపెట్టె ఖాళీగా ఉంది.

థామ్సన్ ఎండ్ ఫ్రెంచ్ కంపెనీ గుమాస్తా వచ్చేసరికి పరిస్థితు లిలా ఉన్నాయి. ఆ గుమాస్తాని కంపెనీకార్యాలయంలో ఇమాన్యూల్ పలకరించాడు. తన యజమాని మాట్లాడవలసిన బాధ లేకుండా, తనే అతను వచ్చిన పనేదో కనుక్కోడానికి ప్రయత్నించాడు. కాని గుమాస్తా ఇతనితో ఏ విషయాన్నీ చెప్పడానికి ఒప్పుకోలేదు. మారెల్‌తో స్వయంగా మాట్లాడాలన్నాడు. ఇమాన్యూల్ దీర్ఘనిశ్వాసం విడిచి గుమాస్తాని కొక్లేకి ఒప్పగించాడు. వీరిద్దరికీ మేడమెట్లవద్ద పదిహేడేళ్ల చక్కని యువతి ఒకామె కనపడింది. ఆమె కొత్తపురుషుని భయంతో చూసింది. కొక్లే అది కనిపెట్టలేదు. కాని బ్రిటిష్ దేశస్థుడు గమనించాడు.

"మారెల్ గదిలో ఉన్నారా జూలీ?" అని అడిగాడు కొక్లే.

జూలీ జంకుతూ చెప్పింది: "అక్కడే ఉన్నారనుకుంటాను. ముందు మీరు వెళ్లిచూసిరండి. అక్కడ ఆయన ఉన్నట్లయితే అప్పుడీయన్ని లోపలికి పిలుచుకువెళ్లవచ్చును."

"ముందు చెప్పి తరవాత నన్ను పిలుచుకువెళ్ళవలసిన అవసరం లేదండి. థామ్సన్ ఎండ్ ఫ్రెంచ్ కంపెనీ గుమాస్తా వచ్చాడని చెప్తే చాలు" అన్నాడు బ్రిటిష్ దేశస్థుడు.

యువతిముఖం పాలిపోయింది. గబగబా మెట్లు దిగి ఇమాన్యూల్ వద్దకు వెళ్లింది. ఈలోగా కొక్లే మేడమీద వరండాలో గుమాస్తాని కూర్చోబెట్టి ఒక గదిలోకి వెళ్లాడు. తరవాత ఇవతలికి వచ్చి గుమాస్తాని పిలిచాడు.

మారెల్ ఒక మేజావద్ద కూర్చుని చిట్టాలు తిరగవేస్తున్నాడు. పద్నాలుగేళ్లలో అతనిలో చాలామార్పు వచ్చింది. ముఖం తెల్లగా పాలిపోయిఉంది. తల పూర్తిగా నెరిసిపోయింది. ముఖమంతటా ముడతలు పడ్డాయి. ఒకప్పుడు స్థైర్యాన్ని స్ఫురింపచేసే అతని ముఖంలో ఆందోళన, చాంచల్యం వ్యక్తమౌతున్నాయి. ఏవిషయంలోనూ ఏ నిర్ణయానికీ రాలేకపోతున్న స్థితి స్పష్టపడుతోంది.

కొత్త వ్యక్తిని చూడగానే అతని ఆందోళన అధికమయింది. "మీరు నాతో మాట్లాడవలసినపని ఉందన్నారా?" అని అడిగాడు.

"అవునండి. నే నెవరితరఫున వచ్చానో తమకి తెలుసుననుకుంటాను."

"అవును. థామ్సన్ ఎండ్ ఫ్రెంచ్ కంపెనీ తరఫున వచ్చారని మా కాషియర్ చెప్పాడు."

"అవునండి. మా కంపెనీ ఈ మాసంలోనూ వచ్చేమాసంలోనూ మొత్తం నాలుగులక్షల ఫ్రాంకులు ఫ్రాన్స్‌దేశంలో చెల్లించాలి. మీ కంపెనీ ఎన్నడూ గడువుదాటకుండా ధనం చెల్లిస్తూ వస్తూఉంటుంది కాబట్టి, మీ సంతకంతో వచ్చిన బిల్లులు అన్నిటినీ మా కంపెనీ తీసుకుని ధనం ఇస్తూవచ్చింది. ఇప్పుడా బిల్లుల తాలూకు ధనాన్ని మీవద్ద తీసుకుని ఈ దేశంలో మేం చెల్లించవలసిన చెల్లించడానికి నన్ను పంపారు."

మారెల్ తడబడుతూ, "మొత్తం ఎంతుంటుంది?" అన్నాడు.

బ్రిటిష్‌దేశస్థుడు జేబులోనించి ఒక కాగితాలకట్టతీసి చూస్తూ ఇలా చెప్పాడు: "మొట్టమొదట కారాగారాల తనిఖీఆఫీసరు బోవిల్ మావద్ద తీసుకున్న రెండులక్షల ఫ్రాంకుల బిల్లుంది. ఇది ఉందని మీ రొప్పుకుంటారా?"

అనువాదం: సీతారామ్

"తప్పకుండా ఒప్పుకుంటాను. అయిదేళ్ల కిందట అత నా ధనాన్ని నాకు నూటికి నాలుగున్నర వడ్డీకి ఇచ్చాడు."

"దాన్ని మీ రెప్పుడు చెల్లించాలి?"

"ఈ నెల పదిహేనో తేదీని సగం, వచ్చే నెల పదిహేనో తేదీని మిగతా సగం ఇవ్వాలి."

"ఇది సరిపోయిందండి. తరవాత మీ సంతకాలతో వచ్చినది ముప్పై రెండున్నర వేల ఫ్రాంకులికి బిల్లు లున్నాయి. ఇవిగో."

"అవునండి. అవన్నీ నాకు గుర్తే. ఇంతేనా, ఇంకా ఉన్నాయా?"

"ఉన్నాయండి. ఇవి కాక రెండులక్షల ఎనభైవీసున్నర వేల ఫ్రాంకులికి సెక్యూరిటీ లున్నాయండి."

ఈ లెక్కల్ని బ్రిటిష్ దేశస్థుడు ఏకరువు పెడుతున్నప్పుడు మారెల్ పడుతున్న మనోవ్యథని వర్ణించడం కష్టం.

"రెండులక్షల ఎనభైవీసున్నర వేలు" అని గొణిగాడు. మాటలు పెదవులమీద తేలిపోతున్నాయి.

"అవునండి" అన్నాడు బ్రిటిష్ దేశస్థుడు. "మీరీ ఋణాలు చెల్లించలేని స్థితిలో ఉన్నారని మార్సెల్స్ నగరంలో వదంతు లున్నాయని మీకు నేను చెప్పక తప్పదండి."

ఈ కరుకుమాటలు వినేసరికి మారెల్ ముఖం మరింత పాలిపోయింది. అతన్ని భీతి ఆవహించింది.

"అయ్యో! మారెల్ ఎండ్ సన్ కంపెనీ నేటివరకూ ఒక్క బిల్లు గడువుకి చెల్లించకుండా ఉన్నదిలేదు."

"అవునవును. అది మాకు తెలుసునండి. కాని ఇప్పుడీ బిల్లుల్ని మీరు గడువులోపల చెల్లించగలరా అని అడుగుతున్నాను."

మారెల్ వొణికిపోయాడు. కొత్త వ్యక్తిని శ్రద్ధగా పరిశీలించి ఇలా అన్నాడు: "చెల్లించగలను—నాఓడ క్షేమంగా రేవు చేరినట్లయితే. చేరుతుందనే ఆశపడుతున్నాను. కాని ఏ ప్రమాదం వల్లనైనా ఫరావోనౌక రాకపోయినట్లయితే, బిల్లుల చెల్లింపు కట్టిపెట్టవలసి ఉంటుంది."

"ఈ చిక్కులో మీకు సహాయం చెయ్యగల మిత్రు లెవరూ లేరా?"

మారెల్ చిరునవ్వు నవ్వాడు. కాని అది చిరునవ్వులా లేదు. ఇలా అన్నాడు: "ఇటువంటి విషయాల్లో మిత్రు లుండరు. వ్యాపారబాంధవ్యాలు మాత్రమే ఉంటాయి."

"నేను వస్తున్నప్పుడు ఒక ఓడ రేవు చేరగా చూశాను."

"తెలుసును."

"అది మీ ఓడ కాదా?"

"కాదు. అది బోర్డో నగరానికి చెందిన ఓడ. దాని పేరు లా గిరాండ్."

"ఆ ఓడనావికులు మీ ఓడనిగురించి సమాచారం చెప్పలేరా?"

"నేను నిజం చెప్పేస్తున్నానండి. నా ఓడనిగురించి సమాచారం తెలియక ఎంత బాధపడుతున్నానో, తెలిస్తే అంతకంటె బాధపడవలసి వస్తుందని భయపడుతున్నాను. సమాచారం రానంతవరకూ కనీసం ఆశ అనేదైనా ఉంటుంది."

"అదేమిటి?" అన్నాడు బ్రిటిష్ దేశస్థుడు వెనక్కి తిరిగి. "ఆ రొదేమిటి?"

మెట్లదగ్గర పెద్ద ధ్వని, కలవరం విన వస్తున్నాయి. ఎవరో విలపిస్తూ అటూ ఇటూ పరుగులెడుతున్నారు.

ఇద్దరూ ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు. మారెల్ శరీరం యావత్తూ కంపించిపోతోంది. కొత్తవ్యక్తి జాలిగా అతని వంక చూస్తున్నాడు. గదితలుపు తెరుచుకుంది. జూలీ కనపడింది బుగ్గలు కన్నీళ్లతో తడిసిపోయాయి. ముఖం పాలిపోయింది. మారెల్ లేచి నిలబడ్డాడు.

"నాన్నా!" అంటూ వచ్చి తండ్రిచేతుల్లో వాలిపోయింది.

"నా నోటితో ఎలా చెప్పను?" అని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"అయితే, ఫరావో కూడా మునిగిపోయిందా?" అన్నాడు మారెల్ వొణికిపోతూ. కూతురు సమాధానం చెప్పలేదు. అవునన్నట్లు తలూపింది.

"మరి నావికులు?" అని అడిగాడు మారెల్.

"అందరూ బతికారు" అంది కూతురు. "బోర్డోనౌక వాళ్ళందర్నీ రక్షించింది."

మారెల్ ఊర్ధ్వదృష్టితో చేతులెత్తి నమస్కరించాడు. ఏదో దివ్యశక్తితో బాధని జయించినట్లు, సుఖదుఃఖాల కతీతమైన భావం ఒకటి అతని ముఖంలో వ్యక్తమవుతోంది. "ఈ బాధ లితరు లెవరికీ వద్దు భగవంతుడా! ఈ పరీక్షకి నన్నొక్కడినే నువ్వెంచుకున్నందుకు నేను కృతజ్ఞుణ్ని" అన్నాడు.

బ్రిటిష్ దేశస్థునికి కళ్లు చెమ్మగిలినాయి.

చిట్టచివరికి తేరుకుని మారెల్ బిగ్గరగా అన్నాడు: "మీరందరూ అక్కడ నిలబడ్డం ఎందుకు? ఇలా రండి."

ఇంతలో మారెల్ భార్య విలపిస్తూ ప్రవేశించింది. ఆమె వెనక ఇమాన్యూల్ వచ్చాడు. ఆవెంట మొరటు తేరిన నావికులు వచ్చారు.

"ఎల్లా మునిగిపోయింది?" అన్నాడు మారెల్.

"ఇలా రా, పెనిలన్" అని ఒక నావికుని పిలిచాడు ఇమాన్యూల్. "ఏం జరిగిందో చెప్పు" అన్నాడు.

పెనిలన్ నోట్లో పొగాకు ఈ బుగ్గనించి ఆ బుగ్గకి తీసుకుని, ఒక అడుగు ముందుకు వచ్చి, ఒక్క కాలుమీదే ఒంటి బరువంతా మోపుతూ రెండో కాలు కదుపుకుంటూ ఇలా చెప్పాడు:

"తుపాను అందుకునేసరికి మేం బ్లాంక్ అగ్రానికీ, బోయడల్ అగ్రానికీ మధ్య ఉన్నామండి. వారంరోజులు గాలి నిశ్శబ్దంలా ఉంది. ఆ తరవాత జోరెక్కింది. నేను చుక్కాని దగ్గరున్నాను. కెప్టెన్ నాదగ్గర కొచ్చి నిలబడ్డాడు. 'ఆమూల ఆ మబ్బులేమిటోయ్ పెనిలన్' అన్నాడు. 'ఏమి టేమిటి? అవి జోరుగా ఇటువైపే పనిగట్టుకుని వస్తున్నాయి' అన్నాను. 'నేనూ అదే అనుకుంటున్నాను' అన్నాడు కెప్టెన్. తెరపగ్గాలు వొదులు చెయ్యమని అక్కడనించే ఆయన కేకపెట్టాడు. వొదులు చెయ్యడానికి చాలసేపు పట్టింది. వొదులు చేశారో లేదో రివ్వుమని కొడుతూ వచ్చిపడింది హోరుగాలి. బోటు ఊగిపోడం మొదలెట్టింది. 'అయితే తెరచాప మరీ ఎక్కువుందోయ్' అన్నాడు కెప్టెన్. 'అందరూ తలో చెయ్యి వేసి తెరచాపలు దించండి' అని కేకపెట్టాడు. అయిదు నిమిషాల్లో పెద్ద చాప దించేశారు. ఇంకా పై చాపలూ, వెనకచాపలూ ఉన్నాయి. 'ఏమిటోయ్ బుర్ర ఊపుతున్నావ్ పెనిలన్?' అన్నాడు కెప్టెన్. 'ఏముంది? ఇది పెద్ద తుపానే. కాకపోతే నా పేరు పెనిలన్ కాదు' అన్నాను. నా మాట లింకా పూర్తి కానేలేదు, ముందుగా ఒక తెర గాలి కొట్టింది. కెరటాలు లేచిపోయినాయి. కెప్టెన్‌కి ఇదంతా తెలుసును. 'మీది తెరచాపల్లో రెండు దించండి' అని కేకపెట్టాడు. పక్కపాడుగు పగ్గాలు విప్పమన్నాడు. వెనక తెరచాపలు దించమన్నాడు."

"అబ్బే, ఆ సముద్రంలో అది చాలదు" అన్నాడు బ్రిటిష్ దేశస్థుడు. "నేనైతే నాలుగు తెరచాపల్నీ దించిఉంచేవాణ్ణి" అన్నాడు.

హఠాత్తుగా కొత్త వ్యక్తి ఇలా మాట్లాడేసరికి అందరూ తెల్లబోయారు. అతని కంఠస్వరం స్థిరంగా ఉంది.

"మేము అంతకంటె ఎక్కువే చేశాం" అన్నాడు పెనిలన్. "పై తెరలన్నీ దించేసి, చుక్కాని గాలికి వాలుగా తిప్పాం. పదినిమిషాల్లో బోటు బాణంలాగ పరిగెత్తడం మొదలెట్టింది."

"బోటు చాలా పాతది. అది అలా వొదిలిపెట్టవలసింది కాదు" అన్నాడు బ్రిటిష్ దేశస్థుడు.

"సరిగ్గా అదే కారణం" అన్నాడు పెనిలన్. "ఒకచోట నీరెక్కడం మొదలు పెట్టింది. అది కప్పడానికి ప్రయత్నం చేశాం. ఇంక మనం మునిగిపోతామనుకుంటాను పెనిలన్" అన్నాడు కెప్టెన్. 'చుక్కాని నా కిచ్చి, నువ్వు కిందితొట్టిలో కెళ్లు' అన్నాడు. చుక్కాని వొదిలేసి తొట్టిలో కెళ్లాను. అప్పుడే అక్కడ మూడడుగులలోతు నీరెక్కింది. పైకి పరిగెత్తి పంపులు తెమ్మని కేకలెట్టాను. కాని అప్పటికే అంతా మించిపోయింది. పంపుల్తో ఎంత తోడినా లాభం లేకపోయింది. తోడినదానికి రెట్టింపు నీరెక్కుతోంది."

"తరవాత ?" అన్నాడు బ్రిటిష్ దేశస్థుడు.

"నీళ్లు గంటకి రెండంగుళాల చొప్పున మట్టం ఎక్కుతోంది. చిట్టచివరికి కెప్టెన్ అన్నాడు. 'చాలింక రండి. మనం చెయ్యగలిగినంతా చేశాం. మారెల్ మనమీద మాట పడెయ్యలేరు.' ఇంక చిన్న బోట్లు దించమన్నాడు."

పెనిలన్ ఈ మారు మారెల్ వంక తిరిగి అన్నాడు "చూడండి. మాకు ఫరావో అంటే ప్రీతి లేకపోలేదు. నావికుడికి నౌకంటే ఎంత ప్రాణమైనప్పటికీ, తన ప్రాణంకంటె తీపికాదు. అందువల్ల చిటికలో చిన్న బోట్లు ఓడమీదనించి దిగాయి. పెద్ద పడవలోకి ఎనమండుగురం ఎక్కాం. కెప్టెన్ ఓడ దిగి రానంటాడు. కాని నేనే అతన్ని నడుము పట్టుకుని బలవంతాన పడవలోకి గెంటి, ఆఖర్ని నేనూ దూకాను. ఇంకొక్క క్షణం ఆలస్యమైతే, ప్రాణాలకి ముప్పువచ్చేదే. నేను దూకీ దూకగానే ఫెళఫెళమని చప్పుడయింది. కన్నుమూసి తెరిచేటంతలో తెరచాప కొయ్యలు విరిగిపోయాయి. తెరచాప లెగిరిపోయాయి. ఇంక మామాట ఆట్టే చెప్పవలసిందిలేదు. మూడురోజులు ఆహారం నీరు లేవు. తరవాత లా గిరాండ్ కనపడింది. సంజ్ఞచేశాం. వెంటనే అది మా దగ్గరకొచ్చి, అందర్నీ ఎక్కించుకుంది. అంతా సరిగ్గా నేను చెప్పినట్లుగానే జరిగింది. ఒక్కమాట పొల్లులేదు. నేను నావికుణ్ని. ప్రమాణంచేసి చెప్తున్నాను."

మారెల్ దీర్ఘనిశ్వాసం విడిచాడు. మెల్లిగా ఇలా అన్నాడు: "నాయనా మీరు ధైర్యవంతులు. మొదటినించీ నన్ను నా దురదృష్టమే వెన్నాడుతోంది. నా కర్మనే నేను దూషించుకోవాలి. మీ కెంతెంత జీతాలు రావాలో చెప్పండి."

"మూడు మాసాల జీతం రావాలండి" అన్నాడు పెనిలన్.

"కాక్లే, వీళ్లందరికీ ఒక్కొక్కడికి రెండువందల ఫ్రాంకులు చొప్పున ఇయ్యి. నారోజులు బాగుంటే పైన రెండేసి వందలివ్వవలసినవాణ్ని. కాని నా స్థితి బాగుండలేదు. నా దగ్గిరింక మిగిలిన ధనం నాది కాదు. నన్ను క్షమించండి."

పెనిలన్ జాలిగా నవ్వాడు. వెనక తన మిత్రులతో గుసగుసలాడి మళ్ళీ ముందు కొచ్చాడు: "మా వాళ్ళిప్పటికి ఏభై ఫ్రాంకు లిస్తే చాలునంటున్నారండి, మిగతాది తరవాత ఇవ్వచ్చునండి." అన్నాడు.

మారెల్‌కి దుఃఖం పొంగివస్తున్నట్లుంది. దిగమింగి ఇలా అన్నాడు: "నాయనా! మీ మేలు నే నెన్నడూ మరిచిపోలేను. నిజంగా మీ అందరి హృదయాలూ బంగారంవంటివి. ఫరవా లేదు. డబ్బు తీసుకోండి. మీ కింకెక్కడైనా ఉద్యోగం దొరికితే చేరండి."

ఈ ఆఖరిమాటతో నావికుల్లో గడబిడ బయలుదేరింది. అందరూ భీతితో ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. పెనిలన్ నిశ్చేష్టుడైనాడు. కాస్తంతలో తప్పింది కాని లేకపోతే పొగాకు తమ్మ గొంతుకలో అడ్డుపడేదే. "అంటే, మమ్మల్ని మీ ఉద్యోగం నించి తొలగిస్తున్నారా? మేం చేసిన పని మీకు నచ్చలేదా?" అన్నాడు.

"లేదులేదు" అన్నాడు మారెల్. నచ్చకపోవడం కాదు. నేను మిమ్మల్ని తొలగించడం లేదు, కాని నేనేం చెయ్యగలను! నా కింక ఓడలు లేవు. నావికులింక నా కవసరం లేరు."

"ఏమిటి? మీ కింక ఓడలే లేవా? లేకపోతే కొత్త నిర్మించేవరకూ మేం ఉండగలం లెండి."

"కాని కొత్తఓడలుకట్టించడానికి నాదగ్గిరధనంలేదు పెనిలన్. మీరు భక్తితోనూ ప్రేమవల్లనూ నా దగ్గిరే ఉంటా మంటున్నారు. కాని ప్రయోజనం లేదు."

"మీదగ్గిర ధనం లేకపోతే మా కెందు కిస్తారీ జీతాలు! ఫరావో అలంకారాలన్నీ పోయి ఒట్టి మొండుసముద్రంమీద తేలుతోంది. అలాగే మేమూ ఉంటాం."

"చాలు నాయనా చాలు." అన్నాడు మారెల్. అతనికి దుఃఖం ఆగడంలేదు. "మీరు వెళ్లండి. మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. ఎప్పటికైనా మంచిరోజులు వస్తాయేమో. ఇమాన్యూల్, నువ్వు వీళ్లని తీసుకెళ్లి నేను చెప్పినట్టు చెయ్యి" మారెల్ కాక్లేకి కూడా సంజ్ఞచేశాడు. వాళ్లందరూ వెళ్లిపోయారు.

మారెల్ భార్యతోనూ కుమార్తెతోనూ "నే నీ పెద్దమనిషితో మాట్లాడాలి. ఒక్కక్షణం వెళ్లండి" అన్నాడు.

స్త్రీలిద్దరూ బ్రిటిష్ దేశస్థుడక్కడున్నాడని అప్పుడుగాని కనిపెట్టనేలేదు. అతనివంక చూసి వెళ్లిపోయారు.

మారెల్ కుర్చీలో కూలబడిపోయాడు. "అంతా చూస్తూనే ఉన్నారు కదా? అంతా విన్నారు. ఇంక నేను చెప్పవలసిం దేమీ లేదు."

"చూశానండి, మరొకముప్పు వచ్చిపడింది మీకు. అందువల్లనే నే నొక చిన్న సహాయం చెయ్యాలనుకుంటున్నాను."

"అయ్యో" అనుకున్నాడు మారెల్.

"ఉండండి. మీ కంపెనీలో మాపెట్టుబడికూడా ఉంది కాదూ?"


"ఏమున్నా లేకపోయినా, త్వరలో చెల్లించవలసిన బిల్లులు చాలా ఉన్నాయి మీ దగ్గర."

"మీకు మరికొంత గడువు కావాలా?"

"మరికొంత గడువిస్తే, నా పరువునీ, నా ప్రాణాన్నీ కాపాడినవారౌతారు."

"ఎంత గడువు కావాలి?"

(43-వ పేజీ చూడండి)



1

బుష్‌కోటుమీద ఒకరోజున సీతారామయ్యగారికీ శంకరానికీ మధ్య యుద్ధం జరిగినంత పనయింది. అసలు సీతారామయ్యగారే పిలిచి పేచీపెట్టారు. దారినపోయే శంకరాన్ని పిలిచి, "ఆ బుష్‌కోటేమిటి, మహాశయా! బుడబుక్కలవాడి వేషంలాగ; ఎబ్బెట్టుగా. చాలా అసహ్యంగా వుంది" అన్నారు సీతారామయ్యగారు.

శంకరానికి చిర్రెత్తుకొచ్చింది. "మీ లాల్చీ మీ మొహంలా వుంది. దాన్నొకసారి చాకలాడికైనా పారెయ్యండి డబ్బులు నేనైనా ఇచ్చుకుంటాను. నేనేదో డ్రెస్సు వేసుకుంటే మీకెందుకండీ. మిమ్మల్ని కొట్టానా? తిట్టానా? ఎందుకు మీకింత అసహనం? ఒకళ్లు రెపరెపలాడుతూ కనిపిస్తే ఊవూరివాళ్లకి పిచ్చెక్కుతుందనుకుంటాను? ఇలాగ దారినపోయేవారిని చూసి రాగివెయ్యకపోతే సంసారానికుపయోగపడే పని ఏదైనా చేసుకోరాదూ? బుష్‌కోటు వేసుకున్నందుకు మీకు నన్ను విమర్శించడానికి హక్కు వుంటే, లాల్చీ వేసుకున్నందుకు మిమ్మల్ని నేనూ ఏకెయ్యగలను. ఇన్నాళ్లూ పెద్దలని పూసుకుంటూన్నకొద్దీ మీరు మరీ లోకువకట్టి నన్నాగామాల్ని అడ్డమైనచోటా తిడుతున్నారు." అని శంకరం నాలుగూ దులిపేశాడు.

చిన్నపెద్ద తారతమ్యం ఎరగకుండా పేలకని సీతారామయ్యగారు రిచ్చారు.

ఉదయపుర గ్రామం పెద్దలకొక విచిత్రమైన మనఃప్రవృత్తి వుంది. రంధ్రాన్వేషణం అంటే వాళ్లకెంతో ఇష్టం.

ఓర్వలేనితనం వాళ్లలో ఒక పెద్దజాడ్యం. ఇతరుల స్నేహం ఆనందం వారికి చాలా కంటకంగా వుంటాయి.

రామం, శంకరం కలసి టిక్కుటక్కుగా తిరుగుతోంటే వీధి అరుగులమీద పనీపాట లేక చుట్ట కాల్చుకుంటూ కూర్చున్న పెద్ద మనుష్యులు డిసెంటరీ పట్టుకున్నవాళ్ళవలె గిలగిల కొట్టుకునేవారు.

రామానికి శంకరానికి మద్రాసులో కాలేజీలో చదువుతున్న రోజుల్లో గాఢ స్నేహం ఏర్పడింది. ఆ రోజుల్లోనే వారు నవనాగరికతా లక్షణాలు కొన్ని అలవరచుకున్నారు. ఎప్పుడూ దొరల్లాగ "ట్రిమ్‌గా డ్రెస్ వేసుకుంటారు. సూటైనా వేస్తారు. లేదా చొక్కా నిపేంటులోపలికి కుక్కుతారు. అదేమిటో, చొక్కా పైనవేస్తే, వారి విలువతగ్గినట్లు, లోపల దూరిస్తే హెచ్చినట్లు వాళ్ళు భావిస్తారు. పేంటుగాని, చొక్కాగాని, కోటుగాని ఒక పిసరైనా మాసినా, చినిగినా దానిని విసర్జింపవలసిందే. సరి, ఈ మధ్య బుష్‌కోట్లంటూ మిడతల దండులాగ వచ్చిపడ్డాయి. ఇక, తద్దినంలాగ రోజూ గెడ్డం గియ్యవలసిందే. బూట్లకు రోజూ పాలిష్ చెయ్యవలసిందే.

భార్యను ఇంట్లోంచి గెంటేశాను అని రామం ఉత్తరం వ్రాశాక శంకరం ఉదయపురానికి బదిలీ చేయించుకున్నాడు. ఇప్పుడిద్దరూ ఒక గూటిపిట్టలే అయ్యారు. ఎంతో ప్రేమించి పెళ్ళిచేసుకున్న శంకరంభార్య నోటిసైనా ఇయ్యకుండా హఠాత్తుగా చచ్చిపోయింది.

రామం భార్య విషయంలో రెండు విధాలుగా చెప్తుంటారు. తనే "దాన్ని" ఇంట్లోంచి "గెంటేశానని" రామం అంటాడు. అదే ఏ తురకాడితోనో లేచిపోయిందని కొందరంటారు. రామం చిల్లరమల్లరగా "పోకిరీ వెధవలా" తిరగడంవల్ల దానికి విసుగెత్తి, వీడితో వేగలేక లేచిపోయిందని ఒక వాదం. నిజానికి, రామానికి అమ్మాయిలంటే పడి చచ్చిపోయే దురభ్యాసం వుందిట. ట్రాముల్లో "లోపల సీటుంది. పోయి కూర్చోండి" అని కండక్టరు ఎంత మొత్తుకున్నా వినక అమ్మాయిలు కూర్చున్నచోటే ద్వారపాలింలాగ నిలబడి బఫూను చేష్టలు చేసేవాడట. ఏ బస్సులోనో ఒక అందమైన అమ్మాయి మందహాసం ఎందుకో జేస్తే, ఏతత్ మందహాసం తనకోసమే ఉద్దేశింపబడిన దనుకుని మురిసిపోయి, సదరు అమ్మాయి ఎక్కినబస్సే ఎక్కి, దిగినచోటే దిగి, కుక్కలా వెంటబడి, తీరా ఆవిడ తీక్ష్ణమైన ఛీదరింపు దృష్టితో ఇతన్ని చూసి ఇంట్లోకి పోయేసరికి వీపు విరుచుకుంటూ ఇంటికి వచ్చేవాడట. అతనికి అందం లేదుకాని అంగసౌష్టవం వుంది. మనిషి షోకీలా కనిపిస్తాడు. "సొసైటీ గరల్స్" కింద చెలామణీ అవుతున్న కొంతమంది "కిరస్తానీ" పిల్లలు తన వెంటపడేసరికి, పెద్ద గొప్పకింద యివన్నీ భార్యతో చెప్పేవాడట. ఈ విషయంలో ఇద్దరికీ రోజూ పోట్లాట జరిగేది. మరి ఎవరు ఎవర్ని విసర్జించారో ఎవరికీ తెలియదు.

ఉదయపురం వచ్చినప్పటినుంచి శంకరం ఎప్పటికప్పుడు రామాన్ని ఈ విషయంలో వారిస్తూనే వచ్చాడు. కాని రామం "ఈ విషయంలో జోక్యం కలిగించుకోవద్ద" నేవాడు. ఆఖరికి గుళ్ళో పురాణం జరుగుతున్నప్పుడు, ఆడవాళ్లను చూసి రామం పోకిరిచేష్టలు కొన్ని చెయ్యగా, పురాణం వినడానికి వచ్చిన వారిలో కొంతమంది దృఢకాయులు (అందులోనూ ఆవూర్లో రేషనింగు లేదేమో) మెత్తగా కుళ్ల పొడిచాకగాని రామం ఈ దురభ్యాసానికి స్వస్తి చెప్పలేదు. అవమానం భరించలేక రెండునెలలు మంచం పట్టాడు. చావుతప్పి కన్ను లొట్టపోయింది.

2

సీతారామయ్యగారికి పిల్ల పెళ్లివిషయం గడ్డుసమస్యగా పరిణమించింది. అదేమిటో 18 ఏళ్లు దాటాక ఆడపిల్లలు నిచ్చెన ఎక్కినట్లు పెరిగిపోతారు. ఎదిగిన పిల్లని ఇంట్లో వుంచుకోవడం హిందూ మతాచారం ప్రకారం మహాపాపం మరి. ఏళ్లు హెచ్చినకొద్దీ పిల్ల భారం, కాలదోషం పట్టినకొద్దీ కన్యాత్వం తాలూకు పాపం హెచ్చిపోతుంటాయి. "ఏమయ్యా, పిల్ల పెళ్లి ఎప్పుడేమిటి?" అన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేక చూస్తున్నాడు శీతరామయ్యగారు.

ఆడపిల్లకు పెళ్లిచెయ్యడం అంటే ఈ రోజుల్లో మాటలా? తక్కిన వస్తువుల ధరలతోపాటు పెళ్లికొడుకుల ధరలుకూడా మండిపోతున్నాయి. వీటికికూడా "ఇన్ఫ్లేషన్" వచ్చి పడిందా యిరి! భమిడిపాటి కామేశ్వరరావుగారు చెప్పినట్లు, వరుల ధరలకుకూడా ఒక కంట్రోలూ దబ్బా వుండాలని ఎవరూ ఆలోచించరాయిరి! సీతారామయ్యగారి సంసారమూ చితికిపోయింది. తనకున్న భూమిని తనఖా పెట్టి బ్యాంకులో పుచ్చుకున్న డబ్బును వడ్డీ వ్యాపారంలో తిప్పాడు. కాని, అప్పుపుచ్చుకున్న పీనుగులు దరిద్రనారాయణ (పాపర్) సర్టిఫికెట్టులు తీసుకురావడంతో ఆస్తిఅంతా వేలమైపోయి, అప్పుపోగా 2,000 రూపాయలు చేతి కొచ్చాయి. లేకపోతేనా? నాణ్యమైన వరుణ్ణి తెచ్చి శారదపెళ్లి వైభవంగా చేసేవాడే.

కాని, ఆయన లౌకికజ్ఞానం, అనుభవం వున్న వ్యక్తి. నవనవలాడే వంకాయలధర మండపోతున్నప్పుడు నాసిరకం కాయలు చవగ్గా కొనడంలోని "ఎకానమీ" ఆయనకు బాగా తెలుసు. మార్కెట్టులో సెకండు హేండు వస్తువులు చవగ్గా దొరుకుతాయి. వాడకం హెచ్చినకొద్దీ వాటిధర తగ్గుతూంటుంది. కొన్నివస్తువులు ఎదురిస్తేనేగాని చెల్లుబడి కానంత విపరీతంగా వాడబడి వుంటాయి. అవివాహిత పుత్రికాభారంతో క్రుంగిపోయే తండ్రులు వివాహపు మార్కెట్టులో రెండో పెళ్లి పెళ్లికొడుకులను వదకటం కద్దు. సీతారామయ్యగారు తన పిల్లను రెండోపెళ్ళివానికిచ్చి పెళ్ళి చెయ్యాలని ఏనాడో నిశ్చయించుకున్నాడు. కాని ఈ ప్రసక్తి వచ్చినప్పుడల్లా, ఆయన భార్యారత్నం ఉరిపెట్టుకొని చస్తాననేది. అయితే, ఆయన, భార్య బెదిరింపులకు భయపడి దాసోహం అనే ఘటం కాదు.

ఆయన దృష్టిలో ఈమధ్య కొన్నాళ్ళనుంచి శంకరం మెలగుతూ వచ్చాడు. ఒకానొక శుభముహూర్తాన (ముహూర్తం చూసుకోందే ఏపనీ చెయ్యని ఛాందసుడాయన) భార్య చస్తే చచ్చిందని, శంకరంతో ఈమాట కదిలేద్దామని ఆయన బయల్దేరాడు.

నెమ్మదిగా నడవబడుతూ శంకరం ఇల్లు చేరుకొనేసరికి చీకటిపడింది. శంకరం అప్పుడే వచ్చిన పేపరుతీసి చదువుదామనుకుంటూండగా సీతారామయ్యగారు కనిపించారు. వెనక తన్నీ, తన స్నేహితుణ్ణీ ఆయన ఎంత యాగీచేసినప్పటికీ, ఇంటికి వచ్చిన అతిథి కాబట్టి, చూపవలసిన మర్యాదంతా చూపించాడు. "లోపలికి దయచేయండని" కుర్చీ చూపించాడు. అలసి వుండటంవలన సీతారామయ్యగారు పడకుర్చీలో కూలబడ్డారు.

"ఏమండీ ఇల్లా వచ్చారీవేళ? నావల్ల ఏమైనా పనుందా?" అని అడిగాడు శంకరం.

"అబ్బే, పనీలేదూ పాడూలేదు. మావంటి ముసలివాళ్లకి మీవంటి పడుచువాళ్ళతో కాస్సేపు కాలక్షేపం చెయ్య

లని వుంటుంది. అది అసహజమంటారా?" అన్నాడు సీతారామయ్యగారు.

ఆయన పేరు మోసిన లౌకికుడు. ఆయనతో 5 నిమిషాలు మాట్లాడితే లౌక్యం అంటే ఏమిటో తెలుస్తుంది. ఆయన పని లేందే ఎవరిదగ్గరికీ, ముఖ్యంగా అపరిచితుల వద్దకు పోడు. కాని, వెళ్ళినప్పుడు ఫలానా పనికోసమే వచ్చానన్నట్లు మాట్లాడుడు. ఏదో ఈ కబురు ఆ కబురు చెప్పుతూ ఎల్లాగో తను వచ్చిన పని విషయం సంభాషణలోకి లాక్కొస్తాడు. కాని ఆయన వెళ్ళాక ఆయన వచ్చినపని 'వారికుటు'కు కూడా తెలిసిపోతుంది.

"మీరల్లా అన్నందుకు కృతజ్ఞుణ్ణే కాని, మీరు వూరికే వచ్చారంటే నమ్మలేకుండా వున్నాను. మహాత్ములూ రకరకారంటారు. ఇన్నాళ్ళూ నన్నూ రామాన్ని పోకిరీవెధవలకింద కట్టి మీరంతా యాగీచేశారు. అటువంటి మీరు నాతో కేవలం కాలక్షేపం చెయ్యడానికి వచ్చారంటే ఆశ్చర్యంగా వుండదూ! మీరే చెప్పండి." అని కొంత వుక్రోషంతో అన్నాడు శంకరం.

"అమ్మమ్మమ్మా. అలా అనకండి. మేమేదో పూర్వకాలపు ముండాకొడుకులం. కాలం మారిపోయిందని తెలుసుకోకుండా మావలె మిమ్మల్ని గుండుచేయించుకొని, పిలకపెట్టుకొమ్మనడం నిజంగా మూర్ఖత్వమే. దానిని మీరంత యిదిగా పట్టించుకోనవసరం లేదు. గతాన్నంతా మరచిపొమ్మని చెప్పడానికే నేనువచ్చాను. అయినా, వెధని కాకపోతే, మీరే డ్రెస్సు వేసుకొంటే నా కెందుకు చెప్పండి. ఛా ఛా" అని ఇంకా ఏమోమో స్వస్తోత్రం చేసుకుని, మయాన్ని "మీరల్లా తిట్టుకుంటూంటే నేను భరించలే"నని శంకరంచేత అనిపించుకొని, సీతారామయ్యగారు నెమ్మదిగా టాపిక్ మార్చారు.

"అయితే భోజనం హోటల్లోనా?"

"అబ్బె లేదండి. హోటళ్లు మరీ 'డర్టీ'గా వుండడంవల్ల స్వయంపాకమే మొదలెట్టాము."

"మంచిపనిచేశారు. ఈ పాడుహోటల్లో అడ్డమైనతిళ్ళూ తింటూంటే, డబ్బు దండగే కాకుండా ఆరోగ్యం కూడా చెడిపోతుంది. అయినా మీలాంటివాళ్లు వంటచేసుకుని చేతులు కాల్చుకుంటూంటే, నా కేదో చిన్నతనంగా వుంది సుమండి. ఎంతకాలం ఇల్లా తంటాలు పడతారు పాపం? పోనీ ఎక్కడైనా మంచి పిల్లనుచూసి పెళ్లి చేసుకోపోయారూ? మీకంటె పెద్దవాళ్లెంతమంది మళ్లీ పెళ్లిచేసుకోలేదు?"

శంకరానికి ఆయనవచ్చిన పని తెలిసిపోయింది. ఇంతవరకూ ఆయన కబుర్లతో బోరెత్తిపోయాడు. కాని సంభాషణ ఇప్పుడు రసకందాయంలో పడింది. శంకరానికి హుషారొచ్చింది.

"అయితే, పెళ్లిచేసుకోమంటారు?"అని అడిగాడు లోపల నవ్వుకుంటూ.

"తప్పకుండానూ. అదేమిటండోయ్? మీరు పెళ్లిచేసుకుంటానంటే ఎవరు ఆక్షేపించగలరు? వయసు మళ్లిందా అంటే అదీ లేదు. 30 ఏళ్లుంటాయేమో? అంతేనా" అని అడిగాడు సీతారామయ్యగారు.

"మీరేమీ అనుకోకుండావుంటే ఒకమాటడుగుతాను" అన్నాడు శంకరం.

"అబ్బెబ్బె. నే నేదో అనుకోవడమేమిటి నా పిండాకూడు? చెప్పండి. చెప్పండి."

మీ ధోరణిచూస్తే పెళ్లి రాయబారానికి వచ్చినట్లు అనిపిస్తోంది నాకు."

"వస్తేమాత్రం తప్పేమిటండీ? వృద్ధిలోకి రావలసిన మీవంటి కుర్రాళ్లు కష్టపడుతూంటే వూరుకుంటే మా పెద్దతనం ఎందుకూ తగలబడనా?"

"తప్పేమీ లేదు లెండి. కాని నావంటి పోకిరివాడికి పిల్లనిచ్చే పెద్దమనిషెవరని?"

"అదేమిటండోయ్. మీకు పిల్లనిచ్చి పెళ్లిచెయ్యటమే మహద్భాగ్యం. మీకేం లోటని? వయస్సా చిన్నది. అందవికారులు కాదుకదా? ఆస్తికి ఆస్తివుంది. వుద్యోగం పురుషలక్షణం అని చేస్తున్నారు కాని, అసలు 4 గుర్నీ పోషించగల తాహతుంది మీకు."

"అదంతా నిజమే కాని, మమ్మల్ని ఈవూళ్లో అసహ్యించుకోని వాళ్లెవరైనా వున్నారా అని నా సందేహం!"

"ఏదో చిన్నచిన్న విషయాలలో మాటామాటా వచ్చినంత మాత్రాన మిమల్ని గర్భశత్రువుల్లాగా చూస్తున్నారనుకోకండి. ఆమాటకొస్తే, ఎవరూ ఇయ్యక్కర్లేదు. నిక్షేపంలా, మా శారదనిచ్చి పంతానికైనా మీకు పెళ్లిచేస్తాను. ఏమనుకున్నారో?"

మీరీ విషయం కదిపేరుకాబట్టి ఇంకొక విషయం చెప్పాలి. నేను కీర్తిశేషులైన వీరేశలింగంగారి శిష్యుణ్ణి. నా భార్యచనిపోయిన తర్వాత పెళ్లిచేసుకోకూడదనుకున్నాను. ఒక వేళ చేసుకొంటే విధవా వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. భార్యపోయినవాడు భర్తపోయిన స్త్రీని వివాహంచేసుకోవడం సబబు. శంకరంకొరకబడటంలేదని, సీతారామయ్యగారు అక్కడనుంచి ఉడాయించడం మంచిదనుకున్నాడు.

"సరేలెండి. మళ్లీకలుసుకుందాం." అని సీతారామయ్యగారు లేచారు.

"మీమనస్సుకు కష్టంకలిగిస్తే క్షమించండి. పోనీ మా రామంతో ఈవిషయాన్ని కదలేసిచూడండి. అతనికి నాకున్న సదుద్దేశ్యాలు లేవు లెండి."

"ఏమిటండీమీరు నేనిందుకోసమే పని కట్టుకుని వచ్చానన్నట్లు మాట్లాడుతారు? అయినా కాని, గుళ్లో అయిన భాగోతం మీకు తెలుసుకదా? అతనికి నా పిల్లనెల్లా ఇచ్చేది?"

"మీరల్లా అనకండి. ఆభాగోతం జరిగ జరగడంవల్ల ఇప్పుడువాడు చాలా బుద్ధిమంతుడయ్యాడు. ఇప్పుడా స్త్రీముందు నడుస్తూంటే వాడసలు నడవనే నడవడు."

"ఏమోనండీ, మీసలహా పంచదారగడిగితే ఉప్పు వుందన్నట్లుంది." అని సీతారామయ్యగారు గొడుగు తలమీదవిప్పి తుంపరలలో ఇంటిదారి పట్టారు.

3

3 నెలల తర్వాత

సీతారామయ్యగారికి పిచ్చెక్కినట్లయింది. సంసారం ఇంత రచ్చకెక్కిన తర్వాత బతికితేం? చస్తేం? చస్తే నేమేలనుకున్నాడు. భార్యవొంతు తను పుచ్చుకుని నూతిలోపడి చస్తానంటే శారద పెళ్లి చేసి మరీ చావమన్నది భార్య.

ఇంతకీ ఏమైందంటే, ఆయన పెద్ద కూతురూ, వితంతువూ అయినకమల శంకరంతో లేచిపోయింది. ఇంతకంటే అవమానం ఏమైనావుందా? నలుగురిలోనూ తలెత్తుకుని తిరగలేక ఇంట్లో నే క్రుగ్గిపోతున్నాడాయన. కమల ఆ శంకరం వలలో పడి తన గొడవే చూసుకుందిగాని తన తల్లితండ్రుల ప్రతిష్ఠగురించిగాని, తన చెల్లెలు పెళ్లి గురించిగాని ఆలోచించిందా? శారద కింక ఎవడు పుస్తెకడతాడు, సంసారానికి ఇంత మచ్చవచ్చినతర్వాత? ఎంత అఘాయిత్యం చేశాడు ఆ శంకరంగాడు మర్యాదస్థుడిలాగ వున్నట్లేవుండి! తన కూతురు అంత నేటు సాహసిస్తుందని తనెన్నడూ అనుకోలేదు.

తన బంగారం మంచిదైతే ఆ శంకరాన్ని అనవలసిన పనేముంది? వాడు విధవనే పెళ్లాడుతానన్నాడు. దాం తగలయ్య, తన కూతురే వాడి ఆశయాన్ని తీర్చాలిగావును? తన కూతురుగాక ఇంకే యితర విధవముండతోనైనా లేచిపోతే తన కేమీ బాధ లేకపోను. ఇంతకీ ఇంట్లో "పీనుగులు" ఆయన మాట వింటేగా? ఏమిటో, ఇంట్లో అంతా చెరువునీళ్లు లేకపోతే వురిపెట్టుకుని చస్తా

మంటారు? చెరువునీళ్లు తెచ్చుకున్నా పరవాలేకపోను? కమలని రాత్రిళ్లు నీళ్లకని పంపక నువ్వే తగులడవే అంటే పెళ్లాం ప్రతీదానికీ ఎతిఅంటే ప్రతిగదా?

ఊర్లోవాళ్లుమాత్రం తక్కువ తిన్నారా? ఇన్నాళ్లు పూరుకుండి, దొంగపక్ష, ఆరునెలలకు కుక్క మొరిగినట్లు, ఇప్పుడు ఒక్కటొక్కటే బయటపెడుతున్నారు. ఆ శంకరంగాడు కమల రోజూ చెరువుగట్టు దగ్గిర కలుసుకుని సరసాలాడుకొనేవారట! అందుకే కామోసు, ఆ మధ్యన ఇంట్లో చెరువునీళ్లు రెండుగంటలకల్లా అయిపోవడం, ఈ టక్కులాడి నే తీసుకొస్తానంటూ వెళ్లి కొంచెం ఆలస్యంగా రావడం పదేపదే జరిగేవి. శంకరం మొదట్లో తనదగ్గరకు వచ్చి కమలను తనకి, శారదను రామానికి ఇచ్చి పెళ్లిచెయ్యమని అడిగితే, ఏదో పాశ్చాత్య నాగరికతావ్యామోహంలో పడి గొప్పకి విధవని పెళ్లిచేసుకొంటానంటున్నాడనుకున్నాను. అయినా, వాడి మూర్ఖత్వం తగలెయ్య, శుభ్రమైన పిల్లని పెళ్లాడమంటే, వెధవముండనే పెళ్లాడతానని ఏడ్చేవాడు? అప్పటికే కమలను వాడు బుట్టలో వేసుకునివుంటాడు! కమలను తనకిచ్చి పెళ్లిచెయ్యమని వాడు తనతోనూ, శారదని పెళ్లాడమని తను వాడితోనూ వాదిస్తూంటే, అంతా తలుపుచాటునుంచి ఆ కమల పినుగ చెవులు నిక్కపొడుచుకుని విందట-పెళ్లాం నిన్న చెప్పింది. ఇంకో ఏడాది పోయాక తగులడకపోయిందీ? ఆవిడకేం? ఇంట్లో శుబ్బరంగా ఇద్దెనులాగ పూరుతోంది. బయట తాను భరించాలి రొష్టుఅంతా భార్యను తోసేసినా పాపం వుందీ?

సీతారామయ్యగారికి కోపం ఆగక, తిన్నగా వంటింట్లోకి పోయాడు.

"ఏమండీ, వాళ్ల జాతకమైనా తెలిసిందా? వుత్తరం రాలేదూ?" అని నరసమ్మగారు ఆదుర్దాగా అడిగింది.

"నీపిండాకూడు. వుత్తరం లేదేమీ లేదు. ఇంకా ఆ తుంటరిముండమీద మమకారం పోలేదు నీకు. ఇన్నాళ్లూ గారంమప్పి, సంసారాన్ని నట్టేట్లో ముంచావు. రేపు ఈ శారదకూడా ఏ తురాకాడితోనో లేచిపోతేగాని నీ ప్రేమ చరితార్థంకాదు."

"అదేమిటండీ. మీ దంతా చోద్యం. నే నేమన్నా వాళ్లని లేచిపొమ్మన్నానా? రోజులల్లా మండిపోతున్నాయి. దానికి మనమేం చేస్తాం? మన మొహాల్ని ఇల్లా రాసిపెట్టాడు భగవంతుడు."

"నీ ధోరణి చూస్తే, నువ్వు లేచిపోయేటట్లున్నావు."

"ఛా, అటువంటి మాటలనకండి" అని నరసమ్మగారు కంట తడిపెట్టుకుంది.

"ఏముందీ, అన్నింటకంటే బ్రహ్మాస్త్రాలు ఏడుపు, నూతిలో పడతానని బెదరింపు, నేనే లేచిపోతాను తీరిపోతుంది. లేకపోతే శుబ్బరంగా నూతిలోపడి చస్తాను. నే నింక పడలేను బాబూ ఈ బాధలు, చస్తే, మోక్షమైనా వస్తుంది."

"మీరా మాటలనే కన్న నన్ను చంపండి తీరిపోతుంది. పోనీ వాళ్లని వెతికి పట్టుకుని పిల్ల నింటికి తీసుకురాకూడదూ, అల్లా ఇంట్లో కూర్చుని అందరిమీదా భగ్గుమనకపోతే?"

"ఆ ముండ ఒకవేళ వచ్చినా, ఇంట్లో అడుగు పెట్టనియ్యను."

ఇంతలో శారదవచ్చి ఒక కవరు ఇచ్చిపోయింది. వుత్తరం నెమ్మదిగా చదివి, సీతారామయ్యగారు మళ్లీ అందుకున్నారు.

"చూశావా, ఆ శంకరంగాడు వుత్తరం వ్రాశాడు. ఆ పీనుగు లిద్దరూ పెళ్లిచేసుకున్నారట మద్రాసులో. వాళ్లని క్షమించి ఆశీర్వదించాలిట. పైగా, ఒక అమాయిక స్త్రీని సంఘకర్కశ పాశాలనుంచి విముక్తురాలిని చేసినందుకు గర్విస్తున్నాడట. వీడి శార్ధం."

"ఆ, పెళ్లాడమే? ఔర! ఎంత ఘోర కలి."

"పోనీ, పిల్ల సుఖంగానైనా వుంటే."

"దానికేం? అది ఆ శంకరంగాడితో సుఖంగానే వుంటుంది. కాని, దాని కేది సుఖాన్నిస్తోందో, అది మన తాడు తెంచుతోం దిక్కడ. ఈ శారద నెవడు పెళ్ళి చేసుకుంటాడే? పెళ్లి చెయ్యలేం. చెయ్యకపోతే నిష్ఠూరం. మొన్న జ్వరం వచ్చినప్పుడు నా ప్రాణం పోయినా బాగుండును. ఆ భగవంతునికి దయలేదు?"

"అదిగో, అటువంటి శాపనార్థాలెట్టుకుని నన్ను చంపొద్దని చెప్తున్నాను." అని నరసమ్మగారు నెత్తిని మోదుకోవడం మొదలెట్టింది.

శారద వచ్చి ఎవరో వచ్చారని చెప్పగా సీతారామయ్యగారు భార్యా దూషణ విరమించి, వాకిట్లోకి వెళ్లి వచ్చిన వ్యక్తిని చూసేటప్పటికి, ఆయనకు అరికాలిమంట నెత్తికెక్కింది. ఆ వచ్చిన వ్యక్తి రామం.

"ఏం స్వామీ, నువ్వేమి వెలగబెట్టడానికి వచ్చావు" అని సీతారామయ్యగారు గదమాయించారు.

నేను మీ శ్రేయస్సుకోరేవచ్చాను. నాకు తెలుసు మీ శారదకు పెళ్లిచెయ్యడం చాలా కష్టమని. ఏదో నా మిత్రునివల్ల మీకె ఆపదసంభవించింది కనుక, కొంత పాపపరిహారార్థం, నేను మీ అమ్మాయిని ఏమీ కట్నంలేకుండా పెళ్ళిచేసుకుంటానని చెప్పటానికి వచ్చాను" అన్నాడు రామం.

"నా కూతుర్ని పెళ్ళిచేసుకుంటానని చెప్పడానికి నీకు సిగ్గులేదూ? పిల్ల లేచిపోయినందుకే మొహం చెల్లకుండా వుంది కదా? అటువంటప్పుడు, నా రెండో పిల్లని నీవంటి పోకిరీవాడి కిచ్చి పెళ్లి చెయ్యమంటావ్?"

ఎక్కణ్నుంచి వచ్చిందో, నరసమ్మగారు పణగడం ప్రారంభించింది. "అబ్బా, ఏం పట్టుదల? ఏంమూర్ఖత్వమమ్మా. కట్నం ఇచ్చుకొనే తాహతు లేదు. 'కట్నం లేకుండా, అందులో ఈ పరిస్థితుల్లో పెళ్లాడుతానంటూ పెళ్లికొడుకు తనంతట తానువస్తే వంకలు పెట్టడం. అవ్వాకావాలి బువ్వా కావలంటే ఎల్లా?"

"పధవ పణుగులు పణక్క అవతలికి దయిచెయ్యి...కదిలావా లేదా?"

"అవిణ్ణెంఅకండీ తిడతారు పాపం. తల్లిగ వుంటుంది. మీరు నన్ను తుంటరి అంటున్నారు. కాని మీకుమాత్రేమాత్రం పతివ్రతా? మీశారద ఒక భాగ్యవంతుని వాగ్దానాలనునమ్మడం, పెద్దసంబంధం వస్తోందని మురిసిపోయి కొంతమాసి చూడనట్లు మీరు పూరుకోవడం, మీ అమ్మాయికి కడుపు రావడం, తర్వాత ఆ అబ్బాయి తండ్రి ఇంకో పెద్దింటి పిల్లని..."

"చాల్లే పూరుకో. ఇవ్వన్నీ ఎవరు చెప్పారు నీకు."

"మీ శారదే చెప్పింది. ఈవిషయం దాచకుండా చెప్పి, క్షమాపణ వేడుకోబట్టే, ఆమె అంటే నాకు గౌరవం ప్రేమ ఏర్పడి ఇప్పుడు పెళ్లిచేసుకోడానికి కూడా సిద్ధపడ్డాను."

"మీ ప్రేమ తగలబెట్టా: ఒసేవ్. ఆపీనుగు నిల్లాపిలు."

శారద వచ్చి తలుపు వెనకాలనుంచుంది.

"ఇల్లా ఎందురుగుండా తగులడు. ఓసి నిన్ను తగలెయ్యా. మీ రెక్కడ చెడపుట్టారే? ఇదంతా ఇతనికి చెప్పావుటే? మాట్లాడవేం రాయిలా?"

శారద సమాధానం చెప్పకుండా లోపలికి పోయింది.

ఆమట్టున సీతారామయ్యగారు భార్యకేసి తిరిగి "ఆహా ఎటువంటి పుత్రికారత్నాలను కన్నావే? వజ్రపు తునకలు. ఏమోయి రామం, నువ్వు ఈ శారదని తీసుకుని ఈరాత్రే లేచిపో. నాకు శని విరగడైపోతుంది. కాని ఇక నాగుమ్మం తొక్క—

(26-వ పేజీచూడండి)

నేటి రేనాడు

శ్రీ కె. డి.

అక్కడొక యుద్ధం జరుగుతూంది. యుద్ధం - పెద్ద ఆయుధాలేవీ లేకున్నా, మోటుశస్త్రాలు చాలా ఉపయోగింపబడుతున్నై. ఇరువైపులా తీవ్రంగా గాయపడుతున్నారు. రెడ్లు మీసాలు మెలిత్రిప్పి హుంకరిస్తున్నారు. నేటి అన్ని యుద్ధాలవలె యిది అధర్మయుద్ధం కాదు. కలియుగంలో కూడా ధర్మయుద్ధం జరుగుతుం దనటానికి అదొక ఉదాహరణము - అది రేనాటి సీమ.

యుద్ధానికి ప్రబలమైన కారణాలేవీ లేవు. అతిపురాతనకాలంనుండి ఆ గ్రామములో ఒక చిన్న కాలవ పారుతూంది. దానిక్రింద దాదాపు నూరు యకరాల మాగాణి సాగౌతుంది. ఆ మాగాణిని ఆ కాలవను హక్కుభుక్తంగా అనుభవిస్తున్న పలువురు రైతులలో పుల్లారెడ్డి, రామిరెడ్డి ప్రముఖులు. మట్టరికాలు వీరిద్దరూ బావా, మరదు లౌతారని తెలుపుతాయి.

సాధారణంగా వర్షకాలంలో ఆ కాలవ నీటితో నిండినప్పటికి వేసవిలో అది కొద్ది నీటిని మాత్రం ఉంచుకుంటుంది. ఆ నీటిని వంతులప్రకారం రైతులు ఉపయోగించుకుంటారు.

ఒకనాటిరాత్రి - ఆ దినం పుల్లారెడ్డి వంతు - రామిరెడ్డి తన మనుష్యులచేత నీటిని పుల్లారెడ్డి భూమికి పారకుండా తన భూమికి పారపెట్టించినాడు. మరునటి రోజు యీ సంగతి పుల్లారెడ్డి తెలుసుకొన్నాడు.

మరునటి రాత్రే పుల్లారెడ్డి తన మనుష్యులను యిద్దరిని పంపించినాడు రామిరెడ్డి నీటిని తన భూమికి త్రిప్పటకోసం. ఇంతకుముందే ఆయుధాలు చేతబట్టి సిద్ధంగా ఉన్న రామిరెడ్డి అనుచరులు వాళ్లను తన్ని తరిమినారు.

అసలే అవమానంచేత భగ్నమంటున్న పుల్లారెడ్డి హృదయం - గోరుచుట్టుపై రోకటి పోటన్నట్టు - యింకొక కారణం చేత పూర్తి భగ్నమంది. అది - పుల్లారెడ్డి పసువులను నిష్కారణముగా రామిరెడ్డి బందెకు తోలటం.

అయితే పుల్లారెడ్డి తన మనుష్యుల సహాయంతో యింతకు మించిన పనిచేసి చూపున్నాడు. రామిరెడ్డి పెద్ద పుంజుకోడిని రహస్యంగా ముగించినాడు. రామిరెడ్డి చేలో ప్రత్తిని బహిరంగంగా తన కూలీలతో కోయించినాడు.

రాజుతో దేశంవలె రెడ్లతో హరిజనవాడ రెండుగా చీలిపోయింది. రెండు రాజ్యాలు కొట్లాడితే మధ్య నష్టపడే ప్రజలవలె యీ యిరువురు రైతు ప్రముఖులు కొట్లాడగా మధ్య హరిజనులు కష్టపడబోతున్నారు.

మొత్తం గ్రామంలోని ఆబాలగోపాలము యిరువైపుల సానుభూతిపరులుగా చేరుతున్నారు. ప్రత్యక్షంగాను పరోక్షంగాను తమపక్ష అధినేతలకు సాయపడుతున్నారు.

గ్రామమునసబు మాత్రము తెలివిగలవాడనే చెప్పాలి. ఇరువైపులవారికి "పోరు నష్టము, పొందులాభము" అను సూక్తిని విశదము చేసినాడు. ప్రయోజనం శూన్యం కాగా దగ్గరి పోలీస్ స్టేషనుకు తెలారిచే వార్తను పంపినాడు. గ్రామాధికారి అధికారుల బధిరత్వమును గమనించలేదు. ఎట్లు గమనిస్తారు ?

అగ్నికి అన్ని వస్తువులు సమకూరినాయి. ఇక అగ్గిపుల్ల ఒక్కటే తక్కువ. ఆనాటిరాత్రి ఊరంతా పరశురామప్రీతి ఔతున్నది. చుట్టుపక్కల ఊర్లలోని సంగతెరుగని చూపరులకు అది ఒక దవానల మనిపించింది. కాని ఊళ్లో ప్రజకు - ఏ కొద్దిమందికో తప్ప - ఏవిధమైన చింతా లేదు. కాగా వారంతా ఉత్సాహంగా ఉన్నారు.

అది జరిగింది నిన్నటిరాత్రే ఇదుగో! యీరోజు జరుగుతూంది ప్రత్యక్షయుద్ధం. పిల్లలు, పెద్దలు, యువకులు - యిరువైపులా ఉన్నారు. చుట్టు పల్లెలనుండి రోజు కుంటూ వస్తున్నారు, యిరుపక్షముల సానుభూతిపరులు. ఇదిగో! యుద్ధము ప్రబలింది. పుల్లారెడ్డి ముఖ్యానుచరుడు రామప్ప పడి మరి లేవలేదు. యిప్పటికి చనిపోయి ఉంటాడు. పుల్లారెడ్డికి తిగట్టిన కోడివలె శివమెత్తినట్లు పోరాడుతున్నాడు - కొడవలితో రామిరెడ్డి కొడుకును యీలోకంనుంచి శాశ్వతంగా పంపించినాడు - ఘోరం - కొడుకుతోపాటు తండ్రిని కూడా పంపినాడు -

నాయకుడు పోవడంతో సైన్యం చెల్లాచెదరైంది. గ్రామం శాంతించింది. కాని అది మళ్లీ గ్రామమౌతుందా? గెలిచిన జట్టు ఎవరింట్లకు వాళ్లు విజయనాదాలతో పోతున్నారు. ఏమి కాబోతుందో ?

అదుగో! యిప్పుడు వస్తున్నారు పోలీసుమహాశయులు. నలుగుర్ని పట్టి సంగతంతా కనుక్కున్నారు. అభియోగమును ఆపాదించినారు.

మరి వీరి భవిష్యత్తు యెట్లుంటుందో ఏమవుతుంది? యిరువైపుల ప్రముఖులు పెద్ద పెద్ద (అ) న్యాయవాదుల్ని నియమించుకోబోతారు. స్వార్జితమో, పిత్రార్జితమో అయిన నాలుగురూపాయలను ప్రభుత్వానికి, న్యాయవాదులకు అర్పించుకోబోతున్నారు. నిజంగా దాతట!

సాధ్యమైనంత వరకు శిక్ష తప్పించుకోవటానికే ప్రయత్నిస్తారు. శిక్ష విధించబడితే అనుభవిస్తారు. ఇంతకంటె ఏం చేస్తారు ?

ఏమైనా వారు వారికే కాక తమ గ్రామానికి, తద్వారా తమ దేశానికే తీరని నష్టం తెచ్చారు. మళ్ళీ యీ గ్రామాన్ని యే ఉద్ధారకుడు ఉద్ధరిస్తాడో ?

దీనికి మూలకారణ మిప్పు డందరికీ బాగా తెలుసు (1) స్వాభిమానం (2) ధనగర్వం అంతేనా ?

★

స్కెచ్:

నేనెవణ్ణి

శ్రీ తూలికాభూషణ్

సాయంకాలం 5 గంటలదాకా పని చేసి అలసిఉంది ప్రాణి. ఆత్మారాముడు ఆహారంకోసం, విశ్రాంతికోసం, ముఖ్యంగా నిద్రకోసం ఆరాటపడుతున్నాడు.

ఒక రోజుకు మరొక రోజుకు అవగింజంత అయినా భేదంలేకుండా నిత్యమూ ఒకేరకమైన పని చేస్తూఉండే నాబోటి మానవుడికి సాయంకాలం కాగానే కేవలం నిద్రమీదనే ధ్యానమంతా మగ్నమై ఉంటుంది.

ఇంతకీ ఆరోజు జరిగిన సంఘటనకు నా నిద్రకు ఏలాంటి సంబంధమూ లేదు.

అయినవరంలో ఉన్న మిత్రునివద్దనుంచి ఏదైనా మంచి పుస్తకం తీసుకువెళ్ళవచ్చునసే ఆశాభావం నిస్సారంగా ఉన్న నా నరాలలో కొంత ఉత్సాహం పోసింది.

ఈ అయినవరం ఎక్కడిదని ఎవరైనా ప్రశ్నించవచ్చు. దీనికి ప్రపంచంలో ప్రఖ్యాతి లేకపోయినా, మద్రాసులో పని చేసేవారు నివసించడానికి అనువైన ప్రదేశం మాత్రం అవును. ఇది మద్రాసు - తిరువళ్ళూరు రైలుమార్గంమీద ఉన్న విల్లివాకమ్ స్టేషన్‌కు దాదాపు ఒక మైలు దూరంలో ఉంది. మద్రాసునుండి విల్లివాకమ్ పోయే బస్సులు అయినవరంమీదుగానే వెడతాయి. అయినవరంగురించిన ప్రస్తావన ఇంతటితో సరిపెట్టడం ఉచితం.

బస్సుమీద అయినవరం చేరుకుని, మిత్రుని గృహంలో కొంతసేపు గడిపాను. పల్లెటూరి వాతావరణంలో గడియారం అపశృతి కల్పిస్తుంది. తీరా ఎనిమిదిన్నర గంటలు దాటినతరువాతకాని బయలుదేరాలనే వెష్ట పుట్టిందికాదు. ఆయనవద్ద సెలవు తీసుకుని, ఆయన ఇచ్చిన పుస్తకాలు భద్రంగా చంక పెట్టుకుని బయలుదేరాను.

తిరిగి విల్లివాకమ్ పోయే బస్‌మీద ఊరు చేరుకుని, అక్కడినుంచి కాలినడకనే స్టేషన్‌కి వెళ్ళాను.

వెన్నెల పుచ్చపువ్వులా ఉంది. స్టేషన్ ప్రాంగణంలో పోలీసులారీ ఒకటి ఉంది. దానిలో కూర్చున్న వ్యక్తుల ఆకారాలు బయటికి అస్పష్టంగా గోచరిస్తున్నాయి.

స్టేషన్‌లో ప్రవేశించేసరికి 9 దాటింది. 8.10 కి సెంట్రల్‌లో బయలుదేరే లోకల్ బండి అప్పుడే విల్లివాకమ్ విడిచి వెళ్ళింది. ఇక 9-50 కి విల్లివాకమ్ చేరుకునే బెంగుళూరు పాసెంజరుతప్ప అంబత్తూరు చేరుకొనడానికి నాకు మార్గాంతరం లేదు. అంబత్తూరు అవడికి ఈవలిస్టేషన్. అక్కడే నా నివాసం.

మూడవతరగతి ప్రయాణీకుల సౌకర్యార్థం రైల్వేవారు అమర్చిఉంచిన బెంచీమీద శరీరాన్ని చేరవేసి, ఆలోచనలో పడ్డాను.

కడుపులో ఆకలి. తినడానికైతే స్టేషన్‌లో ఏమీ దొరకదు. నన్ను చూస్తూనే స్టేషన్ దుకాణదారుడు తలుపులు మూసే ప్రయత్నంలో పడ్డాడు. ఇక ఆలోచించడంకన్న చేయతగిన, చేయగలిగిన పని మరొకటి లేదు.

స్టేషన్‌లో జనసంచారం తక్కువగా ఉంది. చల్లనిగాలి వీస్తోంది. తెలియకుండానే మెదడును నిద్ర ఆవహిస్తోంది.

స్టేషన్ ద్వారానికి అభిముఖంగా ఉన్న బల్లచివర కూర్చునిఉన్నాను. మరి కొలది సేపటికే ఇరువురు వ్యక్తులు లోపలికి వచ్చారు. నేను కూర్చున్న బల్లమీదనే నాకు కొంచెం దూరంగా ఒకవ్యక్తి, నాకు ఎదురుగా ఉన్న బల్ల మీద రెండవ వ్యక్తి కూర్చున్నారు.

ఎదురుగా కూర్చున్న వ్యక్తి ఒక్క నిమిషంతటపటాయించి, కొంచెం ముందుకు వంగి "ఏమండీ, మీరు తెలుగువాళ్ళలా ఉన్నారే" అన్నాడు.

నేను తెలుగువాణ్ణి. తెలుగువాడిలా ఉండక మరొకవిధంగా ఎలా ఉంటాను? నవ్వు వచ్చింది.

"అవును, నేను ఆంధ్రుణ్ణే" అన్నాను.

"నేను అలాగే అనుకున్నానులెండి" అన్నాడు ఆ వ్యక్తి మూర్ఖంగా.

ఇతరుల మూర్ఖత్వాన్ని కూడా సహిస్తూ, సోది చెబుతూ కాలం గడిపే స్థితిలో అప్పుడు లేకపోవడంచేత కొంచెం చిరాకు కలిగింది. అయినా, ఆ వ్యక్తి మొదటి ప్రశ్నకు గమ్యస్థానం ఏమైఉంటుందో తెలుసుకోవాలనే కుతూహలం కూడా రవంత కలిగింది.

నీరసంగా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను.

ఆ వ్యక్తిముఖంలో కొంత ఆసక్తి పొడచూపింది.

"మీది ఏ జిల్లాఅండీ" అని ప్రశ్నించాడు.

ఆంధ్రుణ్ణి అయనతరువాత ఒక జిల్లాకు చెందిఉండడముకూడా తప్పదు. దానిపేరు చెప్పడానికి అభ్యంతరమూ లేదు.

"తూర్పు గోదావరి."

"ఏం ఇలా వచ్చారు?" అని తరువాతి ప్రశ్న.

జాతి, జిల్లా తెలుసుకోనడం ముగిసింది. తూర్పు గోదావరికి చెందినవాడు మద్రాసుకు సమీపంగా ఉండవలసిన అవసరం ఏమిటి? ఏదో ఒక విశేషం ఉండాలి. దానిని తెలుసుకొనడానికి ప్రయత్నించడం సహజం. ప్రయత్నించకుండా ఉండడం మానవప్రకృతికే విరుద్ధం. అందుచేత అతని దృష్ట్యా అది చాల సబబైనప్రశ్న కావచ్చు.

కాని, రోజంతా నడ్డి వంచి పనిచేసి అలసిఉన్న నాకు మాత్రం ఆ ప్రశ్న పూర్తిగా చిరాకు పుట్టించింది. ఇది ఇతరుల వ్యవహారాలలో అనవసరమైనజోక్యం. సభ్యతకే విరుద్ధం.

మొదటి ప్రశ్నకు-అందులోనూ ఒక్క అపరిచితవ్యక్తి అసభ్యతకు-సహృదయంతో సమాధానం చెప్పడం ఎంత కష్టమో, కొన్ని ప్రశ్నలకు వెంటవెంటనే సదుత్తరాలు ఇచ్చి మరొక ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఉండడంకూడా అంతే కష్టం.

"అయినవరం పని ఉండి వచ్చాను" అన్నాను ముక్తసరిగా-అతనిని ఇంక వదిలించుకునే ప్రయత్నంలో.

"అలాగాండీ" అంటూ ఆ వ్యక్తి సంభాషణ ఇంగ్లీషులో సాగించడం ప్రారంభించాడు.

"మీరు సోవియెట్ లిటరేచర్ చదువుతున్నట్లు ఉన్నారే?"

మిత్రునివద్ద తీసుకున్న పుస్తకాలలో మొదట వాల్‌పోల్ చదవడం మంచిదా, లేక జార్జి ఎలియట్‌నే చదువుదామా అని

లోలోన తర్కించుకుంటున్న నాకు చేతిలో సోవియెట్ లిటరేచర్ ఉన్న సంగతి జ్ఞాపకమే లేదు. పుస్తకాలవైపు దృష్టి సారించాను. సోవియెట్ లిటరేచర్ కూడా ఉంది.

ప్రశ్నల పరంపర పుస్తకాలమీదకు మళ్ళడంతో నా చిరాకు అదృశ్యమైంది. ఈ వ్యక్తి పుస్తకాలరాయుడు కావచ్చు. ఏదైనా పుస్తకం తీసుకుని, పుటలు తిరగేస్తూ కాలాన్ని చంపుదామనుకుంటున్నాడేమో? వచ్చేపొయ్యేవాళ్లని ప్రశ్నలతో చంపకుండా అడిగి పుస్తకం తీసుకోకూడదా అనుకున్నాను.

"అవు"నని సమాధానం చెప్పాను.

అతని ముఖంలో కొంత తీవ్రభావం గోచరించింది. ప్రశ్నలుకూడా మొదటిలాగా నసగకుండా దృఢమైన స్వరంతో వేయడం ప్రారంభించాడు.

"మీకు సోవియెట్ పుస్తకాలంటే అభిమానం కాబోలు" అంటూ ఒక చిరునవ్వు విసిరాడు.

ఇది వాస్తవంగా ఉత్సాహం కలిగించే విషయం. సోవియెట్ సాహిత్యంలోని కొత్తపోకడలు తెలుసుకోవాలనే ఆసక్తి నాకు చాల కాలంగా ఉన్నదే. సోవియెట్ సాహిత్యంద్వారా సోవియెట్ ప్రజల నవసమాజనిర్మాణదీక్షను, మానవజాతిశ్రేయస్సుకై అకుంఠితమైన విశ్వాసంతో ఎంతటి కష్టనష్టాలనైనా సహించి వారు చేస్తున్న కృషిని కొంతవరకు అవగతం చేసుకున్నాను.

"అవును. సోవియెట్ పత్రికలు, నవలలు విడవకుండా చదువుతాను" అని చెప్పాను. నిజానికి నేను చదివే ఇతర పుస్తకాలుకూడా లేకపోలేదు.

"ఆంధ్రదేశంలో కమ్యూనిస్టులు ఎక్కువ కాదండీ?"

సోవియెట్ సాహిత్యానికి, ఆంధ్రలో కమ్యూనిస్టులు ఎక్కువగా ఉండడానికి సంబంధము లేదు. మానవమనస్తత్వం విచిత్రమైనది. ఆంధ్రదేశంలో ఎక్కువమంది సోవియెట్ సాహిత్యం చదివి, తిరిగి వారిలో ఎక్కువమంది కమ్యూనిస్టులు కావాలి. ఇది ఆంధ్రదేశంలో మాత్రమే ఎందుకు సంభవం కావాలి?


అయినా, ఎందుకు ఉద్రేకం తెచ్చుకోవాలి? అందువల్ల తాపీగా చెప్పాను. "ఆఁ. ఎక్కువే అనుకుంటే ఇబ్బంది ఉండకపోవచ్చు. ప్రజలకు తినడానికి తిండి, కట్టడానికి బట్ట, ఉండడానికి ఇల్లు లేని కటిక దరిద్రకాలం ఉన్నంతవరకు కమ్యూనిస్టులు ఉంటారు."

ఆ వ్యక్తిలో కొంత చలనం కనుపించింది. ప్రాయశః ఈ రకమైన అభిప్రాయం అతనికి కటువుగా తోచిఉండవచ్చు. చాలమందికి వాస్తవం ఎప్పుడూ కటువుగానే ఉంటుంది. కంగారు పడినట్లు ఉన్నాడు.

"కమ్యూనిస్టులంటే మీ అభిప్రాయమేమిటండీ?" అని అడిగాడు.

కమ్యూనిస్టులంటే నాకు అభిప్రాయాలు ఎందుకు ఉండాలి? నేనంటే కమ్యూనిస్టుల అభిప్రాయం ఏమిటి? ఈ కమ్యూనిస్టులనే జాతివారికి అసలు నావంటి వ్యక్తి ఒకడు ఉన్నాడనే సంగతే తెలియకపోవచ్చు. కొందరు వ్యక్తుల ఉనికిని మనం గుర్తించి

(26-వ పేజీ చూడండి)



పల్లె పట్టులు

శ్రీ వెంపటి సచ్చిదానందశర్మ

రణం గుర్నాధంగారింటికని బయలుదేరిన వెంకట్రామయ్య సందుమలుపు తిరగటంతో సత్యన్నారాయణగారింటి అరుగుమీద కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్న వాళ్ళందరిదృష్టి నాకర్షించాడు.

"తిమ్మిని బ్రహ్మిని చేసి ఆ శివయ్య పొలం బేరం ఫైసలు చేయించుకోంది ముసలాడు నిద్దరోడనుకో..." అన్నాడు శేషయ్యగారి వెంకటేశ్వర్లు, 'దారెపోతున్న వెంకట్రామయ్య వైపొకసారి చూచి-ంటనే చూపు మార్చి నేలచూపులు చూస్తూ.

"విన్నేనురా, సన్నాసీ!"అని మందలించాడు వయసుమీరిన సీతారామయ్య.

"మీన మేషాలు లెక్కపెట్టే ఈయనేం కొంటాడ్రా! సుబ్బరామయ్యకి, బేరం ఫైసలైపోయిందిట..." పెదసుబ్బయ్య సన్నగా వదిలాడు వార్తను.

"ఊఁ... అదిమాత్రం ఎక్కడ పూర్తయింది... అదీ నలుగుతోంది...నిన్ననేగా ఏదో మాటామాటామీద శివయ్య అంది..." అన్నాడు వెంకటకిష్టయ్య. కాళ్లు మడిచి నడుం చుట్టూ చుట్టిన కండువాని బిగదీస్తూ.

"అందుకనే కాబోలు వెంకట్రామయ్య మామ కరణంగారింటి చుట్టూ కాలుగాలిన పిల్లిలాగా తెగతిరుగుతున్నాడు! ఇహ మామ నిద్దరోడు!" వెంకటేశ్వర్లు తెలియజెప్పాడు.

"ఎందుకొచ్చిన మాటలు, ఊరుకోండి.. ఎవళ్లుమాత్రం వీధులు కట్టి విస్తళ్లు వేస్తున్నారట కాని..."సీతారామయ్య వాక్యం పూర్తిచెయ్యకండానే కాండ్రించి ఉమ్మేసి లేచి వెళ్లిపోయాడు.

సీతారామయ్య నిష్క్రమణతో ఈ విషయాన్నిగురించిన వాళ్ల సంభాషణ ఒక విధంగా ఆగిపోయింది.

గుర్నాధంగారింటినించి తిరిగొస్తున్న వెంకట్రామయ్యను చూచి "ఏదో అడ్డుపుల్ల వేసొచ్చుంటాడు." అన్నాడు వెంకటకిష్టయ్య చేతికఱ్ఱతో నేలను పొడుస్తూ.

నిజానికి, వెంకట్రామయ్య అడ్డుపుల్ల వెయ్యనూలేదు; ఏమీ లేదు. గుర్నాధం పంతులు వూరునుంచి ఇంకా తిరిగిరాలేదని మంగమ్మ చెప్పేసరికి వెంకట్రామయ్య సగం దిగజారిపోయాడు. దీన్ని, ఎలాగో తట్టుకుని, "ఐతే, అమ్మాయ్! ఎక్కడికెళ్ళిందీ తెలుసా?" అనేసరికి "తెలీదన్నయ్యా! దస్తరంకట్ట తీసుకుని పొద్దుననంగా వెళ్లారు శివయ్యా, ఆయనాను... మధ్యాహ్నం భోజనానికికూడా ఇంటికి రాలేదు. ఎక్కడికెళ్లారో ఏమో..." అని పిడుగులాటి వార్త బయటపెట్టేసరికి శివయ్యపొలం వ్యవహారం తను తెగేదాకా లాగానేమోనని తన్నుతాను నిందించుకోవటం మొదలుపెట్టాడు వెంకట్రామయ్య.

నోరుమాటలేకండా నిలబడిపోయిన వెంకట్రామయ్యను అంతతొందరగా పంపెయ్యటం ఇష్టంలేని మంగమ్మ మినుములు బాగుచేస్తున్న పీటను ఒళ్లోనుంచి తీసి అవతల పెట్టి, జారగిలబడి అరుగుమూల నున్న చాపను అందుకుని ఇవతల పడేస్తూ, "కూచో అన్నయ్యా!" అంది.


"లేదు, వెళ్ళాలమ్మాయ్!" అంటూ చాప పరుచుకు కూర్చుని "గుర్నాధం వచ్చివుంటాడేమో నని వచ్చాను" అన్నాడు స్తంభాన్ని ఆనుకుని, . వేళ్లతో స్తంభంపైన దరువువాయిస్తూ.

"పాపం, రెండుసార్లు వచ్చావు. ఏమన్నా తొందర వ్యవహారమా?" అంది, తీవ్రంగా భావపరిశీలన చేస్తున్నట్లు వెంకట్రామయ్యముఖంలోకి చూస్తూ.

"అదే తొందర...." వెంకట్రామయ్య నీళ్లు నమిలాడు.

"ఏటవతల పొలం అమ్మకొచ్చినట్టున్నావు... ఇక్కడెక్కడున్నా మళ్ళీ పొలం కొంటావా? లేక, ధరలు తగ్గేదాకా అలాంటి ఆలోచన లేమీ లేవా?" అంటూ తనే విషయంలోకి వచ్చింది, పీట ఒళ్లో పెట్టుకుని మళ్లీ మినుములు బాగుచేస్తూ.

వెంకట్రామయ్య ఇంకా స్తంభంమీద దరువు వాయిస్తూనే ఉన్నాడు నెమ్మదిగా, ఏదో ఆలోచిస్తూ. సమాధానంగా పరిస్థితు



లన్నీ విడమర్చి ఆవిడకి చెప్పవలసిన అవసరం కూడా ఏమీ లేదనుకున్నాడు.

ఇంకా, ఆయనదగ్గరనుంచి సమాధానమేమీ రాకపోయేసరికి "అఁ హఁ...ఎందుకంటున్నానంటే... ఈరోజుల్లో ఎవ్వణ్ణీ నమ్మి ఎట్టాని ఏగానీ చేతులో పెట్టటానికి వీలుగాకుండావుంది...ఆ పేట్రాజు మొహాన పోసిన అప్పుకి ఇంతవరకు అయిపూ మోక్షం లేక మేం పడుతున్న అవస్థ నువ్వూ చూస్తున్నావుగా..." అని, తనిలా మాట్లాడతగ్గదేనని నిరూపించి "అభమూ, శుభమూ ఎరగని పసివెధవల సొమ్ము...వీలు చూసి ఓ యింత కొండ్ర కొని పడేస్తివా, నాలుక్కాలాలపాటు పడివుంటుంది" అంటూ తన అల్లుడు ఆస్తినంతనీ ఎలా వెనకముందులు తెలీకుండా హ్రస్వంచేసిపోయిందీ, తనకూతురుకుటుంబాన్ని అష్టకష్టాలూ పడి తను ఎలా ఒక దారికి తీసుకొస్తున్నదీ వెంకట్రామయ్యకు మరోకసారి జ్ఞాపకానికి తెప్పించింది.

ఇలా మంగమ్మ ఒక్కతే మాట్లాడుతుంటే తను మెదలకుండావూరికే ముడుచుకు కూర్చుంటే బాగుండదని "సరే...కలిసి రాంవి, ఊరికే తొందరపడితేమాత్రం పనులౌతయ్యా!" అన్నాడు.


నిజానికి, వెంకట్రామయ్య ఇప్పుడు విచారపడుతున్నది, తను తొందరపడక పోవటంవల్ల పని అయ్యే అవకాశం జారవిడుచుకున్నానేమో నని!

చేలో చేను కలుస్తోందిగనక శివయ్య పొలం కొంటే తనే కొనాలనీ, చుట్టుపక్కలెవరూ మోతుబరిరైతులు లేరుగనక బేరం విషయంలో తనేమీ అంత తొందర పడక్కర్లేదనీ అనుకుంటున్నవాడల్లా, సుబ్బరామయ్య బేరం ఫైసలు చేయించుకునేట్టున్నాడని తెలిసేసరికి వెంకట్రామయ్యలో ఒక విధమైన తొందర బయలుదేరింది.

"పోనీ, శివయ్య పొలం బేరం పెడుతున్నాట్ట... అదేదో చూడరాదూ... చేలోచేను కలుస్తుందట్లే వుంది కూడాను" అందిమంగమ్మ బయటపడి, చివరికి. మంగమ్మకి విషయాలన్నీ తెలిసుండికూడా తెలీనట్టు మాట్లాడుతున్నదని వెంకట్రామయ్యకు అనుమానంగానే వుంది. "మొన్న నేనో ఆ మాటా ఈ మాటా చెపుతూ మీ బావకూడా అదే అన్నారు..." అని, ఇంట్లో ఏదో పట్టు చప్పుడయేసరికి, "అమ్మాయ్! ఇంట్లో ఉన్నావుటే!" అని, సమాధానం రాకపోయేసరికి "ఇప్పుడే వస్తా" నంటూ లోపలికి వెళ్ళబోయింది మంగమ్మ.

సమయం చూసి వెళ్ళిపోదా మనుకుంటున్న వెంకట్రామయ్య కూడా లేచి "నేనూ వెడతానమ్మాయ్! ఈ విషయమే మాట్లాడదామని వచ్చాను" అని బయటపెట్టాడు.

"శివయ్యగారింట్లో మరీ గొడవగా వుంది విన్నావా? పొలం అమ్మతానన్నాడని వియ్యమ్మ కొడుకుమీద అలిగి...నిన్నా, ఇవ్వాళా ఉపోషాలుట!— చేద నూతుల్లో పడిపోతే గాలంకావలసివచ్చి గొడవగా చెప్పిపోయింది కామాక్షమ్మ, ఇందాక..."



తను ముఖ్యంగా చెప్పదల్చుకున్న ఈ నాలుగుమాటలూ చెప్పికాని, వెంకట్రామయ్యను వెళ్ళనిచ్చి తను ఇంట్లోకి అడుగుపెట్టింది కాదు మంగమ్మ.

దీనికంతకూ తనెంతవరకు బాధ్యుణ్ణని తన్నుతాను ప్రశ్నించుకోకుండా వుండలేకపోయాడు వెంకట్రామయ్య దారిపొడుగునా. ఎలాగో శివయ్యను మాయజేసి ఆ పొలంకాస్తా కాజెయ్యాలని తాను కలలో కూడా అనుకోలేదు. ఎకరం రెండువేల అయిదువందలకు మించి తనేమాత్రం ధర పెట్టదల్చుకోలేదనీ, అలా వీలైతే శివయ్య అమ్మదల్చుకున్న కలవగుంట పొలం - మూడెకరాల పాతిక సెంట్లూ తను కొనటానికి సిద్ధంగా ఉన్నాననీ.. తన మనసులో ఉన్నదేదో గుర్నాథంతో తేల్చిచెప్పేశాడు వెంకట్రామయ్య. అంతమాత్రానికే తనని ఊరంతా ఇలా ఆడిపోసుకుంటోం దెందుకు? ఇందాక, నడిబజార్లో కూర్చున్నవాళ్ళంతా తననిగురించే ఏదో అనుకుంటున్నారని వెంకట్రామయ్యకి తెలుస్తు. ప్రపంచాన్ని చాలా చూసిన మనిషిగనక - తనని మినహాగా ఇతర్లనందర్నీ లెక్కచెయ్యటం లోకసహజమేలెమ్మని సమాధానం చెప్పుకోగలిగాడు.

వెంకట్రామయ్య ఇంట్లో అడుగుపెట్టేసరికి భార్య మహాలక్ష్మమ్మ ఎవరినో తెగ తిట్టిపోస్తోంది. ఆవిడ అనే మాటలన్నీ శివయ్యతల్లి వియ్యమ్మననని, జాగ్రత్తగా ఆ తిట్లు కొద్దిక్షణాలసేపు విన్నతరవాతకాని గ్రహించలేకపోయాడు వెంకట్రామయ్య.

"...నా కూతురు ఖర్మ కాలిందిసరే... తను మాత్రం?... పట్టుమని పదేళ్ళన్నా కాపరం కాలబెట్టకుండా తనెందుకు ముండమోసిందంట! తనెవరి ఆస్తులు కలుపుకుందామనుకోబట్టి ఇలా అయిందో!... పెద్దముండ అనాల్సిన మాటలేనా ఇవి?... ఏళ్లు రాంగానే సరా!..."

వెంకట్రామయ్యభార్య మాటల్లో చొరబడి "ఏమిటే ఆ గొడవ? ఏమిటలాచిందులు తొక్కుతావ్?" అన్నాడు రుంజుకుంటూ.

అంతవరకు భర్త ఇంటికి వచ్చినట్లు గ్రహించని మహాలక్ష్మమ్మ గబగబా నిచ్చెన దిగి "ఏమిటా?...మీ బొందా, నా బొందాను!...అసలా దిక్కుమాలిన పొలంబేరం నాకు మొదటినించీ ఇష్టంలేదు! కానే దిక్కులేక ధరలు రాకపోతే...మన్ని చూసి కళ్లల్లో నిప్పులుపోసుకుంటే ఏం లాభం? అంత నష్టపోతున్నామనుకుంటున్నప్పుడు

ఆ విషయం కొడుకుతో చెప్పరాదా, నాలుగు చెప్పుదెబ్బలు వాడే కొడితే పడరాదా!..."

ఇలా, మహాలక్షుమ్మ నోటికి వచ్చినట్లల్లా, మాట్లాడుతుందే. వెంకట్రామయ్య పట్టలేక "ఇహ చాల్లే, నోర్ముయ్యి!... ఏం? మహా నోర్లేస్తోంది..." అని గదమాయించేసరికి మహాలక్షుమ్మ పితూరీచేస్తున్న ధోరణిలో "పెళ్లా పెళ్లా నోటికి వచ్చినట్టల్లామాటలంటుంటే పడటం మీకు బాగుంటుంది కాబోలు నేం?...ఇందాక, అలా కాస్సేపు కూచునివద్దామని అమ్మాయిగారింటికి పోదును గదా, గుమ్మంలో గుమ్మం... ఆ రామ్మూర్తిగారి అరుగుమీద చేరి ఒక తిట్టు కాదు ఒక మాట కాదు...అట్లా ఆడిపోసుకుంటే ఊరుకోవటాని కెవరికేంఖర్మ కాలింది!..." అంది

వెంకట్రామయ్యకూడా భార్యకోపం అర్థంచేసుకున్నట్లు "పొలం అమ్ముతున్న కొడుకు మంచివాడే...ఎటొచ్చీ కొనే వాళ్లే నన్నమాట..."

మహాలక్షుమ్మ భర్తని వాక్యం పూర్తి చెయ్యనియ్యకండానే "ఆఁ!....మరేమిటి? శాణాతనమంటే!..." అని ఒక నొక్కు నొక్కి, కూడా బలుకుతున్నట్టు, "ఆ కొడుకునమాత్రం గుక్కతిప్పుకోనిస్తోందా యేమిటి? వియ్యామ్మ గయ్యాళితనం ఊరికి కొత్తా?..." అని, చేతిలో ఇముడ్చుకున్న కట్టిపేళ్లు తీసికెళ్లి వంటింట్లో పడేసి క్షణంలో చక్కా వచ్చి, "చేతిలో డబ్బుండాలిగానీ ఊళ్లో పొలాలకికరువొచ్చిందా? అంత ఉసురుగొట్టుపొలం. ఊరికే ఇచ్చినా మన కొద్దు బాబూ!" అంది.

అవసరమైతే కొంచెం ధర పెంచి అయినా పొలం తను కొనాలనుకుంటున్న వెంకట్రామయ్యకు ఈ మాటలేవీ రుచించలేదు.

"సరేలే... నువ్వెళ్లి వంటకానిచ్చు. పొద్దుపోయింది" అని వసారాలో మంచం వాల్చుకుని కూర్చున్నాడు. తను కొందామనుకున్న పొలం ఇలా అన్నిందాలా నలుగురులో పడటంతో ఆయన విచారపడకండా ఉండలేకపోయాడు. కొనటం అంటూ ఉంటే తనకి ఆ పొలం చాలా అనువైనదన్న విషయం ఎవ్వరూ కాదనలేరు. గుర్నాథం ఊరునుంచి రాగానే చెప్పి కొంచెం అటూ ఇటూగా బేరం ఫైసలు చేయించుకోవాలని నిశ్చయానికి వచ్చి ఆలోచిస్తూ పడుకున్నాడు వెంకట్రామయ్య.

ఇంతలో కరణంగారు రమ్మంటున్నారని కబురు వచ్చేసరికి స్పృహలోకి వచ్చాడు వెంకట్రామయ్య. తలుపు వేసుకోమని బయటినించే కేక వేసి దారినిపడ్డాడు.

గుర్నాథం తనతో మాట్లాడగల విషయాలనుగురించి పరిపరి విధాల దారిపొడుగునా ఆలోచిస్తూనే వున్నాడు వెంకట్రామయ్య. అవసరమైతే తప్ప తనుమాత్రం ముందు బయట పడకూడదనుకున్నాడు మళ్ళీ.

అరుగుమీద కరణంగారి మనమరాలు దీపంముందు కూర్చుని ఏదో చదువుకుంటున్నది. వెంకట్రామయ్య "తాతయ్యున్నాట్టే అమ్మాయ్!" అంటుండగానే గుర్నాథం లోపలినుంచి వచ్చి "అమ్మాయ్! సుగుణా! నువ్వు లోపలికెళ్ళి చదువుకో, పో..." అని మనమరాల్ని లోపలికి పంపి "రా! బావా! రా!" అంటూ తనుకూడా వచ్చి చాపపైన కూలబడ్డాడు.

"ఊరు వెళ్లావుటే..." అంటూ వెంకట్రామయ్య సంభాషణకి ఉపక్రమించాడు.

"ఆఁ... అదే... మరెక్కడికో కాదు. రెవిన్యూ ఇన్స్పెక్టరు కబురంపితేను, నిడుమోలు వెళ్లాను" అన్నాడు ముఖం చిట్లించి కాళ్ళ వేళ్ల మిటికెలు విరుస్తూ. "మధ్యాన్నం రెండుసార్లు వచ్చి వెళ్లావుటగా? చూశావా? నేను అన్నంతా అయింది. సుబ్బరామయ్య పొలం కొనటానికి సిద్ధంగా వున్నాడు..." అంటూ సూటిగా విషయంలోకి వచ్చాడు.

"నేనూ అందుకే వచ్చాను" అన్నాడు వెంకట్రామయ్య తన్ని తాను నిందించుకుంటున్న ధోరణిలో. ఇంకా ఏపాటి వీలున్నా తను ఎకరం రెండువేల ఏడువందలదాకా పెంచదల్చుకున్నానని చెపుదామనుకున్నాడు. కాని, ఇంతలో "నీకిష్టమైతే, నే నొక్క సలహా చెపుదామనుకుంటున్నాను..." అంటూ గుర్నాథం వెంకట్రామయ్యముఖంలో చూచేసరికి, వెంకట్రామయ్య తన తొందరంతా దిగమింగి... చెప్పమన్నట్లు గుర్నాథంపైపు ఔత్సుక్యంతో చూశాడు.

గుర్నాథం కొంచెం తాపీగా ప్రారంభించాడు: "కాస్తకీ, కూస్తకీ కక్కుర్తి పడి నువ్వు ఆ పొలం చెయ్యిజార్చుకోవటం నాకేమాత్రం ఇష్టంలేదు. అందుకనే సుబ్బరామయ్య బేరం తొక్కిపట్టి వుంచాను. ఐతే, నువ్వు శివయ్యవిషయంకూడా కొంచెం గమనించాలి - వాడూ కష్టాల్లో వుండి అమ్ముతున్నాడు. అమ్ముతాననంగానే ఎగబడి వస్తున్న పెద్ద బేరాలు లేవనుకో... ఐనా, ఆగడ్డలో పొలమే మూణ్ణెల్ల క్రితం రామకోటయ్య ఎకరం మూడువేల మూడొందల చొప్పున అమ్మిన విషయం మనమంతా ఎరుగున్నదే... వెంకట్రామయ్యా! నా అభిప్రాయం చెప్పాలంటే శివయ్యను ఎకరం రెండువేల అయిదువందలకి అడగటం ధర్మంకాదు..." అంటూ గుర్నాథం తన మనస్సులో ఉన్న విషయమేదో బయటపెట్టాడు. ఉన్న రహస్యం చెప్పాలంటే గుర్నాథానికున్న ఈఅభిప్రాయంవల్లనే శివయ్య తన పొలాన్ని రెండువేల అయిదువందలచొప్పునే అమ్మవలసివస్తే వెంకట్రామయ్యకి మాత్రం అమ్మవద్దని శివయ్యకి సలహా ఇచ్చాడు!

ఇంకా ఏమి చెపుతాడోనని కూర్చున్న వెంకట్రామయ్యతో "నీకు నచ్చితే... మీకెవ్వరికీ కష్టంలేని ఒక మార్గం చెప్తాను- శివయ్యపొలం మూడువేలచొప్పున ఖరీదు చెయ్యి. కాకపోతే, రాతకోతలుమాత్రం ఎకరం పదిహేనువందలకో, రెండువేలకో కొన్నట్లు రాసుకోండి. నువ్వు ఎక్కువ పెట్టాననుకునేవార స్టాంపు డ్యూటీలో కలిసివస్తుంది..." అన్నాడు గుర్నాథం వెంకట్రామయ్యముఖంలోకి చూస్తూ.

గుర్నాథం ఇచ్చిన ఈ సలహా చాలావరకు సబబుగానే కనపడింది వెంకట్రామయ్యకు. దీనివల్ల తను అదనంగా పెట్టవలసిన ఖర్చు చాలా తక్కువ. ఐనా, బేరం ఆడటం మంచిదని చిట్టచివరికి ఎకరం రెండువేల ఎనిమిదివందలకు ఫైసలు చేయించేట్టు గుర్నాథాన్ని ఒప్పించాడు.

భోజనానికి లేచి మడికట్టుకోమని గుర్నాథానికి ఇంట్లోనుంచి రెండోపిలుపు కూడా వచ్చేసరికి వెంకట్రామయ్య సంభాషణ చాలించి బయటపడ్డాడు.

పొలంబేరం సంతృప్తికరంగా ముయటంతో...గుర్నాథం ఈ చక్కని ఉపాయం బయటపెట్టకముందే తను తొందరపడి ధర పెంచుతానని చెప్పనందుకు తన్ని తానే అనేకవిధాల అభినందించుకున్నాడు. అలాగే ఆ రాతకోతలు కాస్తా పూర్తిఅయితే "అమ్మయ్య!" అనుకుంటాను అనుకున్నాడు.

(27-వ పేజీ చూడండి)

గల్పిక:

పొరపాటు

శ్రీ విశ్వమిత్ర

కిటికీ రెక్కని గోడకేసి కాలుతో టక, టకమని శర్మ చేసే చప్పుడు అకస్మాత్తుగా ఆగిపోటంతో, నే నా నిశ్శబ్దానికి కారణమేమిటై వుంటుందా? అని వాడి వేపు తిరిగాను.

వాడు నావైపు తిరిగేటప్పటికే నేను వాడివైపు తిరిగి "ఏమిట" న్నట్టు మొఖం పెట్టటం వాడికి కొంత సంతోషాన్ని కల్పించింది.

నే నడక్కుండానే వాడేదో చెప్ప దలుచుకొన్నాడని నాకు తెలిసినా, "ఏం ఆపాప్?" అని నే నడక్కుండా వుండలేక పోయాను.

"ఐతే ఇంతకీ మన 'కె. ఎస్. ఆర్.' ఇంట్లో తిరిగే కుర్రా డెవ రంటావ్?"

అనుమానం తెగక అడిగాడు.

"బావమరిది!"

ఈ విషయం వాడి కెంత తెలుసో నాకూ అంతే తెలుసు! ఎందుకంటే మే మిద్దరం ఒకచోట వుండగానే 'సూరి' వాతో ఫలాని కుర్రాడు లెక్చరర్ కె. ఎస్. ఆర్. 'బావమరిది' అని చెప్పటం జరిగింది.

ఐనా మళ్ళీ శర్మ అడిగాడూ అంటే బహుశా అది వాడు వినకుండాఅన్నా వుండి వుండాలి,' లేకపోతే విని మరిచిపోయి అన్నా వుండాలి.

అందుక నే ఎందుకైనా మంచిదని నే నదే చెప్పా.

'నిజమే నంటావా?' అన్నట్టు నావంక ఓ అరనిముషం చూశాడు శర్మ.

'ఏమిటి సందేహిస్తున్నావు?' అడిగాను.

'ఐతే మన పంట పండిందన్నమాటే!' అన్నాడు చేతిలోవున్న ఫిజిక్స్ పుస్తకాన్ని నిర్లక్ష్యంగా విసిరి పారేస్తూ—ఇహ దానవసరం లేనట్టు...

'అదెలాగు?' అర్థం కాక అడిగాను.

'డబ్బు!!' అన్నాడు మావాడు.

'పుచ్చుకొంటా డంటావా?' వెధవ అనుమానం తీరక అడిగాను.

"డబ్బుకి మిగతా వస్తువులన్నీ, రూపాంతరాలే అని నీ కింకా తెలీదనుకొంటాను!' శర్మ సిద్ధాంతము.

డబ్బుని డబ్బురూపంలో కాకుండా ఇంకోరూపంలో అంటే ఏరూపంలో ఐవుంటుందో నాచిన్న బుర్రకి తట్టకపోవటంవల్ల మళ్ళీ దానిక్కూడా వాణ్నే అడగాల్సొచ్చింది.

క్రమంగా వాడు చెప్పిందంతా అర్థంచేసుకొన్నాక — నిజంగా నేను శర్మలో ఓ గొప్ప విషయాన్ని కనిపెట్ట గలిగాను. అదేమిటంటే—సామాన్యంగా ఎవరికైనా ఏదైనా ఓసమస్య తెగాలీ అంటే ప్రత్యేకం పనికట్టుకూర్చుని తల బద్దలు కొట్టుకొంటారు గాని వీ డలా కాదు.

శర్మ ఏదైనా గట్టిపన్లో వున్నప్పుడే ఎన్నెన్నో గొప్ప, గొప్పచిక్కు సమస్యలు విడిపోవటం వాడికి మామూలే!

* * *

ఒకనాడు రోడ్డుమీద పోతూంటే మాకు కొన్ని గజాలముందర కొంతమంది వ్యక్తులు మాట్లాడుకొంటూ పోతున్నారు. వాళ్లలో మే మనుకొంటున్న 'కె. ఎస్. ఆర్.' బావమర్దికూడా వున్నాడని చెప్పటం ముఖ్య విషయం.

అప్రయత్నంగా శర్మ చప్పట్లు కొట్టాడు. ఆ జనం ఆగారు.

శర్మా, నేనూ, బాగా దగ్గిరికెళ్లాం. శర్మ అతని (కె. ఎస్. ఆర్. బావమరిది?) వైపు ఓసారి సూటిగా చూసి, "సారీ! మిమ్మల్ని చూసి మా సుందర మేమో అనుకొన్నా!" అన్నాడు.

తర్వాత శర్మా, నేనూ వాళ్లతో కలిసి పార్కు కెళ్లాం.

అతన్తో పరిచయంచేసుకోటం శర్మకి ఎక్కువ టైం వేస్టుచేసుకోకుండానే జరిగింది.

మరీ సూటిగా అడిగినట్టు కాకుండా శర్మ సంభాషణ మధ్యలో అతన్తో అన్నాడు!

'అన్నట్టు మీరు కె. ఎస్. ఆర్. గారి...

శర్మ ఇంకా పూర్తిగా మాట్లాడకుండానే అతను ఓ చిరునవ్వు నవ్వి:

"ఆఁ- ఆఁ- ఔనౌను..." అన్నాడు.

అనుమానంతీరిపోయినట్టూ—సగం గెలిచినట్టూ మెల్లిగా నవ్వాడు శర్మ.

రొట్టె నేతిలో పడిందని నేనూ సంతోషించకపోలేదు.

* * * *

సెలక్షన్స్ ఐపోయినయ్. అతన్తో మా శర్మా, నేనూ, చనువుగానే తిరుగుతున్నాం. అతని మెప్పుకోసమని శర్మ హోటలుబిల్లులు, సినిమాఖర్చులు, ఇత్యాది అనేక చిల్లర ఖర్చులు భరిస్తూవుండేవాడు. అందుకనే అతను శర్మమాట తోసెయ్య లేడని మా నమ్మకం!

పరీక్ష లైపోయింతర్వాత ఓ రోజున అతనితో శర్మ మూచాయగా ఇలాఅన్నాడు!

"మీ బావచేత మా పని చేయించాలి!"

అతను తల పంకించి అర్థంకానట్టు

"మా బావచేత మీపని చేయించటానికి, నా కేం అభ్యంతరం లేదుకానీ - మా బావ వలన మీకు కాగల పనేమిటో నాకర్థం కావటంలేదు..."

శర్మ తెల్లబోయ్యాడు. అన్నీ తెలిసికూడా అతను ఎందుకు ఇలా నటిస్తున్నాడో అర్థంకాక బాధపడ్డాడు. అందుకని ఈ విషయం అతని నోటిమీదుగానే రానిద్దామని శర్మ:

'ఐతే మీ బావ వుద్యోగమేమిటి' అన్నా డదోవిధంగా.

'కంట్రాక్టర్!'

శర్మకి వొళ్లుమండింది. ఐతే ఇన్నాళ్లనుంచీ అతను - అతను అని చెప్పుకొని తనని మోసం చేస్తున్నా డన్నమాట!

'మరి ఆనా డలా చెప్పారేం?'

'ఎలా చెప్పాను?'

'కె. ఎస్. ఆర్ గారి బావమరిదనీ!'

'నే నెప్పుడూ అట్లా చెప్పివుండలేదు!'

'చెప్పి - చెప్పలేదంటా వేం?'

'బహుశా మీరలా ఊహించివుండొచ్చు'

మాట మీద మాటపెరిగి శర్మకి కోపం ఆగక, ఉద్రేకంమీద తను చేసిన డబ్బంతా పూర్తిగా క్షౌరంఐందని తెలిసేటప్పటికి వొళ్లుమండి అతన్ని దులిపేశాడు.

అతనూ తక్కువ తిన్నవా డేం కాకపోటంచేత అనగలిగినన్ని అతనూ అని ఆఖరికి వెళ్లేటప్పుడు:

"డియర్ శర్మగారూ! కె. ఎస్. ఆర్. గారు మా అన్నయ్యౌనని మీకు తెలియాకపోయినందుకు విచారిస్తున్నాను!" అన్నాడు. ★

అంతా ఘటన

"రాధానాథశాస్త్రి" (పెద్దకథ)

1

కయ్యానికీ వియ్యానికీ ఉజ్జీలు సమానంగా వుండాలని మనవాళ్లు ఏనాడో చెప్పారు.

అందులో వియ్యంలో చెలరేగే కయ్యంలో రెండువైపులా సమ వుజ్జీలు వుంటేనే కథ రక్తికడుతుంది. రెండు చేతులూ కలిస్తే కాని చప్పుడు కాదు. ఈ చప్పుడు ఇవాళ పెళ్లిడప్పులకంటే సన్నాయిమోతకంటే ప్రచండంగా వుంది. విడిదిఇల్లంతా గగ్గోలుగా రణరంగంగా మారింది. అంతా రాజుకునే నిప్పుని ఎగసనతోసేవాళ్లే కాని చల్లార్చేవాళ్లు ఒకళ్లూ లేరు.

అసలు జగడం వియ్యపురాలిని భోజనానికి పిలిచేటప్పుడు పెళ్లికూతురుతరఫువాళ్లు తగినంత మర్యాదనీ వినయాన్నీ ప్రదర్శించలేదనీ, ఆడబిడ్డ స్థూలశరీరాన్ని గౌరవించకుండా చిన్నపీట వేశారనీ, లగ్నంనాటి పొద్దున ఫలహారాలు ఆలస్యంగా వచ్చాయనీ, ఉప్మా బియ్యపురవ్వతో చేశారనీ, కాఫీలో బెల్లం వేశారనీ ఆరంభమయింది. చిన్నచిన్న కారణాలతో రగిలిన పోట్లాట చిలికి చిలికి గాలివాన అయింది. నిప్పుకి గాలి తోడైనట్లు పెళ్లికూతురి తండ్రి పెడసరంకూడా జగడాన్ని మరీ రగులుకొలిపింది. వీళ్ల మొహాన చెవులు పిండుకుంటూ పది వేలకట్నం పారేశాంకదా ఇంకా వీళ్లకి లొంగి వొంగి సలాం ఎందుకు చెయ్యాలని పెళ్లికూతురుతండ్రి రామయ్యగారి పట్టుదల. మనకుర్రాడు బి. ఏ. చదువుతున్నాడు, మనకి సాలుకి పాతిక వేలు ఆదాయం. వీడు మన అడుగులకి మడుగులు ఎందు కొత్తరాదని పెళ్లికొడుకుతండ్రి కామయ్యగారికి ధీమా. ఇందులో ఎవరూ సర్దుకునే రకంకాదు. ఎవరూ తీసిపోయిన ఘటంకాదు. ఈ పేచీలు దేవుడిదయవల్ల మూడుముళ్ళూ పడి ముహూర్తం సక్రమంగా జరిగినాక వచ్చినై కాని లేకపోతే గాలివాన వస్తే కథే ఆగింది అన్నట్లు మొదటికే మోసం వచ్చేది.

లగ్నంనాటి రాత్రి పెళ్లికొడుకుతరఫువాళ్లంతా విడిదిఇంట్లోనే విడిగా వంట చేసుకున్నారు. రామయ్యగారు మామూలుగా వెళ్లి "భోజనానికి లేవండి" అని పిలిచాడు. కామయ్యగారు ధుమధుమలాడుతూ "నీ గడప తొక్కం ఫో" అన్నాడు. రామయ్యగారు బిరుసుగా "అయితే మరీ మంచిది" అని వెళ్లిపోతున్నాడు. విడిదిఇంటి గడప దాటుతుంటే కామయ్యగారు కారాలు మిరియాలు నూరుతూ "అంత తలబిరుసుగా వుంటే మా అబ్బాయికి మూడు నిమిషాల్లో ఇంకో పెళ్ళి చేస్తాను తెలుసునా?" అని అరిచాడు. రామయ్యగారు వెనక్కి తిరిగి చూడకుండా "నన్నేం బెదిరిస్తావా? నేనేనా అంత చేతకానివాణ్ని? నీ కొడుక్కి మళ్ళీ పెళ్లిచేసిన నిమిషమే నాకూతురికీ చేస్తాను" అని కరుకుగా బదులు చెప్పి చరచరా వెళ్లిపోయాడు. కామయ్యగారు కాలుగాలిన పిల్లిలాగా కల్లు తాగిన కోతిలాగా విడిది ఇల్లంతా భరతనాట్యం చేశాడు.

వియ్యంకులకయ్యం తొండ ముదిరి ఊసరవిల్లి అవుతోందని పెళ్లికి వచ్చిన చుట్టాలంతా ఇంటిదారి పడుతున్నారు. మూడు రోజులూ లాంఛనంగా వుండటం కూడా మానేసి మూటా ముల్లే సర్దుకుని పెళ్లికొడుకు తరఫువాళ్లంతా మర్నాడే తిరుగుముఖం పట్టారు. కారులో ఎక్కేముందు వియ్యపురాలి బెట్టు కొంచెం తగ్గించి లోకం ఏమంటుందో నని పెళ్ళికొడుకుతల్లి రామయ్యగారి గడపలోకి వెళ్ళి "పెళ్ళికూతురిని పంపుతారా?" అని అడిగింది. తండ్రి కోపంలో ఏం అంటాడోఅని పెళ్ళికూతురు కమల తనే ముందుకి వచ్చి "పదండి అత్తగారూ!" అంది. మనుగుడుపులకి ఒక్క పెళ్ళికూతురే వెళ్లింది. ఇంకోళ్లని రమ్మని వాళ్లూ పిలవలేదు, కూడా వస్తామని వీళ్లూ బయలుదేరలేదు. కారు బయలుదేరి వెళ్లిపోయింది. రామయ్య కారు దాటిపోగానే అక్కడే చతికిలబడిపోయాడు. ఒక్కతే కూతురు ఎంతో వైభవంగా అన్ని అచ్చట్లూ ముచ్చట్లూ జరిపి మురిపెంగా పెళ్ళి చేద్దామని ఆశపడ్డాడు. అందుకే పదివేల కట్నానికి ఒప్పుకున్నాడు. కాని అంతా రసాభాస అయింది. ఇటువంటి పేచీకోరు మేళంతో పిల్లఎల్లా వేగుతుందా అని లోపల దిగులుపడుతున్నాడు. పదివేలూ వొదిలినా ఫలితం దక్కలేదనే చింత పట్టుకుంది. తన తప్పేముంది? పిల్లనిచ్చుకున్నంత మాత్రాన కానిసలాగా జోహుకుం అనాలా? తన గొంతులో వూపిరి వున్నంతకాలం ఇంకోళ్లకి తల వంచటమనేది ఒట్టిమాట. మరి పిల్లకాపురం ఏంకానున్నదో? ఎవరు చెప్పగలరు? ఎవరి కర్మలకి ఎవరు కర్తలు? అంతా ఆ భగవంతుడిదే భారం అనుకుంటూ అక్కడే స్తంభంలాగా నిలబడిపోయాడు. "వెతికి వెతికి మహా లావు సంబంధం తెచ్చారండీ? దాని గొంతుకి ఉరితాడు పోసినట్లయింది" అని లోపలనుంచి భార్య అంది.

"ఇల్లా అవుతుందని నేననుకున్నానా? అన్నీ విచారించి కుర్రాడు బి. ఏ. చదువుతున్నాడు; ఇంత వున్నవాడని ఇచ్చాను. ఇంతకీ దాని రాత ఇల్లా వుంటే మనమేం చేస్తాం? అంతా ఘటన. ఎల్లా జరగాలనివుంటే అల్లా జరుగుతుంది" అని దిగులుగా బదులు చెప్పాడు.

పెళ్లికి వచ్చిన రామయ్యగారి మరదలు ఎక్కడ పట్టుకొచ్చావయ్యా బావా ఈ సంబంధం? అన్నిటికంటె ఆశ్చర్యం. బి. ఏ. చదువుతున్నాట్ట పెళ్ళికొడుకు. నోరూ వాయా లేదు. తండ్రి కూచోమంటే కూచుంటాడు. నుంచోమంటే నుంచుంటాడు. ఆ తీరుమనిషితో మన కమల ఎల్లా కాపురం వెళ్లదీస్తుందో నాకు తోచకుండా వుంది" అంది.

"అసలీ తూర్పు మేళం అంతా అంతే. వాళ్లతో ఎవరూ వేగలేరు. ఉత్త పేచీ మనుషులు. వాళ్లకి పరువూ మర్యాదల్లో లేదు" అని పెళ్ళికూతురి తల్లి కడుపుమంటవల్ల తూర్పువాళ్లందరిమీదా ధ్వజం ఎత్తింది.

"అయినా బావా నాకు తెలియక అడుగుతాను. నీకూడా అంత పట్టుదల ఎందుకయ్యా? ఆడపిల్లని ఇచ్చుకున్నవాళ్లం అల్లా వుంటే ఎల్లా కుదురుతుందయ్యా?" అని మందలింపుగా మరదలు అంది.

రామయ్య కోపంతో రగిలిపోయాడు. "ఆడపిల్లని ఇచ్చినంతమాత్రాన ఆ వెధవలకి నౌకరులాగా ఊడిగం చెయ్యమంటావా? పిల్లనేం ఊరికే చేసుకున్నారా? పదివేలు పుచ్చుకున్నారు. దాని గీత ఎల్లా వున్నా అది కన్న కడుపుకి బరువు కాదుగా!" అని ఉద్రేకంతో అక్కణ్నుంచి లేచి పోయాడు.

* * * *

అత్తవారింట్లో మూడురోజులూ మూడు యుగాలుగా కమలకి గడిచింది. అనుక్షణమూ అత్తమామలు తన తల్లిదండ్రులని అన్యాయమైన తిట్లూ తిడుతుంటే వినలేక చెవులు మూసుకుంది. ఎవరూ తనతో మాట్లాడరు. అంతా తనని వెలివేసినట్లుగా దూరంగా వుంచుతున్నారు. తను కూచున్నా నుంచున్నా తప్పులు పడుతున్నారు. తను మాట్లాడినా మాట్లాడకపోయినా నేరంగా ఎంచుతున్నారు. తనకి వినయ విధేయతలు లేవనీ, మాటతీరు లేదనీ, కాస్త చదువున్నదని మిడిసిపడుతున్నదనీ, ఎవరికి తోచినట్లు వాళ్లు దండిస్తున్నారు. పోనీ భర్తని చాటుగా కలుసుకుని తన బాధలు చెప్పుకుని అతని సానుభూతితో మనశ్శాంతి పొందుదామనుకుంటే అదీ వీలుపడలేదు. తను అతనిముందు అనవసరమైన సిగ్గుపడకుండా నిబ్బరంగా నిలబడి అతనికేసి ఆశతో జాలిగా చూసినా అతను తనకేసి కన్నెత్తి చూడటానికే భయపడుతున్నాడు. తననిచూస్తే ఒక పెద్దపులిని చూసినట్లుగా దూరంగా పారిపోతున్నాడు. సిగ్గువిడిచి ఒకసారి ఏదో మాటలు కలుపుదామని ప్రయత్నించింది. కాని భర్త బెదురుతూ సిగ్గుపడుతూ అక్కడినించి వెళ్లిపోయాడు.

మూడురోజులూ ఎప్పుడు అయిపోతాయా అని కమల తహతహలాడింది. ఆ ఇంట్లో వున్నంతసేపూ సలసలకాగే పెనంమీద నిలబడ్డట్లుగా వుంది. అత్తవారు తనని మనుగుడుపులనే మిషతో వేధించి చిత్రవధ చేసి కసితీర్చుకోటానికే ఇక్కడికి తీసుకొచ్చారా అనిపించింది.

నాలుగోరోజు పొద్దున్నే కమల పుట్టింటికి తిరుగు ప్రయాణం కట్టింది. తననిదింపటానికి తోడుగా భర్త వచ్చాడు. బండీ ఎక్కబోతుంటే మామగారు దగ్గరికి వచ్చి "అమ్మాయ్ నువ్వు త్వరగా ఇక్కడికి వచ్చెయ్యాలి. మీ నాన్నదగ్గర ఎక్కువరోజులుంటే అనవసరంగా చెడిపోతావ్" అన్నాడు. ఈ మాటలకి కమల మనస్సు చివుక్కుమంది. ముఖం కందిపోయింది. తల వంచుకుని మెదలకుండా వూరుకుంది. పుట్టిందిమొదలూ ఇన్నాళ్లూ తను తండ్రిదగ్గర వుండటంవల్ల ఏం చెడిపోయింది? ఇకముందు ఎందుకు చెడిపోతుంది? అయినా తనని చెడగొట్టేటంత చెడుతనం తండ్రిలో ఏముంది? ఇది తన తండ్రిమీద మామగారికున్న అగౌరవాన్ని అక్కసునీ వెళ్లబోసుకోటానికి అన్నమాట అని కమల తెలుసుకోగలిగింది. తనతరఫున భర్త మామగారికి ఏదైనా బదులు చెబుతాడేమోనని కమల ఆశపడింది. కాని భర్త తనకంటే ఎక్కువగా తల వొంచుకుని కూచోటం చూసి కమల చకితురాలయిపోయింది. తను ఒక కీలుబొమ్మని పెళ్లాడాననే బాధ ఆ నిమిషంలో కమలని కుంగదీసింది. ఇటువంటి భర్తతో తన భావిజీవితం ఏ తీరుగా వెళుతుందా అని కమల లోపల దిగులుపడసాగింది.

స్టేషనులోకి రైలు రాగానే తన పెట్టెని ఆడవాళ్ళ ఇంటరులో పెట్టించి ఎక్కమన్నాడు. తనుకూడా భర్తదగ్గరే కూచోవాలనీ వీలయితే కబుర్లు చెప్పుకోవాలనీ కమల ఆశపడింది. కాని తనని ఒంటరిగా ఆడవాళ్ళపెట్టెలో కూచోబెట్టి భర్త దామోదరరావు వెళ్లి ఒక్కడే ఇంకో పెట్టెలో కూచున్నాడు. మధ్య పెద్ద స్టేషనొకటి వచ్చింది. తనపెట్టెలో కూచున్నవాళ్ల భర్తలూ బంధువులూ వచ్చి చెంబులతో కాఫీలూ ఫలహారాలూ తెచ్చి అందిచ్చి వెళ్లారు. కమలకి కాఫీ తాగాలనివుంది. కాని తన భర్త వచ్చేజాడ కనబడలేదు. అల్లాగే కూచుంది. మంగళవాద్యాలతో శుభసంతోషాలతో ఆరంభం కావలసిన కళ్యాణ జీవనం సిద్ధాంతరాద్ధాంతాలతోనూ సమరఘోషలతోనూ ఆరంభం అయింది. దాని చీకటినీడలు భావి జీతంలో ఎల్లా అలుముకుంటున్నవో కమలకి తెలిసివస్తోంది. ఇప్పుడే ఇంత బాధాకరంగా వున్న దాని ఫలితాలు ముందుముందు ఎంత దుర్భరంగా వుండబోతయ్యో అని కమల లోపల ఎంతో చెదిరిపోయింది. గిరగిర తిరుగుతూ వెనక్కి పరిగెడుతున్న పొలాలకేసి చెట్లకేసి చూస్తూ కూచుంది. నేనేం తప్పుచేశాను? నాకెందుకీ శిక్ష? అని మనస్సులో పదేపదే అనుకుంటూ లోపలినించి పొంగుకువస్తున్న ఆవేదనని అణుచుకుంది.

ఇంతలో స్టేషను వచ్చింది. కమల దిగి తన పెట్టెని దింపుకుంది. భర్తకోసం ఎదురుచూస్తూ నిలబడింది. కొంచెంసేపటికి దామోదరంవచ్చి కూలీని మాట్లాడి పెట్టె జట్కాలో పెట్టమన్నాడు. కమల జట్కా ఎక్కి కూచుంది. దామోదరం "వెళ్లొస్తా" అన్నాడు. "అదేమిటి? ఇక్కణ్ణుంచి వెనక్కి తిరిగివెళ్తారా? రండి. మా నాన్నావాళ్లూ ఏమనుకుంటారు చెప్పండి, రండి, బండీ, ఎక్కండి." అని కమల తొలిసిగ్గు తెరలని అవలకి తోసి ఎంతో దీనంగా బతిమాలింది. అన్నిటికీ ముక్తసరిగా "వెళ్లాలి, రాను" అని పోనియ్యవోయ్‌బండీ అని బండీవాణ్ని హెచ్చరించాడు. బండీ కదలబోతోంది. "అయితే మళ్లీ మీదర్శనం ఎప్పుడూ?" అని కమల తొణుకుతున్న కన్నీళ్లతో అడిగింది. ముఖం పక్కకి తిప్పుకుని దామోదరం "ఏమో!" అంటూ చకచకా స్టేషనువేపుకి నడిచాడు.

కంకరరోడ్డున ఇనపపట్టాల గుళ్లపుబండీ కరకరమంటూ టకటకలాడుతూ పోతోంది. ఆ బండీ తన గుండెలమీదినించే నడిచిపోతున్నంత బాధగా వుంది కమలకి. ఒక్కత్తే ఏముఖంతో తల్లిదండ్రులకంట బడుతుంది? వాళ్లకి ఎల్లా సర్దిచెబుతుంది?

వాకిటిముందు బండీ ఆగిన చప్పుడు విని పెళ్లివారు వచ్చారని గబగబా వచ్చిన రామయ్య బిక్కుబిక్కుమంటూ కమల ఒక్కత్తే బండీ దిగటం చూసి నిలువునా నీరైపోయాడు. కొరడాతో చురుక్కున చరిచి నట్లనిపించింది. "ఇదేమిటమ్మా? ఒక్కత్తెవే వచ్చావేం? వాళ్లేం మనుషులా దున్నపోతులా?" అని కోపంగా అనేసరికి కమల నవ్వుతూ "వారు స్టేషనుదగ్గరికి వచ్చి రైలెక్కించి వెళ్లారు. ఏమంత దూరాభారం? హాయిగా వచ్చాను" అని అప్రయత్నంగా అబద్ధమాడింది తండ్రి ముందు. అత్తవారి పరువు నిలపాలని అనవసరంగా అబద్ధం ఆడింది. "ఆయనగారు కాస్త ఇక్కడిదాకా వచ్చి దింపివెళ్తే అరిగిపోతాడా?" అని రోషంగా రామయ్య కందినముఖంతో అన్నాడు. "ఎల్లా వస్తారు నాన్నా? రేపే వాళ్ల కాలేజిట. లేకపోతే రాకపోయారా?" అని ఇంకో అబద్ధం ఆడింది.

"పదమ్మా లోపలికి పద. ఒక్కత్తెనీ పంపినందుకు బాగానే శాస్తి చేశారు. ఏమేవ్ చూశావా ఎంత పని చేశారో" అని పెళ్లాన్ని కేకపెట్టాడు.

తల్లి కమల ఒంటరిగా రావటం చూసి కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. "రా తల్లీ! కట్టుకున్నవాడికి బరువైనా కన్నవాళ్లకి బరువు కావులే, పదమ్మా! మూడురోజులకే ఎల్లా వాడిపోయావే తల్లీ? ఎంత బాధలు పెట్టారో దిక్కుమాలినవాళ్లు!" అంది.

"ఇంతలోనే చిక్కుతానుటమ్మా నీపిచ్చిగాని. ప్రయాణంబడలికవల్ల అల్లా కనిపిస్తున్నానేమో. అంతే కాని వాళ్లు నన్ను చక్కగానే చూశారమ్మా" అని కమల ఈసారి కావాలనే అబద్ధం చెప్పింది.

కాని లోపలినించి ఎందుకో ఆపుకోలేనంత ఏడుపు పొర్లుకువస్తోంది. ఇవాళ అబద్ధాలు ఆడింది. కాని నిజం బైటపడి తీరుతుంది. తన జీవితం ఏం కానున్నదో? తను ఆ ఇంట్లో వెళ్లి ఎల్లా కాపురం చేస్తుందో? ఇంతో అంతో చదువుతూకూడా

పూర్తిగా తల్లిదండ్రులచేతుల్లో కీలుబొమ్మలానే ఆడుతున్న భర్తతో కాలం ఎల్లా వెళ్లదీస్తుందో? కమలకి అంతా అయోమయంగా వుంది.

ఈ సంఘటన జరిగినాక రామయ్యగారి పట్టుదల మరీ బిర్రబిగిసిపోయింది. ఏమైనాసరే ఈసారి వాళ్లంతటవాళ్లు వచ్చి బతిమాలేదాకా కమలని అత్తవారింటికి పంపనే కూడదని నిశ్చయించుకున్నాడు. ఇంత అవమానం జరిగినాక ఇంత చిన్నతనం కలిగినాక వీసమైనా లొంగకూడదనుకున్నాడు. అత్తవారింట్లో కమలని బాధలు పెట్టివుంటారని అవన్నీ కమల కప్పిపుచ్చుతోందని ఆయన వెంటనే గ్రహించాడు. అటు సూర్యుడు ఇటుపొడిచినాసరే కమలని అత్తవారింటికి వాళ్లు వచ్చి ప్రాధేయపడితే తప్ప పంపనని రామయ్య గట్టి పట్టు పట్టాడు.

"పిల్లనిచ్చుకున్నవాళ్లకి ఈ పట్టుదలలు పెట్టుకు కూచుంటే జరుగుతుందిటయ్యా బావా?" అంది మరదలు.

"పిల్లని మనకేం బరువై ఇచ్చామా? వాళ్ల కాళ్లు పుచ్చుకుని బతిమాలవలసిన కర్మం నాకేం పట్టింది?"

"అయితే పెళ్లయినపిల్లని ఇంట్లో పెట్టుకుని ఎంతికాలం కూచుంటావు?"

"వాళ్లు వచ్చి తీసికెళ్లేదాకా"

"వాళ్లు అసలే రాకపోతేనో?"

"దాన్ని నా కొడుకనుకుంటాను. పెద్ద చదువు చెప్పించి వృద్ధిలోకి తీసుకొస్తాను. ఎప్పటికైనా వాళ్లతిక్క తిరిగి తీసికెళ్లారా సంతోషిస్తాను. లేదా దానిరాత అనుకుంటాను, వూరుకుంటాను."

"అంతేకాని నువ్వెళ్లి తగాదా మాపుకోవన్నమాట?"

"చచ్చినా. ఈ ఘటంలో ప్రాణం వున్నంతవరకూ ఆ పని జరగదు. పిల్లనిచ్చినంతమాత్రాన నేను ఆ వియ్యంకుడుగాడి నౌకర్నా?"

రామయ్యగారికి కోపం వస్తే అగ్గిరాముడని మరదలు గ్రహించి ప్రసంగం అంతటితో ఆపింది. ఇందాకటినించీ మేడమీద తిరుగుతున్న కమల కిందికి దిగివస్తూ వీళ్ల ప్రసంగం విని మెట్లమీద నిలబడిపోయింది. ప్రతిముక్కా విన్నది. అటు మేడమీదికీ పోలేక ఇటు కిందికీ రాలేక అక్కడే చతికిలబడిపోయింది. "ఇంతేనా నాబతుకిక?" అనే నిరాశా నిస్పృహా కమలని కలిచివేసినయ్. మోకాళ్లమీద తలపెట్టుకుని దిగాలుపడి ఎంతోసేపు కూచుండిపోయింది. తన దురదృష్టానికి ఎవరిని నిందించాలో తెలియటంలేదు. తను ఏం దోషం చేసిందని దైవం తనకి ఈ ఘోరశిక్ష విధిస్తున్నాడో కమలకి తెలియకుండా వుంది. తనమూలంగా తల్లిదండ్రులకి ఎంత బాధగా వుందో తలుచుకుంటే కమలకి మరీ దుఃఖం కలుగుతుంది. అయినా ఏమో తను అనవసరంగా భయపడుతున్నదేమో! తన భర్త చదువు పూర్తిఅయితే; అతని కాళ్లమీద అతను నిలబడగలిగితే తన కష్టాలు గట్టెక్కుతయేమోనని ఆశ తళుక్కుమంది. అప్పటికైనా తల్లిదండ్రులు గీసిన గీటు దాటగలుగుతాడా దామోదరంఅనే అనుమానం ఆ ఆశని అణగదొక్కుతోంది. అయినా అత్తమామలకి పెళ్లిలో పిల్లతగాదాలమీద పెరిగిన కక్షలు ఎల్లకాలం కూచుంటయ్యా? వాళ్ళకి తనమీద ప్రత్యేకించి వైషమ్యమేముంది? వాళ్లకి తనమీద జాలికలగవచ్చు. తనతండ్రి కూడా పట్టుదలకూడా సడలిపోవచ్చు. దైవం చల్లటిచూపుచూస్తే తన భావిజీవితం ఆనందధామం కావచ్చు. అవును ఇదంతా ఒక బాధాకరమైన స్వప్నంలాగా తేలిపోవచ్చును. తన అదృష్టం బాగుంటే అన్నీ సుఖపర్యవసానాన్ని పొందవచ్చు. ఈ ఆశల పారవశ్యంలో కమల తేలిపోయి తన బాధలని చాలాసేపు మరిచిపోయింది.

ఇవన్నీ జరగవచ్చు. కాని జరుగుతయ్యా అనేదే ప్రశ్న. ఆశలు తీసిన దారివెంట జీవితవాహిని ప్రవహిస్తే ఈ లోకంలో ఇన్ని నిట్టూర్పులూ, ఇంత కన్నీరూ ఎందుకు?

2

దామోదరరావు కామయ్యగారి ఏకైక పుత్రరత్నం. రత్నం అని ఎందుకంటున్నానంటే అటువంటి కొడుకుల్ని కనే అదృష్టం అందరికీ కలగదుగనక!

కామయ్యగారు బలే కట్టుదిట్టం మనిషి. ఒక్కడే కొడుకుగదా అని లేనిపోని గారాబాలు పెట్టిన పాపాన ఎప్పుడూ పోలేదు. ఆయనపేరు చెబితేనే దామోదరానికి హడల్. ఆయన నోరు తెరిచి మాట్లాడితే ఇంట్లో అందరికీ గడగడాట్. కారుణ్యమనేది ఆ మనిషిని తెగకోసినా కనిపించదు. వొచ్చినకొద్దీ పిండుకుని బంగారు కొండలు పేర్దామనుకునే రకంమనిషి. కుటుంబానికి కానీ ఖర్చుపెట్టాలంటే ఆయన ప్రాణంపోతుంది. డబ్బుకి ఆయనకీ లంకె. ఏదైనా పట్టుదల వస్తే తను పట్టిన కుందేలుకి మూడేకాళ్లని పట్టుకుని కూచునే రకం. ఇంతెందుకు కామయ్యగారు ఇంట్లో హిట్లరు అపరావతారం అంటే సరిపోతుంది. నిజానికి ఆయన హిట్లరుభక్తుడు కూడాను. రెండో ప్రపంచయుద్ధం జరిగే రోజుల్లో హిట్లర్ జయించాలని కోరుకున్నవాళ్లలో ఆయనకూడా ఒకడు.

కామయ్యగారి ధర్మపత్ని కామమ్మ ఇతరులముందు పెద్దపులే కాని మొగుడిముందుమాత్రం పిల్లి. భర్త నిరంకుశ పాలనకింద ఆవిడ వ్యక్తిత్వం ఎప్పుడో చచ్చిపోయింది. ఇప్పుడావిడ కేవలం జీవం లేని గ్రామఫోనురికార్డులాగా భర్త అభిప్రాయాలనే పలుకుతూవుంటుంది.

ఇటువంటి ఇంట్లో పుట్టి పెరిగాడు కాబట్టే దామోదరం తండ్రిచేతులో కీలుబొమ్మలాగా తయారయాడు. కామయ్యగారు కమలని చూసివచ్చి పదివేలు కట్నం కుదుర్చుకునివచ్చి "అబ్బాయ్ పెళ్లిచేసుకోరా" అంటే గంగిరెద్దులా తల వూపాడు. తన జీవితానికి భాగస్వామిని కాబోతున్న కమల అందచందాలని పెళ్లికి ముందు ఒకసారి చూడాలని కూడా దామోదరానికి అనిపించలేదు. అంతకంటే ఆశ్చర్యం - మనుగుడుపులు అయిపోయినాక కమలకి తోడు వెళ్లి స్టేషనులో దిగవిడిచి తిరుగు రైలులో ఇంటికి రమ్మని తండ్రిగారు శాసిస్తే తూచా తప్పకుండా, అత్తారింటికి వెళ్లకుండా ఇంటికి తిరిగివెళ్లాడు. ఇంతటి పితృవాక్యపరిపాలకులు ఈ రోజుల్లో కూడా వున్నారా అనిపిస్తుంది. వున్నారు. వీరిని కన్న తల్లిదండ్రులు పొంగిపోవచ్చును కాని వీరిని కట్టుకున్న భార్యలుమాత్రం దుర్భరదుఃఖంతో కృంగిపోక తప్పదు.

ఆ నోటా ఆ నోటా పడి కమల మళ్లీ కాలేజిలో చేరి చదువుతోందన్న సంగతి కామయ్యగారి కర్ణాలలో జొరబడింది. ఆయన క్రోధాగ్ని వెయ్యినాలుకలు జాపింది. ఇంత పని చేస్తాడా తన వియ్యంకుడు రామయ్య? పెళ్లి చేసినప్పుడు పిల్లని చదువు మానిపిస్తానన్న షరతుకి వొప్పుకున్నాడు. ఆ షరతుమీదే పిల్ల పెద్దదైనా సరేనని తను వొప్పుకున్నాడు. ఫలానావారి కోడలు కాలేజిలో చేరి చదువుతోందంటే తన గౌరవానికి మర్యాదకి సంప్రదాయానికి ఎంత దెబ్బ! పెళ్లిలో ఏదో పొరబాట్లు

(28-వ పేజీ చూడండి)

★ గణించదగిన చిత్రాలు ★

ప్రస్తుతం మన దేశంలో సినిమా కళ పెట్టుబడికి ఊడిగం చేస్తున్న విషయం అందరికీ తెలిసినదే. ఈ దుస్థితి పారిశ్రామిక పోటీవిధానంవల్ల ఏర్పడ్డదే గాని మరొకటికాదు. ఈ పోటీ ఫలితంగా చిత్రాలలో భావాలకు ప్రాముఖ్యం తగ్గి పదార్థాలకు హెచ్చింది. నేటి మన సినిమా చిత్రాలలో ఖరీదైన సెటింగులూ, ఖరీదైనదుస్తులూ, ఖర్చుతో కూడిన పాటలూ, పరికరాలూ, నటులూ, చిత్రనిర్మాణ విధానమూ పరిపాటి అయిపోయింది. మాటవరసకు సాహిత్య ప్రచురణలో కూడా ముచ్చటైన అచ్చుకూ, అందమైన కాగితానికీ, ఆకర్షవంతమైన బొమ్మలకూ, ఖరీదైన బైండుకూ ప్రాముఖ్యం హెచ్చితే సినిమా కళకు పట్టినకళే సాహిత్యకళకు కూడా పట్టిఉండును.

పై ఆకర్షణలతో బాటు భావానికి కూడా సినిమాచిత్రాలలో ప్రాముఖ్యం ఇవ్వరాదా, అది గిట్టుబాటు కాదా అనవచ్చు. కాని ప్రస్తుత పరిస్థితిలో పోటీ ఎంత తీవ్రంగా ఉన్నదంటే చిత్రనిర్మాతలు భావాన్ని గురించి ఆలోచించే స్థితిలో లేరు. తాము పెట్టేడబ్బు తిరిగి వస్తుందన్న ధైర్యం ఏ మాత్రం ఉన్నా కొద్దిమంది చిత్రనిర్మాతలు భావాలకు ప్రాముఖ్యం ఇవ్వవచ్చు. కాని అటువంటి ధైర్యం ఎవరికీ ఏకోశానా లేదు. ఏటా తీసే చిత్రాలలో సగానికి పైగా పూర్తిగా దెబ్బ తింటున్నాయి. మిగిలిన వాటిల్లో కూడా సగానికి పైగా తమడబ్బు తాము ఎత్తలేకుండా ఉన్నాయి. అయితే ఈ దెబ్బతినే చిత్రాలే చిత్రాల ఖర్చు పెంచేస్తున్నాయి. కొద్దిమంది నటులకోసం అందరు నిర్మాతలూ ఎగబడటంమూలాన తారలకు గిరాకీ ఏర్పడటమేగాక, ఒక్కొక్క తారా చాలా చిత్రాలలో నటిస్తూఉండటం చేత అన్ని చిత్రాలూ ఆలస్యంగా తయారై ఖర్చు పెరిగిపోతున్నది.

ఇట్లా తయారైనచిత్రాలలో "భావబలం" లోపించటంచేత చిత్రవిభజన స్థూలస్వరూపాన్ని బట్టి జరుగుతూ ఎప్పుడు ప్రజలు (ప్రేక్షకులు) ఏరకం చిత్రంతో విసుగెత్తుతారో ఊహించరాకుండా ఉంది.

ఈ పరిస్థితులకు తగ్గట్టే ప్రభుత్వం పన్నులు విధించే విధానం చిత్రనిర్మాణానికి గొడ్డలిపెట్టుగా ఉన్నది. చిత్రపరిశ్రమకు ముడిపదార్థాలైన ఫిలిమూ, రసాయినికాలూ దిగుమతి సుంకాలకు గురిఅవుతాయి. అట్లాగే చిత్రనిర్మాణ పరికరాలన్నీ దిగుమతి సుంకాలకు గురి అవుతాయి. చిత్రం తీసినతరవాత దానిమీద రాబడిలో ఒక పెద్దమొత్తం వినోదపు పన్నుకింద పోతుంది. మిగిలినదాంట్లో సగానికిపైగా ఎగ్జిబిటరూ, డిస్ట్రిబ్యూటరూ కలిసి పుచ్చుకుంటారు, చేతికి వచ్చేదానిలో అంతో ఇంతో లాభం ఉన్నప్పుడు చిత్రనిర్మాతకు ఆదాయపు పన్నుతగులుతుంది.

దీనికి విరుగు డేమిటన్నది ఇక్కడ మన సమస్య కాదు. ఇటువంటి పరిస్థితిలో తీసే చిత్రాలు భావయుతంగా ఉండే అవకాశాలు చాలా తక్కువని మాత్రమే మనం తెలుసుకోవాలి.

మన చిత్రనిర్మాతల కున్న సమస్యలు ఇతరదేశాల చిత్రనిర్మాతల కున్నప్పటికీ మనవారికి లేని సౌకర్యాలు కొన్ని ఇతర దేశాలవారి కున్నాయి. కనుకనే కొద్ది దేశాలలో నైనా సినిమాకళ వర్ధిల్లుతున్నది. ఆ దేశాలలో సినిమాకళ ఏమి సాధిస్తున్నదో తెలుసుకున్నట్టయితే మన దేశంలో కూడా పరిస్థితులు అనుకూలించే పక్షాన, సినిమాకళను ఏ పద్ధతిలో పెంపొందించుకో వచ్చునో, దానిద్వారా ఎటువంటి ఆశయాలు సాధించవచ్చునో తెలుస్తుంది.

"యునైటెడ్ నేషన్స్ వరల్డ్" మార్చి సంచికలో *Tibor Koeves* అనే ఆయన యుద్ధానంతరం వెలువడిన యూరప్ చిత్రాలను సమీక్షించుతూ ఇటలీ, గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్సులనుంచి కొన్ని గొప్పచిత్రాలు వెలువడ్డాయనీ, ఆదేశాల ఉత్తమ చిత్రాలలో వినోదంతోబాటు వర్తమాన జీవితం మీద సునిశితమైనవిమర్శకూడా ఉన్నదనీ, ఈ విషయంలో సినిమాచిత్రాలు ఇతర కళాసాధనాలకన్న చాలా ఉత్తమంగా పనిచేశాయనీ అన్నాడు. అందులో ఆశ్చర్యం ఏమీలేదు. ఎందుకంటే కళా సాధనంగా చిత్రాన్ని మించినది ఈ నాడు లేదు - చిత్రనిర్మాతలు వినియోగించుకుంటే.

ఈ విమర్శకుడు ఈ కిందివిషయాలను తెలిపాడు:

పశ్చిమ యూరప్‌లో తయారయే చిత్రాలలో చాలా భాగం తుక్కు. కాని వాటిలో సుమారు ఒకడజను చిత్రాలు అత్యుత్తమ హాలీవుడ్ చిత్రాలకన్న ఎక్కువవినోదం ఇవ్వడంతో బాటు ప్రేక్షకుల భావనాశక్తినీ, బుద్ధి బలాన్నీ చైతన్యవంతం చెయ్యజాలి ఉంటున్నాయి. చిత్తశుద్ధితోనూ, అన్వేషణాశక్తితోనూ కూడుకుని, దేశం యొక్క ఆధ్యాత్మిక వాతావరణాన్ని సమగ్రంగా దర్శించే చిత్రాలను అప్పుడప్పుడు చిత్ర నిర్మాతలు తీయగలుగుతున్నారు.

"ఓపెన్ సిటీ," "పైసాన్," "షూషైన్" "శాంతి యుత జీవనానికి," "బైసికిల్ దొంగ," "చేదు బియ్యం" అన్న ఇటలీ చిత్రాలు ఈ తరగతివి. ఈచిత్రాలలో ఇటలీ దౌర్భాగ్యం ఇమిడి ఉన్నది. ఇటలీ ప్రజల కష్టాలూ, నైతిక పతనమూ యథాతథంగా, బలంగా ప్రతిబింబిస్తున్నాయి ఈచిత్రాలు. ఇటలీ ప్రజల దైనిక కష్టాలూ, వాటివల్ల ఏర్పడే మనః ప్రవృత్తీ, జాతీయ ఓటమీ, విధ్వంసమూ, ఆకలీ, విదేశీయుల ఆక్రమణా ఈచిత్రాలలో ప్రతిబింబిస్తున్నది.

ఈ చిత్రాలలోని ప్రత్యేకత ఏమిటంటే పాత్రలలో ఆంతరంగిక సంఘర్షణలు లేవు. ఇతివృత్తాలలో గొప్ప సన్నివేశాలు లేవు, పతనమైన మానవుల ప్రాకృత స్వభావ చేష్టలే చిత్రించబడ్డాయి.

"మేము జయించబడ్డాం గాని మంచి వాళ్లం. మాకొడుకులు దొంగలు. మాకుతెలు లిప్‌స్టిక్‌కోసమూ, తిండికోసమూ శరీరాలమ్ముకుంటున్నారు. చలితోనూ, బట్టలు లేకా బాధపడుతున్నాం. మాకు కావలసిందల్లా మనగలగటమే." అని ఈ చిత్రాలంటున్నాయి.

ఇటలీ చిత్రనిర్మాతలలో గొప్ప కళాకారులైనవారు ఒకరిపై తప్పు వేయరు, వ్యాఖ్యానాలు చెయ్యరు. తత్వోపదేశాలు చేయరు. జీవితంమీద వ్యాఖ్యానాలు చేయటంకంటె జీవితాన్ని నగ్నంగా చూపటమే కొన్ని పరిస్థితులలో ఎక్కువ ప్రయోజనకరమని వారు గుర్తించినట్లు కనిపిస్తారు. "బైసికిల్ దొంగ," "చేదుబియ్యం" లాంటి చిత్రాలలో చూపిన సాహసోపేతమైన నగ్నసత్యం అపూర్వమైనది.

"బైసికిల్ దొంగ" అన్న చిత్రంలో ప్రధానాంశం దొంగతనం. యుద్ధానంతర ఇటలీపై ఇదే ఒక వ్యాఖ్యానం. ఈచిత్రంలో పోస్టర్లు అంటించేవాడి సైకిల్ ఎవరో దొంగిలిస్తారు. ఈ దొంగతనం మూలంగా వాడిదైనికజీవితం తారుమారవుతుంది. పోలీసులకు రిపోర్టిస్తే వాళ్లేమీ చెయ్యలేకపోతారు. తప్పనిసరి అయి తాను మరొకడి సైకిల్ దొంగిలిస్తాడు. కాని తాను దొంగ కాడు, దొంగిలించటం తనకు అలవాటు లేదు.

పట్టుబడతాడు. నలుగురూ చేరి చావ చితక గొట్టేస్తారు. ఈ వ్యక్తి నేరం చేసి జీవించలేడు, చెయ్యకా జీవించలేడు.

ఇటువంటి ఇతివృత్తాలలో "ఘాటు" సాధించటానికై ఇటలీలోని డైరెక్టర్లు కొత్తశిల్పం కనిపెట్టారు. కామెరాను డాక్యుమెంటరీకి ఉపయోగించినట్లు ఉపయోగించటమూ, పాత్రలను తరగతుల కింద విభజించక వ్యక్తిత్వాన్ని కాపాడటమూ ఈ శిల్పంలో ప్రధానవిషయాలు. అందుచేతనే ఏతారనో మనసులో ఉంచుకుని స్క్రిప్టురాయటమనేది లేదు. నటనకు అంతే ప్రాముఖ్యం లేదు. క్లోజప్‌లూ, నటుడి హావభావ ప్రదర్శనలూ చాలా క్లుప్తంగా ఉంటాయి. రోసెలీనీలాంటి డైరెక్టర్లు బొత్తిగా కొత్తనటులను తెచ్చి ఉపయోగించుకుంటున్నారు. మేకప్ కూడా చాలా తక్కువగా ఉంటుంది. నటులను అందంగా చెయ్యటం మేకప్ యొక్క ఉద్దేశం కానే కాదు.

ఇటలీచిత్రాలతో పోలిస్తే ఫ్రెంచి చిత్రాలు చాలా పాతకాలపు ధోరణిలో ఉన్నాయి. ఈ కాలపు విప్లవ ప్రూరితి వాతావరణం ఆ చిత్రాలలో ప్రతిబింబించటం లేదు. రెండవ ప్రపంచ యుద్ధం, జర్మనుల ఆక్రమణా, ప్రతిఘటనోద్యమం, యుద్ధంవల్ల కలిగిన దుష్ఫలితాలూ ఫ్రెంచి చిత్రాలకు తెలియనే తెలియవా అనిపిస్తుంది. 1940–50 మధ్య జరిగిన సంఘటనలను గురించి ఒక నిర్ణయానికి రావటానికి ఫ్రెంచి ప్రజలు చూపుతున్న తటపటాయింపుకు ఫలితమే ఫ్రెంచి చిత్రాలలో ధైర్యమూ, వాస్తవికతా లోపించటానికి కారణం. ఫ్రెంచి రచయితలూ, డైరెక్టర్లూ కూడా వర్తమాన జీవితసమస్యలను వదలిపెట్టి గతచరిత్రనూ, అప్పటి సుఖమయ అవివాదాస్పద జీవితాన్నీ ఆశ్రయించారు. ఈ విషయంలో ఫ్రెంచి చిత్రాలు ఫ్రెంచి ప్రజల మనస్తత్వాన్ని సూటిగా ప్రతిబింబిస్తున్నాయి.


దీక్షగా సినిమాలు చూసేవారిలో బ్రిటిషువారు అగ్రగణ్యులు. గ్రేట్ బ్రిటన్, ఉత్తర ఐర్లాండులు కలిపి వారానికి 3 న్నర కోట్లమంది సినిమాలు చూస్తారు. (ప్రపంచమంతా కలిసి వారానికి 23 న్నర కోట్లమంది సినిమాలు చూస్తారు.) 1940 తరువాత సినిమాలు చూసే బ్రిటిషు ప్రజలసంఖ్య ఒకటిన్నర రెట్లు పెరిగింది.

బ్రిటిషువారు తమ నిత్యజీవితపు బాధను మరవటానికి సినిమాలు చూసేటట్టు కనిపిస్తుంది.

(29-వ పేజీ చూడుడు)



ప్రకాష్ పిక్చర్స్ వారి "దీక్ష"లో కథానాయకుడు జమీందారు కొడుకుకు బుద్ధిచెబుతుంటే "రామదండు" హర్షిస్తున్నారు.



"బాబుల్" చిత్రంలో

★ మునవ్వార్ సుల్తానా

నే నెవణ్ణి

(15-వ పేజీ తరువాయి)

తీరతాము. కొందరిని గుర్తించినట్లు కనపడతాము. కాని, మరికొందరు తామూకూడా ప్రపంచంలో నే ఉన్నట్లు పదేపదే చెప్పకుంటూ బాధించకపోతే ఇతరులు ఎవరూ గుర్తించలేరు. నేనుకూడా అలాంటి వర్గానికి చెందినట్లు నాకు చాలకాలంగా భయం ఉంది.

ఇంతకీ కమ్యూనిస్టుల విషయంలో నాకైతే అభిప్రాయాలు లేకపోలేదు. కాని, వాటికి ఒకనిర్దుష్టమైన స్వరూపం అంటూ ఏమీ లేదు. నేను కమ్యూనిస్టునా? నా సిద్ధాంతాలు ఏమిటి? అని నిత్యమూ తర్కించుకుంటూ ఒక నిర్ణయానికి రాలేక, వచ్చినా గుర్తించడానికి దమ్ములు లేక అయోమయ అగమ్యస్థితిలో పొరాడుతున్న నేను ఇదమిత్థ మని నా అభిప్రాయాలను మరొకరికి ఎలా వివరించి చెప్పగలను?

అయినా, ఆ వ్యక్తి కమ్యూనిజమ్ అన్నా, కమ్యూనిస్టులన్నా, సోవియట్ సాహిత్యం అన్నా తగని శ్రద్ధ చూపుతున్నాడు. కనుక ఇదేదో తేల్చుకోవడం మంచి దనుకున్నాను.

అదే అభిప్రాయంతో "కమ్యూనిస్టులంటే ఎవరూ? మానవుని పరిస్థితి చక్కపడాలనీ, ఒక మానవుడు మరొక మానవుని భక్షించకుండా ఉండే రకమైన సామాజికవ్యవస్థ ఏర్పడాలనీ మనం అంతా కోరుకోనడం లేదూ? అంతవరకు మీరు, నేనుకూడా కమ్యూనిస్టులమే ఏమో?" అన్నాను.

ఆవ్యక్తి ఆకస్మికంగా లేచి నిలబడ్డాడు. నాదగ్గరికి వచ్చాడు. నా బల్లమీదనే అంతవరకు మౌనంగా కూర్చున్న అతని అనుయాయి, అగస్త్యభ్రాత సదృశుడు నా దగ్గరగా జరిగాడు.

రాకడ చూచాను. అయినా ఇంకా కొంత మసకమసకగానే ఉంది. జేబులోంచి సిగరెట్టుపెట్టె తీసి అందించాను. అక్కర్లేదన్నాడు. సిగరెట్టుతీసి ముట్టించాను.

ఆ వ్యక్తి నా ముఖందగ్గర తన ముఖం పెట్టి తగ్గుస్థాయిలో "మీరు నల్లగొండ, సూర్యాపేట ఎప్పుడైనా వెళ్లారా" అని ప్రశ్నించాడు.

అప్పటికి కొంచెం అర్థమయింది. ఇది పోలీసువారికి సంబంధించిన అపరాధ పరిశోధన పద్ధతి కావచ్చు అనుకున్నాను. ఆంధ్రుడు. చేతిలో సోవియెట్ పుస్తకాలు. నీరసంగా, ఎర్రటికళ్లతో ఉన్నాడు యువకుడు. చదువుకున్నవాడిలా ఉన్నాడు. ఇక కమ్యూనిస్టు కాడని ఎలా అనుకోవడం? జీతాలు పుచ్చుకుంటూ ఊరికే కూర్చోపెడం న్యాయంకాదు. కమ్యూనిస్టే అయితే సరేసరి-బహుమానం ప్రమోషన్ కూడా లభించవచ్చు. కాదా, నిర్భాగ్యుడు ఎవరైనా వారికి అవసరంలేదు.

"వెళ్ళలే" దన్నాను సూటిగా చూస్తూ. నిజానికి నల్లగొండ, సూర్యాపేట వెళ్ళలేదు కాని, హైదరాబాదులో అయిదేళ్లు గడిపాను.

"మీరు పార్టీలో సభ్యులా? చెప్పండి సార్, పరవాలేదు" అంటూ, స్వరం మరికొంత తగ్గించి "నేనూ, ఆయనా (నాపక్క కూర్చున్న మహానీయుడు) కూడా పార్టీలో సభ్యులమే" అన్నాడు.

ఇంకేమి? సరిపోయింది. పోలీసులు తప్ప ఇంత చాకచక్యం ప్రదర్శించేవారు మరొకరు ఉండరు.

"కా"దన్నాను.

"చెప్పండి సార్, మనమంతా ఒకటే," అని ధైర్యం చెప్పాడు.

ఇంక ఈ వ్యవహారం ఇంతటితో ముగించడం మంచిదనుకున్నాను.

"మీతో రెండుమాటలు చెబుతాను వినండి. మొదటిది నేను గత మూడేళ్లుగా మద్రాసులో ఉంటున్నాను. పత్రికారచయితగా పొట్టపోసుకుంటున్నాను. ప్రస్తుతం - పత్రికలో పనిచేస్తున్నాను.

"ఇక రెండవది. నాకు ఏ పార్టీతోను సంబంధం లేదు. పార్టీతో సంబంధం ఉండి, నిజంగా అండర్ గ్రౌండ్‌లో ఉన్న ఏకమ్యూనిస్టుకాని తాను కమ్యూనిస్టుననీ, నల్లగొండ, సూర్యాపేటలనుంచి వచ్చాననీ మీతోకాని, మరెవరితోకాని చెప్పడు. ఇంతకీ-మీరు ఎవరో, ఎక్కడ ఉంటున్నారో, ఏమి చేస్తున్నారో చెప్పారుకారు. చెబుతారా?" అని అడిగాను కొంచెం కటువుగా.

"మీరు సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారా, సార్?" అని కొంచెం తెల్లబోతూ ప్రశ్నించాడా వ్యక్తి.

"అవును-పత్రికలో. మీరు పోలీసులేనా? మీ స్టేషన్ ఎక్కడ? నేను కూడా వస్తాను. మీ ఆఫీసర్ ఎవరైనా ఉంటే ఒక్కసారి మాట్లాడతాను" అన్నాను.

ఆ ఇద్దరు వెంటవెంటనే ముఖాలు చూసుకున్నారు.

ఆ వ్యక్తి కొంచెం కంగారుపడ్డాడు. "అబ్బే మేము పోలీసులం కాము. మీ విషయంలో కొంచెం పొరపడ్డాం. క్షమించండి సార్" అంటూ మెల్లిదిగా వెనక్కు తగ్గి "పోదామా" అని నా పక్క ఆసామీని తమిళంలో హెచ్చరించాడు.

ఆ ఇరువురు ఇక నా మాట లేవీ వినకుండా స్టేషన్ దాటి బయటికి వెళ్ళిపోయారు.

సరిగా సమ్మంలో వారికి ఎదురుగా వస్తున్న ఒక రైల్వే ఉద్యోగి "గుడ్ నైట్, ఇన్‌స్పెక్టర్" అని సంబోధించడము, ఆ అపరిచిత వ్యక్తి "గుడ్ నైట్" అని బదులు చెప్పడము విన్నాను.

అంతలో బెంగుళూరు పాసెంజరు వస్తూన్న సవ్వడి అయింది. ఆ ఇరువురు పోలీసులాటీవద్దకే వెడతారో లేదో చూచే భాగ్యం లేకుండా రైలుదగ్గరికి పరుగెత్తుకుని వెళ్ళాను.

ఇంతకీ నే నెవణ్ణి???

★

కాలం మండిపోతోంది

(12-వ పేజీ తరువాయి)

రంటే కాళ్లువిరక్కొడతాను. తెలిసిందా?"

సీతారామయ్యగారు శారదని మళ్లీపిలిపించి యిల్లా అన్నారు "ఏమే, ఇతనితో ఈ రాత్రి లేచిపోతావా లేక నన్ను గొంతు కోసెయ్యమంటావా? ఏదోటి చెప్పవంటనే."

శారద మొహం పమిటలో మూసుకుని రాయిలా తల్లి వెనకాలనుంచుంది.

"ఆసిమిమ్మల్ని తగలెయ్య, ఎంతరగడు దేలిపోయారే? అబ్బాయి, నువ్వు ఈరాత్రి దీంతో లేచిపోకపోతే, రేపొద్దున్న దీన్ని గొంతునించి గొంతేస్తాను. ఇటువంటి కూతుళ్లుంటే అప్రతిష్ఠతప్ప ఏమీ లేదు. తెలిసిందా. నువ్వింక దయచెయ్యి."

"మాశారా. అంతా మనమేలుకే వచ్చిందనుకోమన్నారు. కమలగోరు లేచి పోమట్టే శారదగారికి కూడా కానీఖర్చు లేకుండా మొగుడు దొరికేడు గిందా?" అనా. పాలు పితకడానికి వచ్చిన గొల్లవెకన్న.

"ఏడిశావ్ నోరుముయ్యి" అని, సీతారామయ్యగారు స్నానానికి లేచారు.

సరసమ్మగారు వంటింట్లో వంటమాని ఏడుపు లంకించుకుంది.

"ఎందుకూ ఇప్పుడీ ఏడుపులూ పెడబొబ్బలూ? ఎవర్ని వుద్ధరించను? నేనింక ఆట్టే కాలం బ్రతికి చావనులే" అంటూ సీతారామయ్యగారు చేదెడునీళ్లు తలమీద్న పోసుకున్నారు.

★

పల్లెపట్టులు

(18-వ పేజీ తరువాయి)

అలాగే కాగితాలు వ్రాసి రిజిస్టరు చేసుకున్నది మొదలు వెంకట్రామయ్య మాత్రం "అమ్మయ్య!" అనుకున్నాడు కాని శివయ్య మాత్రం అనుకోలేకపోయాడు. అతిప్రమాదకరమైన పనిచేసినట్టు... ఏదో తెలీని భయం అతన్ని పట్టుకు పీడించింది. ఒంట్లో ఉన్న సత్తువ దిగజారిపోయినట్టు, కాళ్ళు నేలకు అంటుకుపోతున్నట్లు, అనిపించి కూర్చున్న చోటనే కూర్చుండిపోవటం- ఇలా ఆ రోజంతా పరధ్యాన్నంగానే ఉన్నాడు.

కొడుకు పడుతున్న మనోవ్యాధ నేమీ గమనించని వియ్యమ్మ సాయంత్రం శివయ్య ఇంటికి రాగానే "పాదుగుకొచ్చి పాలు తాగుదామన్న ఈ దుర్బుద్ధినీకే పుట్టిందా? వరన్నా చెప్పి పెట్టాడ్తా! నాకడుపులో చిచ్చు పెట్టావురా! కడుపు మాడి నేను కాస్త హరీ మంటేనేకాని అసలు ఈ ఇంటికి పట్టిన శని విరగడైపోదు... కానీలే ఇదెందు కొచ్చిందో!..." ఇలా ఎడతెరిపి లేకండా సాధించిపొయ్యటం మొదలుపెట్టింది.

శివయ్యకు విచక్షణాజ్ఞానం నశించింది. "చస్తే చావు! పీడ వదుల్తుంది" అంటూ తను అప్పుడే మంచినీళ్ళు తాగి కిందపెట్టిన గుండుచెంబు ఎత్తి వియ్యమ్మపైకి విసిరాడు. వియ్యమ్మ రెక్కగూటికి బలమైన గాయం తగిలి కెవ్వుమని ఏడుస్తూ కింద పడిపోయింది. వంటింట్లోనుంచి భార్య పరుగెత్తుకొచ్చింది ఇంతలో చుట్టుపక్కలవాళ్ళు నలుగురూ పోగయ్యారు.

నలుగురూ నానామాటలూ అంటూంటే శివయ్య ఎలాగో అక్కడినుంచి బయట పడ్డాడు. రాత్రి భోజనానికి కూడా ఇంటికి వెళ్ళలేదు.

ఊరుబయట గొడ్లపాకలో పడుకున్నాడు. తల్లిమీదికి చెంబు విసిరిన మరుక్షణంనుంచి తనమీద తనకే పరమ అసహ్యం వేసింది. చుట్టూచేరిన పంచాయతి దారులందరికీ తన మనసును గ్రహించగల శక్తి లేదని తనకి తెలుసు.

ఎంత ప్రయత్నించినా కంటిమీదికి కునుకు రావటంలేదు శివయ్యకు.

ఆరోజున తను చెయ్యరాని అపచారం చేశానని పరిపరివిధాల పశ్చాత్తాప పడ్డాడు. తల్లి స్వభావం తెలిసుండికూడా తొందర పడకండా ఉండలేకపోయానని తన్ని తాను నిందించుకున్నాడు. ఈ అప్పంతా తను చేసిందికాదే... ఉన్నఅప్పు ఏకాడికైనా తెగటార్చుకోవలసిన అవసరం ఆవిడకి మాత్రం తెలీమా? గంగిగోవులాంటి భూమి మీద ఉన్న మమతకొద్దీ అలా అంటోంది కాని... అమ్మటానికి ఇలా అంజాయించబట్టే వడ్డీలకి వడ్డీలు పెరిగి అప్పు ఇంతై కూర్చుంది!

శివయ్యకు తను అమ్మిన భూమివిషయం మర్చిపోవటం దుర్లభమైంది. ఇకనుంచీ ఆ భూమి తనది కాదన్న విషయం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కన్నతల్లిని ఖూనీచేసినంత దిగులు, భయమూ వేసేవి. ఏ పనీ చెయ్య బుద్ధి పుట్టేదికాదు.

అనుకోకుండానే రోజుకి ఒకసారన్నా పొలంవైపు వెళ్ళి చూసి వస్తూఉండేవాడు. తలుక్షణాల్లో ఉన్న సమయం కనిపెట్టి తొక్కిపట్టి వెంకట్రామయ్య ఆ పొలం తన చేత రాయించుకున్నాడనిపించేది. వెంకట్రామయ్యంటే పట్టరాని అసహ్యం ప్రారంభమైంది శివయ్యలో.

రామకోటయ్య తనపొలం ఎకరం మూడు వేల మూడువందలచొప్పున అమ్మగా లేంది, వెంకట్రామయ్య తన పొలం ఎకరం రెండువేల ఎనిమిదివందలచొప్పున కొన్నాడంటే ఆయనచాకచక్యంగాకపోతే మరేమిటి? బ్రహ్మప్రళయంమీద వప్పుకున్న ఆ రెండువేల ఎనిమిదివందలధరైనా ఎకరం పదిహేను వందలచొప్పున రాసుకోవటంవల్ల స్టాంపుడ్యూటీలో కలిసొచ్చిన డబ్బు తప్పితే ఆయన ఎక్కువ పెట్టిన ధర ఏముంది?

ఊళ్లో అందరికంటె ముందు నాగలి కట్టి శివయ్య నారుమళ్ళకు ఆ పొలందున్ని వచ్చాడు! ఈ విషయం ఊరంతా అగుబ్బుగా చెప్పుకున్నారు. మర్నాడు వెంకట్రామయ్య తన నలుగురు కమతగాళ్ళను వెంటబెట్టుకుని చేనుదగ్గిరికి వెళ్లేసరికి శివయ్య చేలో ఉన్నాడు. శివయ్య తనకు అంగబలంగా గూడెంనుంచి తెచ్చిన ఐదుమందీ వెంకట్రామయ్య రావటం చూసి చల్లగా ముఖం తప్పించారు. వెంకట్రామయ్య మర్యాదగా "చేలోనుంచి అవతలికి వెళ్లు!" అని రెండుమూడుసార్లు చెప్పాడుశివయ్యకి.

శివయ్యమాత్రం కదలకండా "ఈ పొలం నాది!" అనటం మొదలుపెట్టాడు.

శివయ్య అంత మొండి సమాధానం చెప్తుంటే వెంకట్రామయ్యకు రక్తనాళాలు బ్రద్దలౌతున్నట్లనిపించింది. ఎలాగో సంబాళించుకుని "సిగ్గులేదూ ఆమాట అనటానికి?" అన్నాడు.

"సిగ్గుంటే ఎకరం పదిహేనువందల చొప్పున తేరగా కొందామనుకోవు ఈ రోజుల్లో..." అన్నాడు శివయ్య మొరాయిస్తూ.

అశనిపాతంలాంటి ఈ మాటల్తో వెంకట్రామయ్య తన్ని తాను తట్టుకోలేక పోయాడు. చేతికర్ర ఎత్తి శివయ్యతలపైన బలంగా కొట్టాడు.

శివయ్య కొద్ది క్షణాలకి తెప్పరిల్లి, మొండివాడు గనక, ఊళ్లోకన్నా వెళ్ళకండా అటునుంచి అటే బందరు బయలుదేరాడు దావా ఇవ్వటానికి వెంకట్రామయ్య మీద.

మధ్యాహ్నం భోజనాలయాక వెంకట్రామయ్య కరణం గుర్నాధాన్ని వెంటబెట్టుకుని బందరు వచ్చి ప్లీడరుసలహా తీసుకుని తను కొన్నపొలం శివయ్య, అన్యాయంగా ఆక్రమించుకుంటున్నాడని సమన్లు జారీచేయించాడు.

ఈ విషయం తెలిసినవెంటనే శివయ్య మరోకసారి బందరుపోయి ప్లీడర్ని విచారించి తను మతిస్థిమితం లేనివాణ్ణనీ, అందువల్ల తనను మోసపుచ్చి ... ఎకరం మూడువేల మూడువందల ధర ఉంటుండగా, పదిహేను వందల చొప్పున తన చేత రాయించుకున్నాడు వెంకట్రామయ్యఅనీ తన మైనరు కొడుకులచేత వాజ్యం వేయించాడు.

* * *

వియ్యమ్మ రెక్కగూటిమీది పుండు నయమై కొడుకును వెనకేసుకొచ్చి వెంకట్రామయ్యగారి కుటుంబాన్ని తన సహజ ధోరణిలో ఫెళఫెళా తిడుతూనే వుంది.

అసలువిషయం - ఈ వ్యవహారంలో గుర్నాధంగారి శీలాన్ని శంకించనివాడు ఆ ఊళ్లోనే లేడు.

మిగతా విషయాలు బందరు కోర్టులో!

★

అంతా ఘటన

(22-వ పేజీ తరువాయి)

జరిగినై. కార్యకరాదుల్లో అనుకోకుండానే ఏవో లోపాలు దొర్లుతూవుంటయ్. అటువంటప్పుడు రామయ్య ఒకసారి స్వయంగా వచ్చి "కామయ్య బావగారూ ఏదో తప్పు చేశాను, చెంపలు వాయించుకుంటున్నాను" అంటే సరిపోయేది. తలపొగరు వేషాలు. పిల్లని మళ్లీ చదువులో చేర్పిస్తాడా? ఎన్ని గుండెలో! ఇంక వాడికీ నాకూ సంబంధం ఫట్ ఫట్ అనుకున్నాడు కామయ్యగారు.

ఇప్పటికి పెళ్లి జరిగి రెండేళ్లు నిండినయ్. ఇంతవరకూ పెళ్లికొడుకువాళ్ల దగ్గర నుంచి కబురైనా లేదు. వాళ్లు రారు. కమలని పంపమని అడగరు. తీసికెళ్లరు. అడిగారు కదా అని మనుగుడుపులకి పంపితే నానామాటలూ పెట్టి ఒక్కత్తెనీ దిక్కులేనిదానిలాగా ఇంటికి పంపారు. ఈ అవమానాన్ని రామయ్యగారు ఎన్నటికీ మరవరు, ఎన్నటికీ మన్నించరు, దెబ్బతిన్న తాచులాగా ఆయన అభిమానం బుసకొడుతోంది. వాళ్లగడప తను ఎందుకు తొక్కాలి? వచ్చి తీసికెళ్లనప్పుడు తనకి బరువైనట్లుగా కమలని తను వాళ్ల ఇంటికి ఎందుకు తీసుకుపోయి దింపాలి? తనకి కొడుకుల్లేరు. కమలే తనకి కొడుకూ కూతురూను. అందుకని కమలని కాలేజిలో చేర్పించి ఉన్నతవిద్యకి తగిన అవకాశాలన్నీ కల్పించాడు రామయ్య. కమలకి కూడా పుస్తకంతప్ప ఇంకో ప్రపంచమే అక్కర్లేదు. క్షణంకూడా విరామం లేకుండా ప్రతి పరీక్షలోనూ విశేషగౌరవాలని పొందుతూ ప్రథమశ్రేణిని అందుకుంటోంది. తన కళ్యాణజీవనంలోని దురదృష్ట ఘట్టాన్ని అందువల్లకలిగే దుఃఖాన్ని కమల తన చదువులో పూర్తిగా మరిచిపోగలుగుతోంది!

కాని కమలముఖం ఎప్పుడూ వయస్సుకి మించినంత గంభీరంగా వుండేది. ఏదో మబ్బు ఆమెముఖాన అలుముకున్నట్లనిపించేది. క్లాసులోవాళ్లందరికీ కమల అంటే అమితమైన గౌరవం వుండేది. కాని కమల ఎవరితోనూ సరదాగా వుండేదు. నవ్వుతూ మాట్లాడేదు. ఎప్పుడూ ఏదో కొండంత బరువు కింద అణగారుతున్నట్లుగా వుండేది. హాస్టల్లో కమలకి; ప్రాణస్నేహితురాలు ఆమె రూమ్‌మేట్ విమల. ఇద్దరికీ ఇంచుమించు ఒకేవయస్సు. కాని కమల కొంచెం చామనచాయగా పొట్టిగా బొద్దుగా వుంటుంది. విమల మేలిమి బంగారంలాగా మిసమిసలాడుతూ పాదరసంలాగా తూనీగలాగా యౌవన లావణ్యంతో తొణికిసలాడుతూ చిరునవ్వులు విరజిమ్ముతూ వుండేది. సన్నగా పొడుగ్గా మెరుపుతీగలాగా వుండేది. తెలివితేటలకీ అందానికీ ఎందుకో విరోధం! విమల క్లాసులో చివర, కమల క్లాసులో మొదట!

తన జీవితగాథని కమల ఎన్నడూ విమలకి చెప్పలేదు. ఎంత బాధనైనా హృదంతరంలో మౌనంగా ఇముడ్చుకోగల శక్తి కమల చిన్నప్పటినించీ వుంది. అందుకే ఎవరితోనూ తననిగురించి చెప్పుకోదు. విమలకి ఎన్నోసార్లు కమల అలాగా వుండటానికి కారణం అడగాలనిపించేది. కాని కమలదగ్గర విమలకి ఎంత చనువో అంత భయం! అడగలేకపోయేది. కాని కమలజీవితంలో ఏదో కారుమబ్బు వుందని మటుకు అందరిలాగా విమల కూడా గ్రహించింది.

పరీక్షల్లో కమల తాపీగా తొమ్మిది గంటలకే పడుకునేది. విమల ఆందోళనతోనూ హడావిడితోనూ టీ తాగి తెల్లవార్లు మేలుకొని తల దిమ్మెక్కి ఇదివరకు చదివింది కూడా మరిచిపోయి ఖంగారుపడేది. తొణకనినిండుకుండలాగా కమల పేపరు రాసి వచ్చేది. బాగానే రాశాను అని మామూలుగా అనేది. తగలేశానోయ్ లాభం లేదు అని విమల గదిఅంతా గంతులువేసేది. చివరికి కమల పరీక్షలో మొదటి తరగతిలో ప్యాసయింది. కమల రూమ్‌మేట్‌గా వున్నందుకు విమలకూడా ఎల్లాగో తప్పకుండా పరీక్ష నెట్టేసింది.

పరీక్షలు అయిపోగానే ఎవరి వూళ్లకి వాళ్లు వెళ్ళిపోయేటప్పుడు విమల కన్నీళ్లతో అడిగింది "మళ్ళీ ఎప్పటికైనా కలుసుకునే అదృష్టం వుందా? నీలాంటి మనిషిని ఎక్కడ చూస్తాను? నువ్వు నాకు గురువువి"

"అదేమిటి? అల్లా గంటావు? నువ్వు బి. ఏ. చదవ్వా?" అని అడిగింది కమల.

"ఏమో నమ్మకం లేదు. మా మామయ్య ఏమంటాడో" అని విమల కళ్లు తుడుచుకుంది.

"నేను జ్ఞాపకముంటానా మీ వూరెళ్లాక?" అని నవ్వుతూ అడిగింది కమల.

"నిన్నా? నిన్ను వెయ్యిజన్మలకూడా మరిచిపోలేను కమలా" అంటూ రైలెక్కింది విమల. రైలుకదిలిపోయింది. అడ్రెసు అడగకపోతినే అని ఇద్దరూ నాలుకలు కొరుక్కున్నారు. కాని ఏం లాభం? క్షణంలో విడిపోతున్న మిత్రులిద్దరిమధ్యా దాటలేని అఖాతం మోతలు పెట్టింది.

3

పొగరుబోతు ఆబోతులు రెండు ఢీకొని కుమ్ముకుంటుంటే వాటిమధ్య పడి హూనాహూనమైపోయే లేగదూడలాగా వుంది కమలజీవితం. రోజులు గడుస్తున్నకొద్దీ ఆమె జీవితంలో కారుమబ్బులు దట్టంగా కమ్ముకుపోతున్నయ్. సహజంగా కమలకి మొండి ధైర్యం మెండు. కాని పరిస్థితులు ముదిరిపోతున్నకొద్దీ ఆమెలో దిగులు జొరబడి మనిషిని కుంగదీసేస్తోంది. మౌనంగా లోలోపల కుమిలిపోవటంవల్ల కమలముఖంలో వయసుకి మించిన ముదిమి కనిపిస్తోంది.

ఏళ్లువచ్చినా దామోదరానికి వ్యక్తిత్వం రాలేదు. అతను ఎవరు ఎటు ఆడిస్తే అటు ఆడే కీలుబొమ్మలాగా తయారైపోయాడు. రెండోపెళ్ళిసంగతి తల్లితండ్రీ గుసగుసలాడుకోటం చాలాసార్లు విన్నాడు. వినికూడా అతను చలించలేదు. కమలని కాపురానికి తీసుకురావాలనే చొరవే అతనికి లేదు. కమలంటే అతనికి అనురాగమూ లేదు, అసహ్యమూ లేదు. కాని పెళ్ళిముహూర్తంనాటి నుంచీ తమ ఇద్దరిమధ్యా ఎదిగిపోతున్న అడ్డుగోడలని దాటగల సామర్థ్యం అతనిలో లేశం కూడా లేదు. అర్థంలేనిస్పర్థలవల్ల తన జీవితం ఇంత నిస్సారంగా తయారైనా అతనిలో కదలిక లేదు. గట్టిగా తల్లిదండ్రులు ఇంకో పెళ్ళి చేసుకోమంటే కిక్కురు మనకుండా పీటలమీద కూర్చుంటాడు! వెన్నెముక అనేది మనిషికి పుట్టుకతోనే రావాలి కాని ఆ తరవాత ఎక్కణ్ణుంచి వస్తుంది?

కూతురు కాపరాన్ని చక్కబెట్టాలనే ప్రయత్నం రామయ్యకీ లేదు. కొడుకు జీవితాన్ని దారినపెడదామనే తాపత్రయం కామయ్యకీ లేదు. ఒకళ్లమీద ఒకళ్లకి గొంతుదాకా వుంది. ఈ గుర్రుతో బిర్రబిగుసుకుని కూచున్నారు. కాలంమాత్రం దొర్లుకుపోతోంది. పెళ్ళిజరిగి నాలుగేళ్లయినా ఈ ఇంటి కాకి ఆ ఇంటిమీద ఆ యింటి కాకి ఈ ఇంటిమీదమీద వాలటం లేదు!

లాకాలేజీలో చేరి దామోదరం బి. యల్. డిగ్రీ సంపాయించాడు. ఈ రెండేళ్లూ కమల ఇంటిదగ్గిరే వుండి తెలుగూ సంస్కృతమూ ఒక శాస్త్రులుగారిదగ్గర పాఠం చెప్పుకుని మంచి పాండిత్యం సంపాదించింది.

కూతురుకాపరం ఏదో ఒకవిధంగా కుదటపడేయ్యాలనే బాధ కమలతల్లిని

నిద్ర పోనివ్వటం లేదు. మొగుడు మొండి వాడు. అటు సూర్యుడిటు పొడిచినా ఆయన పట్టుదల విడవడు. వియ్యాలవారింటికి తను స్వయంగా వెళ్ళి సంధి చేసుకుందామంటే పంపడు. ఆమాట ఎత్తితేనే కరవొస్తాడు. ఏమీ తోచక చివరికి రామయ్యగారికి తెలియకుండా కమల మెడలువిరిచి ఒక వుత్తరం దామోదరానికి రాయించింది. ఈ ఉత్తరం వల్ల అన్నీ చక్కబడుతాయ్ అని ఆ వెర్రి ఇల్లాలు ఆశపడింది. కమల ముందు రాయటానికి తటపటాయించిది. కాని చివరికి ఆమెకి తెలియకుండానే ప్రతిఅక్షరంలోనూ ఆమె హృదయస్పందం వినిపించే దీనమైన లేఖ రాసి పోస్టుచేసింది. కారు రాయి అయినా ఆ ఉత్తరానికి కరిగిపోతుందని ఆశపడింది. తిరుగుటపాలో తన దురదృష్టానికి స్వస్తిచెప్పే శుభమైన సమాధానం వచ్చితీరుతుందని అనుకుంది.

కాని జాబుకోసం చూసిచూసి వేసారిపోయింది. రాజీకి తన ఆఖరి ప్రయత్నం కూడా విఫలమైనందుకు కమల తల్లి కుమిలిపోయింది. కమల దుఃఖంతోపాటు అభిమానంతో కూడా బాధపడుతోంది. భర్తకాళ్ల మీద తన తప్పేమీ లేకపోయినా సాష్టాంగపడింది. అయినా అతను తన్ని వేశాడని పించింది. ఇక తనకి దాంపత్య జీవితం అందని స్వర్గమని నిస్పృహతో కమల అనుకోటం మొదలుపెట్టింది.

అనుకోకుండా వొకనాడు కమలకి జాబు వచ్చింది. మామగారు కామయ్యగారు కోడలికి - రెండేరెండు పంక్తులురాశారు. ఆ రెండుపంక్తులలోనూ ఎంతో క్రోధాగ్ని కురిపించాడు. కమలకాపురం చక్కబడాలంటే ఒకటే చక్కటి రాజమార్గంవుందిట. అదేమిటంటే రామయ్యగారు క్షమించండి బావగారూ అని చెంపలు వేసుకుని, తన ఆస్తిని సత్వరమే అల్లుడిపేర రాసిఇస్తే కాపరం కుదటపడుతుందిట. ఉత్తరాన్ని చదివి కమల ముక్కలు చేసి పొయ్యిలో పారేసింది. తల్లి ఎక్కడినించే వుత్తరం అని అడిగితే ఎవరో స్నేహితురాలు రాసిందని చెప్పి అసలుసంగతి కప్పిపుచ్చింది. లోపలిమంటని పట్టలేక గదిలో ఒంటరిగా కూచుని తలుపులు వేసుకుని ఎంతోసేపు వెక్కి వెక్కి ఏడ్చింది. ఇంతకంటే అమానుషమైన షరతు లుంటయ్యా? ఇప్పుడే ఆస్తి అల్లుడిపేర పెట్టి రామయ్యగారూ పెళ్లాం ఉట్టి కట్టుకుని ఊరేగాలా? డబ్బుకీ· తన జీవితానికీ లంకెపడిందని కమల తెలుసుకోగానే కుంగిపోయింది. ఆ సంగతిని గురించి ఆలోచించటానికి కూడా అభిమానంగా వుంద. ఇంత నీచమైన మనుషు లున్నారా అనిపించింది. కమల గుండె రాయిచేసుకుంది. కుటుంబజీవనం తన చేతికందని స్వర్గంగా, దూరాన మెరిసే ఎండమావిలాగా గోచరించింది. ఇక ఆ ఎండమావిని వెంబడించి వేసారిపోవటం తప్ప వేరే లాభం లేదని గ్రహించింది. అందుకే ఏదో తెలియని విరక్తితో ఆమెమనసు నిండిపోయింది. ఇక తన దురదృష్టాన్ని గురించి వాపోవటంకూడా అనవసర మనిపించింది. ఈ అభాగ్యగాథని ఇంతటితో మరచిపోయి తన జీవితాన్ని ఇంకోదారిని నడిపించాలని కమల నిశ్చయించుకుంది. గతాన్ని విస్మృతిగుహలలో పాతేసి జీవితంలో ఇంకోదారి తొక్కాలని కమల మనస్సుని గట్టిచేసుకుంది. తల్లిదండ్రులని వొప్పించి కాలేజీలు తెరవగానే వెళ్లి మళ్లీ చదువుకోటం మొదలుపెట్టింది.

ఈసారి చదువుమీద కమలదృక్పథం వేరు. ఇదివరకు తన గతజీవితంలోని బాధని మరిచిపోవాలని చదివింది. ఇప్పుడు తను కూడా లోకంలో ఒకవ్యక్తిగా నిలబడాలని చదవటం సాగించింది. తన భావిజీవితానికి పాథేయంగా చదువుని భావించింది. తన నవజీవనానికి ఒక అవలంబనగా, ఉపాధిగా కమల చదువుని భావించింది.

ఎన్నెన్నో పుస్తకాలు తూర్ణంగా చదివింది. ఇది పరీక్షచదువు కాదు. జీవితమనే విషమపరీక్షలో నెగ్గేందుకు చదువు! అయోమయంగా వున్న భవిష్యత్తుతో పోరాడటానికి పూనుకున్న అబల కమల. ఆమె చేతులో ఈ విజ్ఞానమే ఒక ప్రబలమైన ఆయుధం! ★

(ఇంకా వుంది.)

గణించదగిన చిత్రాలు

(24-వ పేజీ తరువాయి)

ఇటీవల బ్రిటిషుచిత్రాల సంఖ్యా, వాటి నాణ్యమూకూడా బాగా పెరిగింది. "హామ్లెట్," "హెన్రీ ది ఫిఫ్త్," "పాస్పోర్ట్ "టు పిమ్లికో" "స్టెయిర్ వే టు హెవెన్" లాస్ట్ హాలీడే," "బ్రీఫ్ ఎన్‌కౌంటర్," "కైండ్ హార్ట్స్ అండ్ కారొనెట్స్," "ఇన్ హ్విచ్ వి యీ సెర్వ్," "దిలైఫ్ అండ్ డెత్ ఆఫ్ కర్నల్ బ్లింప్," "టానీ పిపిట్," "బ్లాక్ నార్సిసస్," మొదలైనవి అత్యుత్తమ చిత్రాలు. వీటన్నిటిలోనూ మంచి వినోదంతో బాటు బ్రిటిషుదనం కూడా ఉన్నది. వీటన్నిటిలోనూ కూడా జీవితం ఒక లీల అన్న భావమూ, కవితాచ్ఛాయలూ ఉన్నాయి. జీవితం ఒక ఆటలాటి దన్న భావం ఉండబట్టే బ్రిటిషువారు బాహ్య ప్రపంచపు తాకిడికి తట్టుకోగలుగుతున్నారు.

చిత్రనిర్మాణంలో గత పదేళ్లకాలంలో బ్రిటనులో కలిగిన మార్పే బ్రిటిషుచిత్రాలు బాగుపడడానికి కారణమయింది.

యుద్ధానికి పూర్వం బ్రిటనులో చిత్రనిర్మాణాని కవసరమైన ధనం పెద్ద డిస్ట్రిబ్యూటర్లనుండి లభిస్తూఉండేది. వారే చిత్రనిర్మాతలనూ, డైరెక్టర్లనూ శాసించేవారు. వీరు గల్లాపెట్టెను మాత్రమే ప్రమాణంగా పెట్టుకుని చిత్రం తీసే కథల మంచిచెడ్డలు నిర్ణయించేవారు. కళాకారులపై ధనికులకుండిన ఈ అధికారాన్ని భగ్నం చేసినవాడు ఫిలిపోడెల్ గియూడీస్ అనే ఇటాలియన్ చిత్రనిర్మాత. ఈయన నొయెల్ కవర్డ్‌తో కలిసి "ఇన్ హ్విచ్ వియ్‌సెర్వ్" అనే ఇంగ్లిషు చిత్రంతీశాడు. ఈ చిత్రం స్వతంత్రంగా తీసినది. ఇది ఆర్థిక, నైతిక విజయాలు రెండూ సాధించింది. అటుతరువాత ఈ చిత్రనిర్మాత "హామ్లెట్" మొదలైన అనేక చిత్రాలు, డబ్బు గడించినవి, తీశాడు. దీనిఫలితంగా ఆర్థర్ రాంక్ మొదలైన పెట్టుబడిదార్లు సినిమా కళాకారులకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వసాగారు.

ఈ ఇటాలియన్ చిత్రనిర్మాత డిస్ట్రిబ్యూషన్ విషయంలో కూడా ఒక విప్లవ పంథా తొక్కుతున్నాడు. కళాన్వితమైన చిత్రాలను చూపటానికి పెద్ద డిస్ట్రిబ్యూటర్లు - అంటే ఒకసారి అనేక థియేటర్లలో చిత్రాన్ని పెద్దపెట్టున విడుదలచేయగలవారు - ఒప్పుకోరు. ఇటువంటి చిత్రాలను ఒక్కొక్క థియేటర్లోనూ, నాటకంలోలాగా విడుదలచేయాలనీ, అట్లా చేసినట్లయితే చిత్రం ఒకేసారి అనేకథియేటర్లలో కొద్ది వారాలు నడవటానికి బదులు, ఒకే థియేటర్లో చాలా వారాలు నడుస్తుందనీ ఈయన అభిప్రాయం.

ఈ విధంగా ఇటాలియన్, ఫ్రెంచ్, బ్రిటిష్ చిత్రాలు తమతమ దేశాలలోని వాతావరణాన్ని సరిగా ప్రతిబింబిస్తూ సినిమాకళను ముందుకు నడుపుతున్నాయి. ★

★ అదీ-ఇదీ ★

నైతికపునరుజ్జీవనం

"మన (అమెరికన్) ప్రజల నైతికశక్తి సమస్య కేవలం దేశీయసమస్య కాదు. దీనివల్ల మన అంతర్జాతీయ సంబంధాలకు తీవ్రప్రమాదం కలగవచ్చు. తమ ప్రభుత్వంలో విశ్వాసం లేకపోయినట్లయితే మన ప్రజలు రష్యాను విజయవంతంగా ప్రతిఘటించడానికి అవసరమైన త్యాగాలు చేయరు. గత చరిత్రలో అనేక గొప్ప నాగరికతలు పైవాళ్ళ దురాక్రమణవల్ల కాక ఆంతరంగిక అవినీతివల్లనే పతనమైనట్లు టోయన్బీ తన చారిత్రక పరిశీలనలో రుజువు చేశాడు.

"భౌతికంగాగాని ఆర్థికంగాగాని కలిగిన విపత్తునుంచి ప్రజాస్వామికం సులువుగానే కోలుకోవచ్చు, కాని నైతికపతనం జరిగినట్లయితే దాంభికులూ, వదరుబోతులూ పైకి వచ్చేస్తారు. నిరంకుశత్వమూ, దమనవిధానమూ అప్పుడు స్వైరవిహారం చేస్తాయి."

(అని సెనెటర్ ఫుల్‌బ్రైట్ అన్నాడు)

ఫుల్‌బ్రైట్ చెప్పిన మాటలను వాషింగ్టన్ (అమెరికా రాజధాని) నుండి రోజూ వచ్చే వార్తలు రుజువుచేస్తూనే ఉన్నాయి. అమెరికనులు కొరియాలో యుద్ధం చేస్తున్నారు, చస్తున్నారు. కొరియాను మించినవి తలఎత్తకుండా ఉండగలందులకు దేశం (అమెరికా) తనకొరకూ, పశ్చిమయూరపు కొరకూ అస్త్రనిర్మాణం సాగించింది. ఇది చాలా ఖర్చుతో కూడిన పని, కష్టాలతో కూడినపని. ఇప్పటికే ద్రవ్యోల్బణం కలిగింది.

ఐక్యత సాధించడమూ, పనిసాగించడమూ అత్యవసరమన్నదాన్ని కాంగ్రెసులోగాని ప్రభుత్వంలోగాని ఎవరూ శంకించలేదు. కాని యథాతథ రాజకీయాలూ, పనికిమాలిన చర్చలూ ఎప్పటిలాగే ఉన్నాయి. ఒకఉదాహరణ: ద్రవ్యోల్బణం తగ్గించి ఆయుధాలు కొనడానికిగాను కొత్తపన్నుల చట్టం చెయ్యాలని అనేకమంది రిపబ్లికనులూ, డెమోక్రాట్లూ, ఇతరులూ అంగీకరించారు. కాని ఈచట్టం తయారుచేయడానికి ఎట్టి కృషీ జరగలేదు.

—న్యూస్ వీక్, ఏప్రిల్ 9 :

విమోచనకు దగ్గిరమార్గం—వధ

అధునాతన మారణాస్త్రాలతో కొరియాలో జరుగుతున్న అమానుష యుద్ధాన్ని అమెరికన్లు అసహ్యించుకొనేరోజు రావటానికింకా కొంత వ్యవధివుంది. జర్మన్లు జపానీయులు అనుసరించిన జనహత్యావిధానాలమూలాన, తరువాత రోజుల్లో స్వీయరక్షణకోసం మిత్రమండలివారు, ముఖ్యంగా అమెరికన్లు హిరోషిమా, నాగసాకీ నగరాలపై ప్రదర్శించిన విధ్వంసకవిధానాల మూలాన మన మనస్సులు పాషాణసదృశమైపోయి వున్నాయి. ఒకే పరిమిత స్థలంలో అసంఖ్యాకంగా బాంబులు కురిపించటం, మిలిటరీ, పారిశ్రామిక ప్రాధాన్యంగల స్థావరాలనే కాక ప్రజానీకాన్ని కూడా రూపుమాపటం మనకు చాలా మామూలువిషయమైపోయింది. కరుణ అనే అనుభూతిని అణచుకోవటంవల్లా, తప్పంతా శత్రువుమీదకు తోసివేయజూడటంవల్లా పాశ్చాత్యుల, ముఖ్యంగా అమెరికన్ల, మనస్సులపై మాయని మచ్చ ఏర్పడిపోయింది.........

కొరియాయుద్ధానికి సంబంధించిన వివరాలు ఇప్పుడిప్పుడే అమెరికన్‌పత్రికల్లోకి దిగుతున్నాయి. నేనిదివరకే ఈ విషయాన్నిగూర్చి వ్రాశాను. కాని కొరియా విధ్వంసగాథను బ్రిటిష్, ఫ్రెంచి పత్రికలు మాత్రమే ఎందుకంత నిర్మొహమాటంగా, వివరంగా ప్రకటిస్తున్నాయో అవగాహన కావటంలేదు. మనపైవున్న సెన్సారింగు వారిపైకూడా వున్నది; కాని సాధారణంగా అమెరికన్ విలేఖరులు కొరియన్‌పౌరులు పడే దుర్భర బాధలజోలికి అట్టే పోవటంలేదు......

కొరియన్ పునర్నిర్మాణానికై సమితిచే నియమింపబడిన ఏజెంట్ జనరల్ జె. డోనాల్డుకింగ్‌స్లే ఈమధ్య ఇలా వ్రాశాడు: "ఆధునిక చరిత్రలో కొరియా అంత సంపూర్ణంగా ధ్వంసం చెయ్యబడిన దేశంగాని, అంత నిరాశ్రయులుగా తయారైన జనులుగాని ఇంకెక్కడా లేరు. పునరుద్ధరించటానికి వీల్లేని రక్షణార్థులు 35 లక్షలమంది ఉన్నారు; వీరికి తిండీ, గుడ్డ, నివాసం అన్నీ కరువే...."

ఇటీవలి నెలల్లో నేను సేకరించిన కొన్ని పత్రికావార్తలు చదవటానికికూడా జుగుప్సకలిగించేటట్టున్నాయి. ప్రయోజనరహితంగా అసంఖ్యాకపౌరుల్ని వధించిన సందర్భాలు, కొద్దిమంది కమ్యూనిస్టు గెరిల్లాలు దాక్కున్నారనే నెపంతో గ్రామాలకు గ్రామాల్ని తగలబెట్టిన సందర్భాలు, ఫాక్టరీలని, నీటివసతుల్ని, ఆఖరికి ఎద్దుబళ్ళతో సహా ప్రయాణ సాధనాలని ధ్వంసంచేసినఘట్టాలు ఎన్నోవున్నాయి... ఈవిధంగా విచక్షణ లేకుండా ఒకదేశాన్ని నాశనం చెయ్యటంవల్ల "సమష్టిరక్షణ", "విమోచన" అనే నైతిక సూత్రాలు రక్షింపబడుతున్నాయా? అని ప్రశ్నించేవాళ్లు అరుదుగా కనిపిస్తున్నారు......


అమెరికన్ యుద్ధవిధానాలు చూసి కొరియన్లు ఏమనుకుంటున్నారో తెలిపే వ్యాసమొకటి ఇటీవల న్యూయార్క్ టైమ్సులో జార్జిబారెట్ వ్రాశాడు:

"సమితిసేనలు ఉత్తరానికి పురోగమిస్తున్నప్పుడు వారివెంటే తమ స్వగృహాలకు మరలివచ్చిన రక్షణార్థులు, తమ గ్రామాలకు, ఇళ్లకు ఆస్తిపాస్తులకు సంభవించిన విధ్వంసనాన్ని చూసి కొయ్యబారిపోయారు. ఒకప్పుడు ఈప్రదేశమేనా ఇళ్లు, స్కూళ్లు, అంగళ్లతో తులతూగే గ్రామం, అని ఆశ్చర్యపోతున్నారు...

యుద్ధరంగంలో పోరాడుతున్న సైనికుడు తనకెదురుగా ఏదైనా కదిలిన చప్పుడైతే తుపాకి పేల్చటానికి వెనుదీయడు; అతని తుపాకిదెబ్బకి గురియైనది శిశువునెత్తుకు వెడుతున్న తల్లియైనప్పటికీ అతన్ని నిందించవలసినపని లేదు. కాని సైనికులు చ కాగడంకోసమని నివసించే పూరికొంపల్ని తగలబెట్టిన సందర్భాలనేకం వున్నాయి."

యూరప్, ఆసియాలలోని ప్రజలకి ఆధునిక "విమోచన"యుద్ధపు తత్వం బాగా తెలిసింది. కొరియాలో ఇంకా ధ్వంసం కాని ప్రదేశాలేవైనా ఉంటే, -ఒక పక్షానికి మాత్రమే అధునాతన మారణాస్త్రాలుండటము, ఆటంబాంబు ప్రయోగించటం లాభసాటి కాకపోవటము దానికి కారణమని వారు గ్రహించారు. ప్రపంచయుద్ధమే వస్తే ఉభయపక్షాలకీ నవీన మారణాయుధాలు కొల్లగా వున్నాయి; అప్పుడు జరిగే విధ్వంసంముందు కొరియాయుద్ధం చిన్న ఆటలా కనిపిస్తుంది. అందుకే యూరపియన్లు, ఆసియన్లు ప్రాక్పశ్చిమాలమధ్య ఇంకా ఎక్కువగా రాజీసంప్రదింపులు జరగాలని వాంఛిస్తున్నారు....

(నేషన్ సంపాదకురాలు ఫ్రెడా కర్చ్వే—మార్చి 10) ★



అమ్మ

శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తం

తియ్యని చను బాలు తృప్తిగా గుడిపి
ముద్దు ముద్దుగ లాలి సుద్దులను బాడి
ప్రేమ మీరగ పెంచి పెద్దను జేయు
మాతరో! నీ కివే జోత లర్పింతు-


ఏదైన బాధ నన్నేడ్పించునపుడు
అర చేతులను నిల్పి యాటలాడించి
కను రెప్పవాల్పక కాపాడు నట్టి
మాతరో! నీ కివే జోతలర్పింతు-

నడయాడు సమయాన పడిపోతి నేని
గంతులో నను జేరి వింత మాటలను
నాపాటు మరపించి నవ్వించునట్టి
మాతరో ! నీ కివే జోతలర్పింతు-

పిండారబోసిన పండు వెన్నెలల
వెండి గిన్నెను బువ్వ నిండుగా దెచ్చి
బులి బుల్లి ముద్దల బొజ్జ నిండించు
మాతరో! నీకివే జోతలర్పింతు-

కను రెప్ప వాల్పక గారాము చేయ
మధు మధురమ్మైన కథలను జెప్పి
మృదుల హస్తాలతో నిదుర పోబుచ్చు
మాతరో! నీ కివే జోతలర్పింతు-

నీ ముది వయసులో నీ చెంత జేరి
పువ్వులలో బెట్టి పూజలు సేయ
నా ముద్దు చెల్లగా నన్ను దీవింప
మాతరో! నీ కివే జోతలర్పింతు-




తొలిపలుకు

నే నిప్పుడు రాయబోయే కథ ఒకాయనద్వారా విన్నాను. ఆయనకి ఆయన తండ్రీ, ఆయనకి ఆయన తండ్రీ, ఆయనకి ఆయనతండ్రీ ఈ కథ చెప్పారు—

ఈవిధంగా మూడువందల ఏళ్లకు పైబడి తండ్రులనుంచి కొడుకులకి ఈ కథ పాకుతూవచ్చి, ఈనాటికి నిలిచివుంది. ఇది చరిత్ర కావచ్చును; లేక పుక్కిటిపురాణం మాత్రమే కావచ్చును. ఇది నిజంగా జరిగిఉండవచ్చును; జరక్కపోయి కూడా ఉండవచ్చును; ఏమైనా ఈ కథ జరగటానికి వీలుమాత్రం వుంది. పూర్వకాలంలో పండితులు, విజ్ఞానులు మాత్రమే దీన్ని విశ్వసించిఉండవచ్చును; లేక పామరులు, అమాయకప్రజలు మాత్రమే దీన్ని విశ్వసించి, ఆదరించి ఉండవచ్చును.

—మార్క్ ట్వేన్



రచయిత:

మార్క్ ట్వేన్

[1884—1910]

["రాజా-పేదా" సీరియల్ వెంట తమ చిత్రం తాలూకు ఫోటోలు ప్రచురించడానికి అనుమతించినందుకు వార్నర్ బ్రదర్స్ వారికి కృతజ్ఞులము. ఇందులో ప్రధాన పాత్రలను బిలీ, బాబీ అనే కవల పిల్లలు నటించారు. మైల్స్ హెండన్ పాత్రను ఎరోల్ ఫ్లిన్, హెర్ట్‌ఫర్డ్ ప్రభువు పాత్రను క్లాడ్ రెయిన్స్ ధరించారు.

—సంపాదకుడు.]

"రాజూ - పేదా" కాలం నాటి చరిత్ర

ఈ కథ 1547 వ సంవత్సరంలో ఇంగ్లండులో జరిగినట్టు వ్రాయబడింది. ఆ రోజుల్లో ఇంగ్లండు దేశంలో ప్రజలు ఎలా జీవించేవారో, వారి ఆచారవ్యవహారాలు, కష్టసుఖాలు ఎలాంటివో ఈ నవలద్వారా బాగా తెలుస్తాయి. అయితే అప్పటి చరిత్ర కొంతైనా సంగ్రహంగా తెలుసుకునివుంటే నవల చదవటం తేలికవుతుంది.

అప్పటికి ట్యూడర్ వంశపు రాజులు ఇంగ్లండును పరిపాలిస్తున్నారు. వారిలో రెండోవాడైన ఎనిమిదవ హెన్రీ 38 ఏళ్ళ నుంచీ రాజ్యపాలనచేస్తూ, ఇప్పటికి అవసానదశలో ఉన్నాడు. ఇతని మొదటి భార్యయైన కాథరిన్‌కు మేరీ అనే ఆడశిశువు కలిగింది గాని హెన్రీతరవాత రాజ్యానికి కర్తయైన మగశిశువు కలగనే లేదు. అందుచేత అతడు కాథరిన్‌కు విడాకులిచ్చి ఆన్‌బొలీన్ అనే అందగత్తెను పెళ్లిచేసుకున్నాడు. ఇల్లా విడాకు లివ్వడానికి క్రైస్తవప్రపంచానికి ప్రధానమతాధికారియైన పోప్ అనుజ్ఞ ఇవ్వలేదు. హెన్రీ పోప్‌ను నెదిరించాడు; ఇంగ్లండులో మతవిషయాలమీద పోప్‌కు గల అధికారాన్ని రద్దుచేసి తనే వశపరుచుకున్నాడు. ఈ హెన్రీ కాలంనుంచే ఇంగ్లండు ప్రొటెస్టెంటు దేశం కావటం మొదలుపెట్టింది.

ఆన్‌బొలీన్‌కు కూడా ఎలిజబెత్ అనే ఆడపిల్ల కలిగింది గాని మగశిశువు కలగలేదు. అందుచేత జేన్‌సేమూర్ అనే ఆమెను పెళ్లిచేసుకున్నాడు. ఈవిడకు పుట్టినవాడే ఎడ్వర్డు ట్యూడర్. ఇతడే మన కథానాయకుడు; ఆరవ ఎడ్వర్డు అనే పేరుతో హెన్రీ తరవాత ఆరేళ్లు రాజ్యంచేశాడు. హెన్రీ మొత్తం ఆరుగుర్ని పెళ్లిచేసుకున్నాడు. అందరికీ విడాకు లివ్వడమో, చంపించెయ్యడమో జరిగింది.

ఎనిమిదవ హెన్రీ రాజ్యంచేసినకాలం ఇంగ్లీషుచరిత్రలో ముఖ్యమైనది. ఇంతటి తెలివితేటలు, సౌందర్యం గాని, అంతటి నిరంకుశత్వం, [illegible]గాని గల రాజు ఆ రోజుల్లో మరెవడూ లేడని చెబుతారు. తన గొప్పతనం పైకి రావటానికని, తన రాజ్యాన్ని విస్తరించుకోవాలని, యూరప్ ఖండంలో జరిగే అనేక యుద్ధాల్లో అనవసరంగా తలదూర్చి జన నష్టం, ధన నష్టం తెచ్చుకున్నాడు. రాజ్యంలో తనకు అపాయకారులుగా తోచిన ప్రభువుల్ని, మంత్రుల్ని నిర్దాక్షిణ్యంగా చంపించాడు. తన పేరు వినిపిస్తే ఎంతటివాడైనా గజగజలాడేట్టు చేసుకున్నాడు. ఇతడు చేసిన ఒక్క ఘనకార్యమూ ఏమిటంటే దేశంలోని చర్చిలమీద పోప్‌కు గల నిరంకుశాధికారాన్ని తొలగించి, తన నిరంకుశత్వాన్ని స్థాపించటం.

హెన్రీ తరవాత ఎడ్వర్డు, మేరీ, ఎలిజబెత్ వరసగా రాజ్యంచేశారు. ఎడ్వర్డు మతవిషయాల్లో తండ్రి పద్ధతినే అనుసరించాడు. కాని మేరీ మళ్లీ పోప్ అధికారాన్ని దేశంలోకి తీసుకువచ్చింది. తన తల్లికి జరిగిన అవమానానికి ప్రతీకారంగా వందలకొలదీ ప్రొటెస్టెంటు మతస్థులను మంటల్లో కాల్పించింది. ఈవిడకి తండ్రికున్న క్రౌర్యం వుందిగాని తెలివితేటలు లేవు. ఆ తెలివితేటలు ఎలిజబెత్‌కు అబ్బాయి. ఆమె మహాసమర్థతతో రాజ్యంచేసి ఇంగ్లండు దేశానికి పేరుప్రతిష్ఠలు తెచ్చిపెట్టింది. మన భారతదేశాన్ని తరవాత శతాబ్దంలో అన్యాయపు యుద్ధాలు, కుట్రలుచేసి ఆక్రమించుకున్న తూర్పు ఇండియాకంపెనీ ఈవిడగారి హయాంలో, ఈవిడ హయాం మీదనే బయల్దేరింది.

ఈ సంగతులన్నీ ఏ చరిత్రపుస్తకం చదివినా బోధపడతాయి. అయితే చరిత్రలు రాసేవాళ్లకి రాజులు, సామంతులు, వారి యుద్ధాలు, కుట్రలు తప్ప ఇంకేదీ చరిత్ర కాదు. సామాన్యజనం ఎలా బతికేవో, వారి కష్టాలు, వారి అవమానాలు వారి నాగరికత ఎలాంటిదో వారి కక్కర్లేదు. ఈ చరిత్ర తెలుసుకోడానికి ఆయా కాలాల్లో గొప్పగొప్ప రచయితలు వ్రాసిన సారస్వతగ్రంథాలు చాలవరకు తోడ్పడతాయి.

మార్క్ ట్వేన్ అమెరికన్ రచయిత. ఇతడు ఇటీవలి కాలపువాడైనా తన "ప్రిన్స్ ఎండ్ ది పాపర్" (రాజూ - పేదా) నవలలో పదహారో శతాబ్దపు ఇంగ్లండు చరిత్రను వాస్తవికంగా చిత్రించాడు.

అతిపురాతనమైన లండన్ నగరంలో 1537 వ సంవత్సరం, ఆకురాలు కాలం — కాంటీ అనే పేదకుటుంబంలో ఒక రోజున ఒక మగశిశువు పుట్టాడు; కాని అతను పుట్టడం ఎవరికీ ఇష్టం లేదు.

అదే రోజున, అదే నగరంలో ట్యూడర్ అనే ధనికవంశంలో మరో ఇంగ్లీషు శిశువు కూడా జన్మించాడు. అతడు పుట్టాలని తలిదండ్రులు, కుటుంబంవాళ్లే కాదు, ఇంగ్లండుదేశం యావత్తూ కోరింది. అతడు పుడతాడని ఎన్నో ఏళ్లు ఎదురు చూశారు, ఎన్నో ఆశలు పెట్టుకున్నారు, దేవుణ్ణి ఎంతో ప్రార్థించారు. ఇంతకాలానికి అతడు నిజంగా భూమిమీద పుట్టేటప్పటికి ప్రజలు ఆనందంతో దాదాపు వెర్రెత్తిపోయారు.

అనువాదం:
శ్రీ
నండూరి రామమోహనరావు

స్నేహితులే కాదు, ఏమాత్రం పరిచయమున్న మనుష్యులైనా, కలుసుకోగానే ఒకళ్ళనొకళ్లు కావిలించుకున్నారు; సంతోషం పట్టలేక భోరున ఏడ్చారు. ప్రభువులు, ప్రజలు, ధనికులు, దరిద్రులు అనే భేదం లేకుండా, యావన్మందీ ఆరోజున వేడుకలు జరుపుకున్నారు; విందులు చేసుకున్నారు; నాట్యాలు చేశారు; పాటలు పాడారు. ఈ ఉత్సవాలు చాలా పగళ్లు, రాత్రులు వరసన జరిగాయి.

పగటిపూట లండన్‌నగర దృశ్యాన్ని చూసితీరవలసిందే. ఏ ఇంటిమీద చూసినా రంగు జెండాలే. ఏ వీధిలో చూసినా ఊరేగింపులే. రాత్రిపూట కూడా నగర దృశ్యాన్ని మళ్ళీ చూసితీరవలసిందే. ఏ వీధిమొగలో చూసినా భోగిమంటల్లాంటి మంటలు; వాటి చుట్టూ పారవశ్యంతో పరవళ్లు తొక్కే జనం. ఎవళ్లు మాట్లాడినా వేల్సుయువరాజు, ఇంగ్లండుకు కాబోయే రాజాధిరాజు, ఎడ్వర్డు ట్యూడర్‌ని గురించే. కాని రాచనగరులో మఖమల్ పాన్పులమీద, సిల్కువస్త్రాల చాటున సుఖంగా నిద్రించే ఎడ్వర్డుట్యూడర్‌కు ఈ గొడవంతా ఏమీ తెలియదు; తన చుట్టూ గొప్ప గొప్ప సామంతులు, వారి భార్యలు ఉండి జాగ్రత్తగా పరిరక్షిస్తున్నారని అతనెరగడు.

కాని అదేరోజున జన్మించిన ఆ రెండో శిశువు టామ్‌కాంటీని ఎవ్వరూ తలచుకోనైనా తలుచుకోలేదు. తను పుట్టి ఎవర్ని ఇబ్బంది పెట్టడానికి వచ్చాడో ఆ నిరుపేద కుటుంబీకులకు తప్ప అతని గొడవ ఎవరికీ పట్టలేదు.

2

ఇక్కడ కొన్ని సంవత్సరాలు ముందుకు దాటేద్దాం.

లండన్ నగరపు వయస్సు అప్పటికే పదిహేనువందల ఏళ్లున్నది. అప్పటికే దాని ప్రఖ్యాతి దేశదేశాల వ్యాపించింది. నగరంలో ఓ లక్షమంది-కొందరి అంచనా ప్రకారం రెండు లక్షలమంది—దాకా జనం నివసిస్తున్నారు. వీధులు ఇరుకుగా, మురికిగా, వంకరటింకరగా ముఖ్యంగా టామ్ కాంటీ ఇంటి ప్రాంతాల్లో మరీ దుర్భరంగా ఉండేవి. టామ్ కాంటీ నివాసం లండను వంతెనకు సమీపంగానే ఉండేది. ఇళ్లన్నీ కొయ్యతో కట్టినవే. రెండో అంతస్తు ముందుకు తోసుకొచ్చినట్టుండేది. మూడో అంతస్తు పక్కకి తోసుకొచ్చినట్టు ఉండేది. ఈవిధంగా అంతస్తు లెక్కువైనకొద్దీ ఇళ్లు వెడల్పయ్యేవి. ఇళ్ళకి ఎరుపో, నీలమో, నలుపో యజమానికి ఏ రంగు ఇష్టమైతే ఆ రంగు వేసేవారు. చూట్టానికి ఆ ఇళ్లు చాలా అందంగా కనిపించేవి. కిటికీలకు అద్దాలుండిచిన్నవిగా ఉండేవి. అవి తలుపులమాదిరిగానే బయటికి తెరుచుకొనేవి.

టామ్ తండ్రి నివసించే ఇంటిని ఇల్లనటానికి వీల్లేదు; దాని పేరు ఓఫల్ కోర్టు; ఆవీధి పేరు పుడ్డింగ్ వీధి. ఎలికబిలంలాంటి ఆ చిన్న ఇంట్లో, బిలబిలలాడుతూ ఎన్ని బీదకుటుంబాలున్నాయో చెప్పలేము. ఏ నిమిషానైనా కూలిపోతుందనిపించేటంత పాతకొంప అది. కాంటీ తెగవాళ్లు మూడో అంతస్తులో ఓ గదిలో ఉండేవాళ్లు. తల్లికీ, తండ్రికీ ఓమూల ఓ మంచంలాంటి పదార్థం ఏదో పడుకోటానికుంది. కాని టామ్‌కీ, అతని బామ్మకీ, బెట్, నాన్ అనబడే అతని ఇద్దరు అక్కలకీ అలాంటి పదార్థం ఏమీ లేదు. నేలంతా యథేచ్ఛగా వాడుకోవచ్చు; ఎక్కడైనా పడుకోవచ్చు, శతాబ్దాలకిందట బాగానే వుండి. ప్రస్తుతం చిరుగుల కంబళీలుగాను, కంపు కొట్టే గడ్డిగానూ మాత్రం మిగిలిన పరుపులుకూడా ఉన్నాయి. అయితే వాటిని పరుపు లనటానికి వీల్లేకుండా, గడ్డికి గడ్డీ, కంబళీలకు కంబళీలు విడి విడిగా వచ్చేశాయి. పొద్దునపూట ఈ చెత్తపరుపుల్ని ఓమూల కుప్పగా పడేసేవారు. రాత్రిళ్లు పడుకోబోయేటప్పుడు ఎవరికి కావలసినంత వారు ఆ కుప్పలో కాస్త కాస్త తెచ్చుకునేవారు.

బెట్, నాన్ కవలపిల్లలు. ఇద్దరికీ చెరో పదిహేనేళ్లు ఉంటాయి. వాళ్ళ శరీరాలు నిత్యం మడ్డిఓడుతూ, చిరుగు గుడ్డలతో ఉండేవి. వాళ్లవి చాలా మెత్తటి హృదయాలు; మెదళ్లు మాత్రం మేకులు కూడా దిగనంత టి గట్టి మట్టితో చేసినవి. వాళ్ళ తల్లికూడా అలాంటిదే; అంతమంచిదే. తండ్రీ, బామ్మమాత్రం తాచుపాముల జంట. వీలైనప్పుడల్లా తాగేసేవాళ్లు. తరువాత కాట్లకుక్కల్లా పోట్లాడుకునేవాళ్లు; తమలో తామే

కాకుండా, ఎవరు దారి కడ్డం వస్తే వాళ్ళతో పోట్లాడేవారు. మత్తులో వున్నా లేకపోయినా నోటివెంట బూతులు తప్ప ఇంకేమీ వచ్చేవి కాదు. టామ్ తండ్రి జాన్ కాంటీ గజదొంగ. బామ్మఉద్యోగం బిచ్చమెత్తడం. పిల్లల్ని కూడా బిచ్చగాళ్లని చేశారుగాని, దొంగల్ని చెయ్యలేకపోయారు. ఆ కొంపలో ఉండే అలగా జనంలో ఒక వృద్ధ మతగురువు కూడా ఉన్నాడు. ఆయన చాలా మంచివాడు. రాజుగారు అతని ఉద్యోగం ఊడలాగేసి, కొద్దిగా పింఛను మాత్రం ఇస్తున్నారు. ఆయనపిల్లల్ని చాటుకు పిలిచి రహస్యంగా చదువు చెబుతుండేవాడు. ఆయన్ని అంతా ఫాదర్ ఆండ్రూ అంటారు. ఆయన టామ్‌కి రాయటం, చదవటమే కాకుండా, లాటిన్ భాష కూడా కొద్దిగా నేర్పాడు. అతని అక్కలకి కూడా నేర్పేవాడే, గాని వాళ్ళకి చదువుకోవటానికి భయం వేసింది, స్నేహితులు అసూయకొద్దీ ఏడిపిస్తారేమోనని.

ఓఫల్ కోర్టులో జీవితమంతా కాంటీఇంట్లో మోస్తరుగా నే నడుస్తూవుంటుంది. తాగి తందనాలు తొక్కటం, కొట్లాడుకోవడం, మొదలైన గందరగోళం ప్రతిరాత్రీ, రాత్రి అంతా సాగుతూంటుంది. ఆ ప్రదేశంలో ఆకలి ఎంతఎక్కువగాకని పిస్తుందో, పగిలిన తలకాయలుకూడా అంత ఎక్కువగానూ కనిపిస్తాయి.

ఇంత దారుణమైన ప్రదేశంలో ఉంటున్నప్పటికీ టామ్ ఖుషీగానే గడిపేవాడు. కష్టాలు, ఇబ్బందులు లేవని కాదు. ఆ మాటకొస్తే ఓఫల్ కోర్టులో కష్టా లెరగని కుర్రాడెవరు? కనుక కష్టాలు పడుతుండడమే నిజమైన, సుఖమైన జీవితమనే నిశ్చయానికి వచ్చాడు టామ్. రాత్రిళ్లు వట్టిచేతుల్తో ఇంటికి వచ్చేటప్పటికి తండ్రి బండబూతులు తిడుతూ చితకబాదేవాడు. తండ్రి అలిసిపోయి విశ్రాంతి తీసుకొంటున్న సమయంలో బామ్మ వచ్చి యథావిధిగా కార్యక్రమం జరిపేది. తండ్రి వదిలిపెట్టిన అవయవాలని కుళ్ళబొడిచేది. అర్ధరాత్రిఅంతా నిద్రపోయే సమయంలో తల్లి తన కడుపు మాడ్చుకుని దాచిన రొట్టె ముక్కని రహస్యంగా టామ్ కందించేది. ఈ నేరం చేస్తుంటే తండ్రి చూడటం, తల్లిని చర్మం వొలిచెయ్యటం కూడా చాలాసార్లు జరిగింది.

మొత్తంమీదటామ్ పని బాగానే ఉండేది — ముఖ్యంగా వేసాకాలంలో బిచ్చమెత్తేవాడు; కాని ఎంత తెస్తేతండ్రిదెబ్బలు కొట్టకుండా ఉంటాడో అంతే బిచ్చమెత్తేవాడు. ఎందుకంటే ఆ రోజుల్లో బిచ్చమెత్తడం న్యాయశాసనప్రకారం గొప్ప నేరం; దానికి శిక్ష కూడా మహాకఠినంగా ఉండేది. టామ్ ఎక్కువ కాలం ఫాదర్ ఆండ్రూ దగ్గిరే గడిపేవాడు. రాక్షసులు, దేవకన్యలు, మరుగుజ్జులు, భూతాలు, మాయకోటలు, రాజులు, రాజకుమార్తెలు—ఇల్లాంటి వాళ్ల కథలు ఆముసలాయన అందంగావర్ణిస్తుంటె నోరు తెరుచుకొనివినేవాడు. అతని చిన్నబుర్రనిండా ఈ తమాషా కథలు క్రిక్కిరిసిపోయాయి. చీకట్లో తన చెత్తపరుపుమీద పడి దొర్లుతూ ఆకలి, అలసట, తండ్రి కొట్టిన దెబ్బలు అన్నిటినీ మరిచిపోయి ఊహాప్రపంచాలలోకి పారిపోయేవాడు. గొప్ప గొప్ప రాజభవనాలలో తనో రాజకుమారుడై విహరిస్తున్నట్టు భావించుకునేవాడు.

కాని అతనికి ఒకటే దిగులు; ఎప్పటికైనా నిజమైన రాజకుమారుణ్ణి కళ్లారా చూడాలని. ఒక సారి ఈ కోరికను తన ఓఫల్‌కోర్టు స్నేహితులకు తెలిపాడు. కాని వాళ్లు అతన్ని నిర్దాక్షిణ్యంగా వెక్కిరించటం, ఏడిపించటం మొదలెట్టేసరికి ఇక ఆ ప్రస్తావన నలుగురిలో తీసుకురావటం మానుకున్నాడు.

మతగురువుదగ్గిర పుస్తకాలు తీసుకుని అప్పుడప్పుడు చదివేవాడు; అర్థంకానిచోట చెప్పించుకునేవాడు. వీటన్నిటివల్లా క్రమంగా అతనిలో ఒక మార్పుకలిగింది. తన ఊహాప్రపంచంలో మనుషులు అంత దర్జాగా, అందంగా బతుకుతుంటే తను నీచమైన పరిసరాల్లో మురికిబట్టలు కట్టుకుని బతుకుతున్నాడు! ఛా, అదేం బాగా లేదనుకొని అప్పటినుంచీ కాస్త శుభ్రంగా ఉండటం మొదలెట్టాడు. అయితే బురదలో దొర్లడం పూర్తిగా మానేశాడనిగాని, అల్లా దొర్లడం అతనికి హాయిగా లేదనికాని, అనుకోకండి. థేమ్సు నది బురదలో చాలాసేపు నానేవాడు; అయినా ఇంటికి వచ్చేటప్పుడు దేహం పరిశుభ్రంచేసుకుని మరీ వచ్చేవాడు.

అంతే కాదు; చీప్ సైడ్ బజా

రులో వసంతోత్సవాలు జరిగేటప్పుడు, సంతలు జరిగేటప్పుడు బలే హుషారుగా ఉండేది టామ్‌కి. ఒక్కొక్క సారి ఖైదీల్ని లండన్ గోపురానికి నడిపించుకు తీసుకుపోయేటప్పుడు రాజుసైనికుల్ని, వాళ్ళ 'మార్చింగ్'ని చూసే అదృష్టం కలిగేది టామ్‌కి. నేరస్థుల్ని మంటల్లో పడేసి కాల్చివెయ్యటం కూడా కొన్నిసార్లు చూశాడు. మొత్తానికి, టామ్ జీవితంలో విసుగుపుట్టించే సంఘటనలకన్నా, సరదాగా ఉండేవే చాలా జరుగుతూ వచ్చాయి.

రాజుల జీవితాన్ని గూర్చి ఇరవైనాలుగు గంటలూ అదేపనిగా ఊహించుకోవటం, చదవటం మూలంగా, టామ్‌కి తెలియకుండానే అతడు రాజకుమారుడిలాగా ప్రవర్తించటం మొదలెట్టాడు. అతని మాటలు, చేతలు అన్నీ తమాషాగా మారిపోయాయి. అచ్చు రాజదర్బారులలో ఎల్లా ఉంటారో అల్లా ఉండటం మొదలెట్టాడు. ఈమార్పు చూసి అతని మిత్రులందరికీ ఆశ్చర్యం, గౌరవంకూడా కలగటం మొదలైంది. అతని పలుకుబడి క్రమంగా హెచ్చింది. కొంతకాలానికి తోటివాళ్ళంతా అతన్ని తమకంటే గొప్పవాడుగా భావించి గౌరవించటం సాగించారు. అతనికి తెలిసినన్ని విషయాలు ఇంకెవరికీ తెలియవనీ అంత అద్భుతంగా ఉపన్యాసాలివ్వటంగాని, అంత అద్భుతమైన పనులు చెయ్యటంగాని చేతైన మానవుడింకోడు లేడనీ వాళ్ళనుకునేవారు. టామ్ మాటలు, పనులు పెద్దవాళ్ళదాకా పాకాయి. వాళ్ళుకూడా టామ్‌కాంటీ తెలివితేటలు చూసి ఆశ్చర్యపడి, తమలో అతడు తప్పబుట్టాడని భావించారు. పెద్దపెద్దవాళ్ళుకూడా అర్థంకాని సమస్యల్ని అతనిదగ్గరకు తీసుకువచ్చి పరిష్కారం చేసుకుపోయేవారు. అతన్నెరిగినవాళ్ళంతా అతన్ని గొప్ప నాయకుణ్ణి చేసేశారు—కాని టామ్ కాంటీఇంట్లో వాళ్ళకి మాత్రం అతనిలో ఎలాంటి గొప్పతనం కనిపించలేదు.

ఒకసారి టామ్ రహస్యంగా రాజదర్బారు నేర్పాటు చేశాడు. అతడు రాజకుమారుడు; దగ్గిర స్నేహితులకు రాజబంధువులుగానూ, అంగరక్షకులు, స్వంత సేవకులుగానూ పెద్ద హోదాలిచ్చాడు. పుస్తకాల్లో చదివినదాని ప్రకారంగా, తను రాగానే ఎవరెవరు ఏవిధంగా ప్రవర్తించవలసిందీ వాళ్ళకి నేర్పాడు. ప్రతిరోజూ రాజదర్బారు మహావైభోగంగా జరిగేది. టామ్ తన ఊహాసామ్రాజ్యాన్ని అతిసమర్థతతో పరిపాలించేవాడు; ఊహాసైన్యాలకి, నౌకాదళాలకి, వైస్రాయిలకి, ఎవళ్ళకివ్వవలసిన ఉత్తరువులు వాళ్ళకిచ్చేవాడు.

దర్బారు ముగియగానే చిరుగులాగూ, చొక్కా ఎగలాక్కుని, రోడ్డుమీద బిచ్చమెత్తుకునేవాడు; దొరికితే కాస్త రొట్టెముక్క ఎంగిలిపడి, లాంఛనప్రకారం తిట్లు, తన్నులు కూడా ఎంగిలిపడి చెత్త పరుపుమీద ఒళ్ళుమరిచి నిద్రపోయేవాడు. నెమ్మదిగా స్వప్నప్రపంచాల్లోకి జారి, స్వప్నరాజ్యాలేలుతూ స్వప్నవైభవాలనుభవిస్తూ సంతోషించేవాడు.

ఇంత అనుభవిస్తున్నప్పటికీ అతని దిగులు పోలేదు; నిజంగా బతికివున్న రాజకుమారుణ్ణి చూడాలని అతని కోరికే తహతహ. రోజులు, వారాలూ, నెలలు గడుస్తున్నకొద్దీ అతని మిగతా కోరికలన్నీ సన్నగిల్లి ఈ ఒక్క కోరికే ప్రబలమై మనస్సంతటా ఆక్రమించుకుంది.

జనవరిలో ఒక రోజున టామ్ మామూలుప్రకారం భిక్షాటనం చేస్తున్నాడు. మిన్సింగ్ వీధి ప్రాంతాల్లో గంటల తరబడి కాళ్ళకి చెప్పులు లేకుండా, చలికి గజగజ వణుకుతూ తిరిగాడు. ఆ వీధిలో భోజనపదార్థాల షాపులనేకం ఉన్నాయి. అద్దాల కిటికీల వెనకాల ప్రదర్శించబడిన రకరకాల రుచ్యపదార్థాలు చూస్తుంటే అతనికి పిచ్చెత్తిపోయింది. వాటి గుబాళింపును బట్టి అవి దేవతలు తినదగిన పదార్థాలుకాని మానవమాత్రుల కోసం కాదని అనుకున్నాడు. ఆ రోజు నిజంగా దుర్దినం; చల్లటి పొగజల్లు పడుతోంది; మబ్బుపట్టి మసక చీకటిగా వుంది. ఆ రాత్రి టామ్ ఇంటికి తడిసి ముద్దై, అలిసి, ఆకలికి ఆవురావురుమంటూ వచ్చాడు. అతని అవతారం చూసి తండ్రి, బామ్మ పాపం చాలా జాలిపడ్డారు. అంటే—వాళ్ళపద్ధతి ప్రకారం. వెంటనే టామ్ వీపుమీద రెండు మూడు బడితెలు విరిగాయి. కిక్కురుమనకుండా పడుకున్నాడేగాని లోపల ఆకలిబాధ, దెబ్బల బాధ, బైట

బూటులు, పోట్లాటలు— ఈ గొడవలో అతనికి చాలాసేపుదాకా నిద్రపట్టలేదు.

చివరకి మెల్లు మెల్లిగా స్వప్న సామ్రాజ్యంలోకి దిగాడు. వజ్ర వైడూర్యాలతో ధగధగ మెరిసిపోయే రాజులు, రాజకుమారులు, అడుగడుగునా సలాములుచేసే సేవకులు, అంతఃపురాల్లోని రాజకుమార్తెలు అతని కలలనిండా కిక్కిరిసిపోయారు. క్రమంగా అతనుకూడా ఓ రాజకుమారుడుగా మారిపోయాడు.

ఆరాత్రంతా అతడు రాజభోగాలనుభవించాడు; గొప్ప గొప్ప సామంతుల దగ్గిర్నించి మామూలు ప్రజలదాకా అందరినమస్కారాలు చిరునవ్వుతో, క్రీగంటి చూపుతో స్వీకరిస్తూ, మఖమల్ పరుపులమీద కూచ్చుని గుబాళించే సుగంధ ద్రవ్యాల మత్తువాసనలు పీలుస్తూ, తియ్యని సంగీతం వింటూ-ఎంతైనా స్వర్గసౌఖ్యం అనుభవించాడు.

తెల్లవారి లేచి చుట్టూ కలయచూడగా, సూర్యకాంతికి అతని స్వప్నాల మంచు కరిగిపోయింది. దాంతో అతని పరిసరాలు అదివరకు కంటె వెయ్యిరెట్లు ఛండాలంగా కనిపించాయి; టామ్ గుండె బరువెక్కి బద్దలవుతూ౦ దనిపించింది, కాని మనసారా ఏడ్చి ఆ బరువు తీర్చుకున్నాడు.

3

టామ్ కణకణలాడే ఆకలితో లేచాడు; రాత్రి వచ్చిన కలల్నె మళ్లీ మననం చేసుకుంటూ, వాటి నీడల జాడల్లోనే నడిచిపోయాడు. నగరంలో ఏవేపుకు పోతున్నదీ తన చుట్టూ ఏం జరుగుతున్నదీ కూడా గమనించకుండా చాలా దూరం తిరిగాడు. దోవన నడిచేవాళ్లు అతన్ని అటు తోశారు, ఇటు తోశారు, కొందరు తిట్టారు; కాని ఊహాల నీడల్లో నడుస్తున్న టామ్ ఇవేమీ పట్టించుకోలేదు. చివరికి 'టెంపుల్ బార్' అనే చోటికి వచ్చాకగాని అతనికి తెలియలేదు, ఇంటినుంచి చాలదూరం వచ్చానని. కాస్సేపు ఆగి, ఆలోచించాడు. మళ్ళీ ఆలోచనల్లో పడి ముందుకు పోయాడు.

లండన్ నగర ప్రాకారాలు కూడా దాటాడు. అంతవరకూ పల్లెటూరిపోడ్డుగా ఉన్న 'స్ట్రాండు' అక్కడినించి చక్కని రాజ వీధిలాగా సాగింది. వీధికి ఒకవేపు వరసన దగ్గిరదగ్గిరగా ఇళ్లున్నాయి. రెండోవేపున ప్రభువులకు చెందిన పెద్ద పెద్ద భవనాలు దూర దూరంగా అక్కడోటి, అక్కడోటి ఉన్నాయి. ఆ భవనాలచుట్టూ విశాలమైన తోటలు, ఆవరణలు నదీతీరందాకా విస్తరించుకుని ఉన్నాయి.

టామ్ నడిచి నడిచి 'చేరింగ్ విలేజ్' అనే ప్రదేశానికి వచ్చాడు. అక్కడ అందమైన శిలువ ఒకటి పాతివుంది. దానిదగ్గర కాసేపు విశ్రమించాడు. మళ్ళీ లేచి చక్కని రాజబాటగుండా పోయి కార్డినల్ (చర్చి ఉన్నతాధికారి) భవనం సమీపించాడు. దానికి అల్లంత దూరంలో టామ్ జన్మలో ఎప్పుడూ కని విని ఎరగనంతటి గొప్ప భవనం కనుగొన్నాడు. అది ఇంగ్లండు రాజులు నివసించే 'వెస్ట్ మినిస్టర్' భవనం. టామ్ దానికేసి నడిచాడు. అద్భుతమైన శిల్పనైపుణ్యం ప్రదర్శించే ఆ కట్టడాలు, బురుజులు, గోపురాలు, తాటిచెట్టుప్రమాణంలో వున్న రాతిగేటు, ఆ గేటుకు అటూ ఇటూ తీర్చి దిద్దినట్టు వరసగా ఉన్న సింహప్రతిమలు—ఇదంతా చూసి టామ్ దిగ్భ్రాంతుడై నోరుతెరుచుకుని చూస్తూ నిలబడిపోయాడు. అతని కోరిక చివరి కిన్నాళ్లకి నెరవేరబోతున్నదా? ఇదే గదా రాచనగరు! అతని అదృష్టం బాగుంటే నిజమైన రాజకుమారుడు, నిజంగా, తన కవుపించకూడదూ!

బంగారపు పూతపూసిన చువ్వల గేటుకు అటూ ఇటూ బతికివున్న విగ్రహాలు నిలబడి ఉన్నాయి— అంటే మరేం లేదు — కనురెప్పలైనా ఆర్పకుండా, పైనుంచి కిందదాకా తళతళ మెరిసే ఉక్కుకవచాలు తొడుక్కుని నిటారుగా నిలబడివున్న ద్వారపాలకులు. గేటుకు దూరంగా పల్లెటూరి జనం, నగరంలోని అలగా జనం గుంపులు గుంపులుగా తచ్చాడుతున్నారు. వాళ్లు కూడా టామ్ వచ్చిన పనిమీదే వచ్చారు-పొరబాటుగానైనా రాజో, రాజకుమారుడో కనిపించకపోతారా అని. ప్రాకారానికి చాలాచోట్ల గేట్లున్నాయి. వాటిగుండా, అద్భుతమైన అశ్వశకటాలు వస్తున్నాయి, పోతున్నాయి. వాటిల్లో గొప్పవాళ్లు, వాళ్ల గొప్ప నౌకర్లు వస్తున్నారు, పోతున్నారు.

చిరుగుపేలికలు తప్ప వంటిమీద మరేమీ లేని మన టామ్ కాంటీ నిద్రలో నడుస్తున్నవాడి

మూడిరిగా, మెల్లిగా ఊగుతూ ద్వారపాలకుల్ని కూడా దాటి ముందుకు పోయాడు. ఇంతలో హఠాత్తుగా అతని హృదయం ఓ సెకండు సేపు స్తంభించిపోయింది. దేనికోసం ఇన్నాళ్లూ తపించిపోయాడో ఆ దృశ్యం కళ్లెదటగా కనిపించింది. లోపల అతిసుందరుడైన రాజకుమారుడు నుంచుని వున్నాడు; బాగా వ్యాయామం, కత్తిసాము చేసినందువల్ల గట్టిపడి నిగనిగలాడుతున్నదతని శరీరం; ముద్దొచ్చే సిల్కుబట్టలు కట్టుకున్నాడు; వంటినిండా వెలలేని రత్నాభరణాలు తళతళమంటున్నాయి; నడుముకు వజ్రాలు పొదిగిన ఖడ్గం, చిన్న బాకు వేలాడుతున్నాయి; ఎర్రటి మడమలుగల చిన్ని పాదరక్షలు అతని సుకుమార పాదాలను అలంకరించాయి. తలమీద ఎర్రటి కుచ్చుల టోపీ, దానిమీద పెద్ద వజ్రం ఉన్నాయి. రాజకుమారుడి పక్కన ఖరీదైన దుస్తులు ధరించిన కొందరు పెద్దమనుషులు నుంచున్నారు; బహుశా వాళ్ళు అతని సేవకులు కావచ్చును. అతడు నిజంగా రాజకుమారుడే! సందేహం లేదు, నిజమైన రాజకుమారుడే!

ఈ దృశ్యంతో టామ్‌కళ్లు చెదిరిపోయాయి. సంతోష, సంభ్రమాలతో అతని కళ్లు గుండ్రంగా విప్పారుకుని రెప్ప వాల్చటంలేదు. ఊపిరి అందటంకూడా కష్టమైంది. రాజకుమారుణ్ణి వీలైనంత దగ్గరగా చూడాలని, చూసి కళ్లతో తాగెయ్యాలని ఒక వెర్రికోర్కె పుట్టింది. తనేం చేస్తున్నాడో తనకే తెలియకుండా ముందుకు నడిచాడు. గేటు కటకటాలు రంగున మొహానికి కొట్టుకునేదాకా అతనికి తెలివి రాలేదు. తక్షణమే ద్వారపాలకుల్లో వొకడు టామ్ జబ్బలు పట్టకుని ఇవతలకి లాగివేశాడు. ఆ వూపుకి టామ్‌బొంగరంలా గిరగిరతిరుగుతూ పోయి పల్లెటూరి గుంపులో పడ్డాడు.

"అరేయ్, కుర్రాడా! నీ కిక్కడేం పని,రా!" అని ద్వారపాలకుడు వెక్కిరించాడు. జనం ఈవెక్కిరింపునందుకుని ఇంకా వేళాకోళం చేశారు.

కాని ఆ క్షణంలోనే యువరాజు మెరుపులా గేటు దగ్గరికి దూసుకుని వచ్చి, కోపంతో మండుతున్న కళ్లతో ఇలా అన్నాడు:

"ఎంత సాహసం! పాపమా కుర్రాణ్ణి అలాగేనా విసిరివెయ్యటం? నాతండ్రి ప్రజల్ని ఇలాగేనా అవమానించడం? గేటు తెరు. అతన్ని లోపలికి తీసుకురా."

బైట జనం అప్రయత్నంగా టోపీలు తీసేసి యువరాజుకు గౌరవం చూపించారు. యువరాజును చూడగలిగినందుకు వారి సంతోషం వర్ణించడానికి తరంగాదు. ఒక్కగొంతుకతో "వేల్సు యువరాజుకూ జై," అని అరిచారు.

సైనికులు టామ్‌ని లోపలికి ప్రవేశపెట్టారు. టామ్‌చెయ్యి ఎడ్వర్డు ట్యూడర్ పట్టుకుని నడుస్తూ అన్నాడు:

"పాపం చాలా ఆకలిగా, అలసటగా వున్నట్టున్నావు. పాపం నీకు అవమానం కూడా జరిగింది. నాతో రా."

యువరాజుపక్కనున్న సేవకులు "అదేమి యువరాజా! బిచ్చగాణ్ణి రాజభవనంలోకి రానిస్తారా?" అన్నట్టు ముందుకు వచ్చి వారించబోయారు. కాని రాజఠీవితో వాళ్ళని గదమాయించేటిప్పటికి వాళ్లెక్కడివాళ్లక్కడ స్తబ్ధులైపోయారు. ఎడ్వర్డు టామ్‌ని రాచనగరులో తన మందిరానికి తీసుకుపోయాడు. అతడు కనుసైగ చేసేటప్పటికల్లా సేవకులు రకరకాల పిండివంటలు, పళ్లు, ఇతర భోజనసామగ్రి తీసుకువచ్చి బల్లపై అమర్చారు. ఆ పదార్థాలు టామ్ పుస్తకాలలోనూ, కలలలోనూ తప్ప ఎప్పుడూ చూసి ఎరగడు. ★

(ఇంకావుంది.)

"అమ్మా, పాపం వీధిలో అరిచే ముసలాడి కిస్తాను ఒక అణా ఉంటే ఇవ్వవూ?"

"ఏమని అరుస్తున్నాడ్రా?"

"ఐస్‌క్రీం, ఐస్‌ఫ్రూట్, అని అరుస్తున్నాడు."

* * *

"మీపిల్ల ఎంత సాదువుగా అమాయికంగా కనిపిస్తుందడీ!"

"ఓసి, ముండా!... ఏంచేసిందేమిటి?"



అతనికంటె ఘనుడు...

శ్రీ. కె. పి. రావు

డడ, డడ వర్షం జోరుగా కురవ సాగింది. సోమన్న ఒక్కడూ ఇంట్లో ఓ పెద్ద కిటికీ అంచున వణుకుతూ కూర్చొని వీధిలోకి చూస్తున్నాడు. అతనలా కిటికీలో వాసం చేయడానికి కారణం ఏమంటే సోమన్న ఇల్లంతా కృంగి కూలిపోతూ ఉన్నది. నిలవడానికి వీల్లేకుండా వర్షం ఇంటా బయటా ఒకేలా కురుస్తున్నది. ఒక్క కిటికీలో వర్షం కురవడం లేదు కదా అని సోమన్న కిటికీలో బైరాయించాడు.

ఇంతలో ఆ దారిన అతుకుల తమైన, ఓ పాత గొడుగేసుకొని చిరుగుబట్టలతో పరమా సహ్యమైన ఆకారంతో పోతున్న మల్లన్న కిటికీ వద్దకు చేరాడు "ఏరా సోమన్నా! ఏం ఖర్మంరా నీకు? లక్షాధికారివే- ఇల్లు బాగుచేయించుకొని హాయిగా పడుకోరాదూ. ఇలా ఇల్లంతా వర్షంతో నింపి కిటికీలో ఓ దరిద్రుడిలా కూర్చుంటే - ఒట్టి పిశినారిరా అనుకోరు?" అని మందలించగా సోమన్న మల్లన్నతో ఇలాగన్నాడు: - "సరే - ఇల్లు బాగు చేయించుకోలేక గాదూ, దరిద్ర దేవత నెత్తికెక్కి కాదు-పైన భోరున వర్షం కురుస్తుంటే ఇల్లు బాగుచేసేది ఎవర్రా? అయినా - పిశిని గొట్టని నన్నెవరూ అనరు-పైగా నిన్నే అంటారు సుమీ! అదిగో-నీవూ లక్షాధికారివే-అయితే నేం ఒట్టి పిశినారివి కనుకనే అలా పాత గొడుగూ, చిరుగుబట్టలూ, అవీయివీ తయారు..!

"ఏడ్చావులేవోయ్ వెర్రిపీనుగ నీకేం తెల్సు. తెల్సిన ఊరివారిముందు సింగారించుక తిరిగితే లాభమేమిటోయ్? అంతేగానీ-పిశినారి తనం చేతగాదోయ్!" అంటూ మల్లన్న వెళ్లిపోయాడు.

వేసవికాలం వచ్చింది. ఒకపొరుగూరిలో బజారులో సోమన్న-మల్లన్నకు కలిశాడు. మల్లన్న వేషం యధాప్రకారంగానే అసహ్యకరంగా ఉంది. "ఏగోయ్, సోమన్నా ఇంతకీ ఇల్లు బాగు చేయించావా-లేదా" అని పల్కరించాడు వెటకారంగా.

"లేదురా - అయినా ఇప్పుడేం వానలువచ్చి చస్తాయనీ ఇల్లు బాగు చేయించడం? వానకాలం వచ్చినప్పుడు అవసరంకదా - ఇప్పుడేం తొందర-అప్పుడాలోచిద్దాం. కానీ, ఇదేమిట్రా? ఊరిలో అడిగితే అందరూ ఎరిగినవాళ్ళఎదుట ఏం షోకు చేసుకోవాలన్నావు-పొరుగూరికి వచ్చినా అదే వేషమేమిట్రా? నీపిశిని గొట్టుతన-" అనబోతున్న సోమన్న కడ్డుతగిలి మల్లన్న ఇలాగన్నాడు, "ఆగాగు మరి-పొరుగూరిలో మనసంగతి, అంటే మనం లక్షాధికారులమో భిక్షాధికారులమో ఎవరికీ తెలియదు గదా! అలాంటప్పుడిక్కడ ఏ వేషంతో ఎలా తిరుగుతే ఏరా? ఏం బాధ చెప్పు!"

"బలే" అంటే "బలే" అనుకొని- ఇద్దరూ చెట్టాపట్టా లేసుకొని బయల్దేరి పోయారు. ★

దురాశ దుఃఖమునకు చేటు

ఓ బాలూ మీరు ఎప్పుడైనా దురాశ దుఃఖమునకు చేటు అనే సామెత విన్నారా దానిని గురించి ఒక కథ వుంది చెప్తాను వినండి.


పూర్వము పాటలీపుత్రం అనే పట్టణాన్ని శూరసేన మహారాజు పాలిస్తూ వుండేవాడు. అతనికి లేక లేక ఒక కూతురు పుట్టింది. ఆపిల్లకి చంద్రకళ అని పేరు పెట్టి గారాబంగా పెంచుతూ వచ్చారు. నిజంగా ఆపిల్ల చంద్రకళలాగే అందంగా వుండేది. రోజూ చంద్రకళా మంత్రి కూతురు మాలినీ కలసి సరదాగా ఆడుకొనేవారు కాని చంద్రకళ తనకంటె అందమైనదని మాలిని ఈర్ష్య పడుతూవుండేది. ఒకనాడు మాలిని మామూలు ప్రకారం చంద్రకళతో ఆడుకొని ఇంటికి వచ్చేసింది. తనూ చంద్రకళ అంతటి అందగత్తె అవడము ఎలాగా అని ఆలోచిస్తూ కూచుంది. ఇంతలో ఒక సాధువు భిక్షకై వచ్చి మాలినిని చూచి "ఏమిటి అమ్మాయీ దీర్ఘంగా ఆలోచిస్తూన్నావు" అని అడిగేడు. "నేను రాజుకూతురు అంతటి అందగత్తెను అవాలని వుంది. ఎలాగా అని ఆలోచిస్తూవున్నాను" అంది. "అయితే నేను చెప్పినట్లు చేస్తే నువ్వు రాజకూతురు అంతటి అందగత్తెవు అవుతావు. చెప్పినట్లు చేస్తావా?" అని సాధువు మంత్రి కూతురుని అడిగేడు. తప్పకుండా చేస్తానంది. "అలాగైతే ఈ మంత్రమూలికను చేతికి కట్టుకొని ఈ వూరుకి తూర్పునవున్న చెరువులో మూడుసార్లు మునిగావంటే నువ్వు రాజకూతురుఅంతటి అందగత్తెవు అవుతావు" అని చెప్పి మూలికనిచ్చి వెళ్ళిపోయాడు ఆ సాధువు.

మర్నాడు మాలిని మూలికను చేతికి కట్టుకొని తూర్పువైపు వున్న చెరువులో మూడుసార్లు మునిగి లేచేసరికి నిజంగా చంద్రకళ అంతటి అందగత్తె అయిపోయింది. మాలిని తిరిగి యిలా అనుకొంది—నేను మళ్ళీ మూడుసార్లు మునిగానంటే చంద్రకళను మించిన అందగత్తెను అయిపోతాను అని అనుకొని మళ్ళీ మూడుసార్లు మునిగింది. అయ్యో! క్రిందటి అందముపోయింది. తిరిగి మామూలుగానే అయిపోయింది. చూశావా, బాలా! సాధువు కొంత అందాన్నిచ్చాడు. దానితో సంతోషించక ఇంకా అందాన్ని ఎక్కువ చేసుకోవాలని దురాశపడ్డది. కాని మొదటిస్థితే వచ్చింది. అందుకే పెద్దలు "దురాశ దుఃఖమునకు చేటు" అని అన్నారు. బాలా! నువ్వు ఎప్పుడూ దురాశపడకేం ★

రచన:
[illegible]



పెళ్లెప్పుడు?



ఒకవూళ్ళో తల్లీ కొడుకు వుండే వారు. కొడుకు ఎప్పుడూ మొద్దులా కూచోడమే కాని ఏ పనీ చేసేవాడు కాడు. అందుకని ఆమె ఆమెకొడుకుతో "నాయనా నీ వెక్కడైనా రెండు రూపాయలు సంపాదిస్తివా నీకు పెళ్లి చేస్తాను మరి" అంది. పెళ్లంటే వాడికి కూడ 'ఆశ కలిగింది. ఎలాగో కష్టపడి రెండురూపాయలు సంపాదించాడు. "అమ్మా రెండు రూపాయలు తెచ్చానే మరి నా పెళ్ళెప్పుడు చేస్తావు?" అన్నాడు. "అయ్యో నాయనా! రెండు రూపాయలతో పెళ్లవుతుందా? ఇంకో రెండుకావాలి" అంది.

నిజమే ననుకొని ఇంకో రెండు రూపాయలు సంపాదించాడు. అప్పుడుకూడ వాళ్ల అమ్మ అదే సమాధానం చెప్పేటప్పటికి వాడికి విసుగు జనించింది. పోనీలే ఈ రూపాయలతోనే చేసికోలేక పోతానా అని ఆ డబ్బు పుచ్చుకుని వెళ్లిపోయాడు. దారిలో ఒక తాటాకుబుట్ట అల్లి దానినిండా బుల్లి బుల్లి గులకరాళ్లు పోసి పైన చిన్న మూత ఉండునట్లు చేసి ఈ రూపాయలు పైకి కనబడునట్లు పెట్టి నెత్తి మీద పెట్టుకుని బజారునకు బయలు దేరాడు.

దారిలో ఒక అమ్మాయి రొట్టెలతట్ట నెత్తిమీద పెట్టుకుని అమ్మకానికి వస్తోంది. వీనిని చూచి అబ్బాయి నీబుట్టలో దేమిటి అని అడిగింది. "నాబుట్టలోవి రూపాయలు చూచుకో మా అమ్మ నాపెళ్లికై ఈ రూపాయిలిచ్చి రొట్టె తెమ్మని పంపినది" అనెను. అది విని "అయితే ఒకరితట్ట లొకరు మార్చుకొందుమా? అని అడిగింది ఆపిల్ల. అబ్బో నాకు దండగేమో?"

"దండగేమిటి చాలా రొట్టెఉందని సమాధానము చెప్పి ఒకరితట్ట మరొకరు తీసికొన్నారు. ఈటక్కరి ఆరొట్టెల తట్టతో ఒక చాకిరేవు దగ్గరికి వెళ్లాడు. అక్కడొక చాకలి ది పిల్లాడ్ని ఒడ్డున కూర్చోబెట్టి రాజు గారి బట్ట లుతుకుతోంది. ఈ టక్కరి తనరొట్టెలో కొంచె ముక చెట్టు క్రింద పెట్టి చాకలిదాని పిల్లాడిదగ్గర కూర్చుని రొట్టె తింటూ వాడ్ని ఏడిపించాడు. చాకలి దా ఏడుపు విని

పిల్లవాని దగ్గరకువచ్చి కొంచెము రొట్టె పెట్టమనెను. అబ్బో నాకాకలి వేస్తోంది. నీకు కావలిస్తే ఆ చెట్టు క్రిందఉంది తెచ్చుకోమని చెప్పాడు. ఆచాకలిది నీపేరెవరని అడిగింది. నాపేరు గాలి అని చెప్పాడు. పాపమది వెళ్లి ఆ రొట్టెలు ఏరి పిల్లాడికి పెట్టి తనుకూడ తిని వచ్చి చూచునప్పటికి అచ్చట ఒకబట్టకూడా లేదు. అది వెళ్లిన వెంటనే వీడా బట్టలు తీసికొని ఒక అరణ్యములోనికి వెళ్లిపోయెను. చాకలిది పోలీసుల వద్దకు పోయి అయ్యా నాబట్టలు గాలి ఎత్తుకుపోయెనని చెప్పెను వారు గాలా! గాలియైన పట్టుకొనుట మాచేతకాదని నవ్వి వెళ్లిపోయిరి.

ఈటక్కరి ఆ బట్టల నరణ్యములో ఒక పత్తిచెట్టుపై ఆరవేసెను. ఆ దారిని బట్టలు కొనుక్కొనుటకై పోవుచున్న వర్తకుడొకడు వీనిని చూచి ఏమిటది అని యడిగెను. అంత వాడు నేను పేదవానిని. పెళ్లి చేసికొనదలచి బట్టలకై ఈ చెట్టును ప్రార్థింప ఇవి యిచ్చినది అనెను. అంత ఆ వర్తకుడు అట్లయిన నేను నాకొడుకు పెళ్ళికి బట్టలకై పోవుచున్నాను. కనుక యీ డబ్బు తీసికొని ఆబట్టలు నాకిమ్మనెను. నీ కొడుకుపెళ్ళెపుడు? అని టక్కరి అనెను. ఇంకను నాలుగు నెలలున్నదని వర్తకుడు బదులు చెప్పెను. నీకొడుకు పెళ్లి నాలుగు నెలలున్నది కాని నాపెళ్లిపుడే అందుచే ఈ బట్టలు తీసికొని ఈ చెట్టు నీకమ్మెదను. అప్పటికి మరల బట్టలు విడుచునని చెప్పెను. వర్తకుడు చాలా బాగున్నదని తలచి తనదగ్గరనున్న డబ్బంతయు వానికిచ్చివేసెను. వాడు చెట్టుపైనున్న బట్టల్ని తీసికొని ఈ చెట్టు నీకమ్ముట వలన నాకెంతయో నష్టము కలుగుచున్నది అయినప్పటికి నీ కొడుకు పెళ్లికై దీని నిచ్చి వేయుచున్నాను. దీనిపై పిట్టలను మాత్రము వాలనీయకుమని చెప్పి వెళ్లి పోయెను.

దారిలో వానికొక పకీరు కన్పించి నీకీ బట్టలెక్కడివని ప్రశ్నించెను. నాలుగైదు మైళ్లదూరంలో రాజు గారొకరు బీదలకు తానులకు తానులు దానము చేయుచున్నారు. నీవు కూడ కావలసిన తెచ్చుకొమ్మనెను. అయ్యా ఈ గుఱ్ఱమును చూచిన రాజు బట్టల నీయడేమో దీనిని కొంచెము చూచు చుండుడని చెప్పి పకీరు వెళ్లి పోయెను. పకీరు వెళ్లగనే వీడా గుఱ్ఱముపై నెక్కి ఒక యేటి ఒడ్డున చేరుకొని అచ్చట ప్రజలను ఈ ఒడ్డునుంచి ఆ ఒడ్డుకు దాటించుచుండెను.

ఒక ముసలమ్మ తన కూతురును తీసికొని అవతలి ఒడ్డు చేర్చమని వీని నడిగెను. ఇద్దరినీ ఒక మారు దాటించలేనని చెప్పి నిన్ను దాటించి తరువాత ఆమెను తీసికొని వచ్చెదననెను. ముసలమ్మ అట్లేయని నీపేరెవరని ప్రశ్నించెను. దాని మొగుడని నమాధానము చెప్పెను. ముసలమ్మ నావలి ఒడ్డున దింపి ఆపిల్లను గుఱ్ఱముపైకూర్చుండబెట్టుకొని గబగబ తన ఊరివైపు తీసికొని పోయెను. ముసలమ్మ తనపిల్ల ఎంతకీ రాకపోవుటచే ఏడ్చుచు పోలీసులతో నా పిల్లను దాని మొగుడు తీసికొని పోయెనని ఫిర్యాదు చేసెను. అంతట వారు దాని మొగుడు దానినితీసికొనిపోయిన నీ వెందుకమ్మా ఏడ్చుట అని నవ్వి వెళ్లిపోయిరి.

ఈ టక్కరి ఆపిల్లను బట్టలు, గుఱ్ఱము డబ్బు తీసికొని వాళ్లఅమ్మ దగ్గరకువెళ్లి తెచ్చినవన్నీ జూపించెను. ఆమె కొడుకు తెలివికి ఆనందించుచుండ మరల నాపెళ్లెప్పుడమ్మా అని ప్రశ్నించెను. ఇప్పుడే నాయనా అని ఆమె వారిద్దరికి వివాహము చేసెను. ★

"ఉద్యోగం లేదా ఏం?"

"నేనూ మా యజమానీ మాటామాటా అనుకున్నాం. ఆయన తనమాట ఉపసంహరించుకోలేదు.''

"ఏమి టా మాట?''

'' 'నిన్ను డిస్మిస్ చేశాను,' అన్నాడు.''

కౌంట్ ఆఫ్ మాంట్‌క్రిస్టో

(8-వ పేజీ తరువాయి)

మారెల్ కొంచెం తటపటాయించాడు. తరవాత "రెండు మాసాలు" అన్నాడు.

"సరే. మీకు మూడు మాసాలు గడువిస్తాను. సెప్టెంబర్ 5 వ తేదీవరకూ. ఆ రోజుని సరిగ్గా ఉదయం 11 గంటలకి—అంటే ఈ వేళకే—మీ దర్శనం చేసుకుంటాను."

"తప్పకుండా. ఆ గడువుకి నేను ధనమైనా ఇస్తాను. లేదా చచ్చిపోతాను." ఈ మాటలనేటప్పుడు అతని గొంతుక బిగుసుకుపోయింది.

కొత్త బిల్లులు వ్రాయబడినాయి. పాతవి చింపి ముక్కలు చేశారు. మూడు మాసాలలో ఓడయజమాని తన సంపదనంతా పోగుచేసి ధనం చెల్లించాలి.

మెట్లవద్ద బ్రిటిష్ దేశస్థునికి జూలీ ఎదురయింది. ఆమె మెట్లు దిగుతున్నట్లు కనపడింది. కాని నిజానికి అతనికోసం ఎదురు చూస్తోంది.

భక్తితో అతనికి నమస్కరించింది. ఆమెనోట మాట రా లేదు. బ్రిటిష్ దేశస్థుడు అతిమెల్లిగా ఆమెతో అన్నాడు. "మీకు 'సింద్‌బాద్' అనే సంతకంతో ఒక రోజుని ఉత్తరం వస్తుంది. ఆ ఉత్తరంలో ఉన్న ప్రకారం, అక్షరాలా చెయ్యండి. అది ఎంత వింతగా కనపడినాసరే మానవద్దు."

"అలాగేనండి" అంది జూలీ.

"మంచిది. నేను వెడుతున్నాను. మీ రెప్పుడూ న్యాయం తప్పకుండా ఉంటే, భగవంతుడే తప్పక మేలుచేస్తాడని మరవకండి. ఇమాన్యూల్‌ని పెళ్ళిచేసుకుని సుఖపడగలరు." ఈ మాటలు చెప్పి నూతనవ్యక్తి మెట్లుదిగి వెళ్ళిపోయాడు. కింద అతనికి పెనిలన్ కనపడ్డాడు. అతని రెండు చేతుల్లో నూరు ఫ్రాంకుల చొప్పున ఉన్నాయి. తీసుకు వెళ్లిపోడమా లేక ఇచ్చెయ్యడమా అని నిర్ధారించుకోలేకుండా ఉన్నట్లు కనపడ్డాడు. బ్రిటిష్‌దేశస్థుడు అతనితో అన్నాడు: "నాతో ఒకసారి రండి. మీతో మాట్లాడవలసినపని ఉంది."

30

ఆగకుండా థామ్సన్ ఎండ్ కంపెనీ ఏజంటు మూడు మాసాలు గడువివ్వడంతో, తన నింక శనిగ్రహం విడిచిపెట్టే శాడనీ, మళ్ళీ మంచిరోజులు వస్తాయనీ మారెల్ భావించాడు. దీన్నిగురించి ఆలోచించినకొద్దీ అతనిపట్ల ఏజంటుకి ఎందు కింత దయకలిగిందో బోధపడ్డంలేదు. బహుశా ఇందులో స్వార్థమింత ఉండవచ్చునని మాత్రమే అతనికి తోచింది. "మూడు లక్షల ఫ్రాంకు లివ్వవలసిన మనిషిని ఇప్పుడు నాశనంచేసి తెచ్చుకునే నష్టానికి ఆ ఫలు, మూడు మాసాల తరవాత మూడు లక్షలూ తీసుకోడం మంచిది. అని ఏజంటు తల్చిఉంటా" డనుకున్నాడు.

అతని దురదృష్టవశాత్తూ, వ్యాపారబాంధవ్యం కలఇతరులు ఇంతవరకూ కృతఘ్నతవల్లకానీ, గుడ్డితనంవల్లకానీ ఈపాటి నమ్మకం చూపలేకపోయారు. ఒకదాని తరవాత ఒకటిగా తగిలిన ఈ దెబ్బలకి అతను తట్టుకుని నిలవలేడని మార్సెల్స్‌లో వ్యాపారులనుకున్నారు. కాని నెల తిరిగేసరికి మారెల్‌కంపెనీలో ఎప్పటి మాదిరిగానే గడువులోపల చెల్లింపులు సాగిపోతూఉండడంతో అందరికీ అమితమైన ఆశ్చర్యం కలిగింది.

అయినా వ్యాపారులికి పూర్తి నమ్మకం కలగలేదు. నెల పూర్తయేసరికి అతని లెక్కల్లో పెద్దలోటు కనిపించితీరుతుం దనుకున్నారు.

ఆ నెల గడిచిపోయింది. మారెల్ తనకు గల ఆధారాలన్నిటినీ కూడదీసుకోడానికి బ్రహ్మాండమైన కృషి చేశాడు. ఇదివరలో అతని సంతకంతో వచ్చే ఏ బిల్లయినాసరే, ఏ తేదీదైనాసరే ఇట్టే మన్నించబడేది. ఇప్పుడతను తొంభైరోజులలోపుకే బిల్లు లిస్తున్నాడు. కాని ఇతని బిల్లులు వెళ్లేసరికి బాంకులు మూసేసిఉండేవి. అయితే చేతిలో కొద్దిగా డబ్బు తిరుగుతూఉండేది. దానితోనే జూలై నెలాఖరువరకూ గడిపాడు.

థామ్సన్ ఎండ్ ఫ్రెంచ్ కంపెనీ ఏజంటుమాత్రం ఆ తరవాత మళ్లీ మార్సెల్స్‌నగరంలో కనపడలేదు. ఫరావోనావికులు వేరే ఎక్కడో కుదురుకున్నట్లున్నారు. అందరూ ఒక్కసారే కనపడకుండా మాయమైనారు.

వ్యాపారాన్ని వృద్ధిపరచడానికి మారెల్ ఆగస్టుమాసంలో కృషి చేశాడు. ఆగస్టు 20 వ తేదీని అతను గుర్రాలబండి ఎక్కడం కొందరు చూశారు. ఈ నెలాఖరుకైనా మారెల్ ధనం లేక చెల్లింపులు కట్టిపెట్టక తప్పదనుకున్నారు. అటువంటి సమయంలో నగరంలో ఉండలేక ముందే వెళ్లిపోయినాడనుకున్నారు. వ్యాపారమంతా కొక్లేకీ, ఇమాన్యూల్‌కీ విడిచిపెట్టాడని అందరూ భావించారు. కాని ఎవ్వరెన్ని భావించినా, ఆగస్టు 31 వ తేదీకి మారెల్ కంపెనీ సక్యంగానే వ్యాపారం చేస్తోంది. కొక్లే అతని కుర్చీలో ఎప్పటిమాదిరిగానే కూర్చున్నాడు. చేతి కిచ్చిన బిల్లుల్ని శ్రద్ధగా పరిశీలించి గడువుదాటకుండా డబ్బు చెల్లిస్తూనే ఉన్నాడు. ప్రజల కిదంతా ఏమిటో అర్థంకాలేదు. సెప్టెంబర్ ఆఖరుకైనా దివాలాతియ్యక తప్పదని మళ్ళీ అనుకున్నారు.

ఒకటో తేదీని మారెల్ పారిస్‌నించి తిరిగివచ్చాడు. అతని కోసం అతని కుటుంబమంతా ఆత్రుతతో వేచిఉన్నారు. ఈ ప్రయాణంవల్ల ఉపకారం కలుగుతుందని ఆశతో ఉన్నారు.

తనవల్ల స్పానిష్ బాంకర్‌కి సిఫార్సు పొంది ఉద్యోగం సంపాదించి, ఆ సహాయంవల్లనే ఇప్పుడు లక్షాధికారైన డాంగ్లర్ సహాయంచేస్తాడని మారెల్‌కి తట్టింది. డాంగ్లర్‌ని సహాయం అడగాలనే అభిప్రాయం మారెల్‌కి చాలకాలంగా ఉంది. కాని ఏదో తెలియరాని సంకోచంవల్ల ఇంతవరకూ వెనకాడాడు. చిట్టచివరికి, ఇంక గత్యంతరం లేదనుకున్నప్పుడు మాత్రం సహాయం అర్థించాడు. కాని అతని సందేహం రూఢయింది. తిరస్కారంవల్ల కలిగిన పరాభవంతో ఇప్పుడు తిరిగి వచ్చాడు. కాని ఒక్క పరుషమైన మాట కాని దూషణవాక్యం కాని అతని నోటివెంట రాలేదు. తన గదిలోకి వెళ్లి కూర్చుని కొక్లేని రమ్మని కబురు పంపాడు.

"ఇంక మన పని కూలిపోయినట్లే" అన్నారు స్త్రీలిద్దరూ ఇమాన్యూల్‌తో. ముగ్గురూ కొద్దిసేపు సంప్రదించారు. నైమ్‌లో ఉన్న తన సోదరుని వెంటనే రావలసిందిగా జూలీ ఉత్తరం వ్రాయాలని నిర్ణయించుకున్నారు. ఇంత దెబ్బకి తట్టుకోవాలంటే కావలసిన వాళ్లందరూ దగ్గరుండడం అవసరమని స్త్రీలు భావించారు. అదీకాక మాక్సిమిలియన్‌కి వయస్సు ఇరవైరెండేళ్లేఅయినప్పటికీ, అతనిమాటంటే తండ్రికి మంచి గురి ఉంది. అతను సరళవర్తన గల యువకుడు. దృఢచిత్తుడు. అతని భవిష్యజ్జీవనం గురించిన ప్రశ్న వచ్చినప్పుడు తండ్రి అతన్నే ఎంచుకో

వచ్చుని స్వేచ్ఛ నిచ్చాడు. మాక్సిమిలియన్ సైన్యంలో చేరాలనుకున్నాడు. అందువల్ల కష్టపడి ఎకోల్ పాలిటెక్నిక్‌లో విద్య నభ్యసించాడు. తరవాత సబ్ లెఫ్టినెంట్‌గా సైన్యంలో చేరాడు. ఏడాదినించి ఈ హోదాలో ఉన్నాడు. త్వరలోనే లెఫ్టినెంట్ కాగల వీలుంది. సైన్యంలో అతను అతిశ్రద్ధగా నియమాలు పాటించే యువకుడని పేరు తెచ్చుకున్నాడు.

ఇప్పుడీ కష్టసమయంలో ఆదుకోవలసిందని అతన్ని తల్లీ చెల్లెలూ కోరారు. పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో వాళ్లకి తెలుసును. మారెల్ పిలవగా గదిలోకి వెళ్లిన కాస్సే ఇంతలోనే రావడం వాళ్లు చూశారు. అతని ముఖం పాలిపోయింది. మనిషి కంపించిపోతున్నాడు. తరవాత కాస్సే చిఠా ఆవర్జాలు, ఒక తోలుసంచి, ఖజానాపెట్టి తీసుకుని మళ్లీ గదిలోకి వెళ్లాడు.

మారెల్ పుస్తకాలు తిరగేశాడు. తోలుసంచిలో చూసుకున్నాడు. పెట్టిలో ధనం ఎంతుందో లెక్క చూశాడు. వచ్చేదీ ఉన్నదీ చూస్తే మొత్తం పధ్నాలుగు వేలుంది. చెల్లించవలసింది రెండులక్షుల ఎనభైఏకున్నర వేలకి తేలింది.

భోజనంసమయంలో మారెల్ ప్రశాంతంగా ఉన్నాడు. కాని ఈ ప్రశాంతతే స్త్రీలిద్దరికీ అపరిమిత భయకారణమయింది. రాత్రి పడింది. ఇద్దరూ అతన్ని గమనిస్తున్నారు. పలకరిస్తా డనుకున్నారు. కాని పలకరించకుండానే తన గదిలోకి నిశ్శబ్దంగా వెళ్లిపోయాడు. తలుపులు మూసుకున్నాడు.

మారెల్‌భార్య జూలీని పడుకోమని పంపివేసింది. అరగంటతరవాత కాలిజోళ్లు తీసివేసి, రవంతైనా చప్పుడు కాకుండా నడిచివెళ్లింది. గదితలుపు తాళపు రంధ్రంలోనుంచి చూసింది. కాని ఇంతలోనే తనముందు ఎవరో చప్పుడు కాకుండా వెళ్లిపోతున్నట్లు కనిపెట్టింది. ఆమె ముందుకు వెళ్ళి చూసేసరికి జూలీ కనపడింది. "వ్రాసుకుంటున్నాడు" అంది జూలీ గుసగుస మాటల్లో. ఇద్దరికీ ఒకేసారి ఒకేభావం తోచింది—అతను మరణశాసనం వ్రాస్తున్నాడని.

ఆ మరునాడు ఉదయంకూడా మారెల్ ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించాడు. మామూలుగానే తన గదిలో కూర్చున్నాడు. ఆహారం తీసుకునేవేళకి మాత్రం గది కదిలివస్తున్నాడు. ఆ రాత్రి భోజనంఅనంతరం కుమార్తెను పిలిచి ప్రక్కను కూర్చోపెట్టుకున్నాడు.

తండ్రి నిశ్చలంగాఉన్నట్లు పైకి కనపడినా, గుండెలు బ్రద్దలౌతున్నట్లు కొట్టుకుంటున్నాయని ఆమె తల్లికి చెప్పింది. ఇలాగే రెండురోజులు గడిచాయి. సెప్టెంబర్ నాలుగోతేదీ సాయంకాలం మారెల్ తన గది తాళంచెవి ఇవ్వాలని రూక్షస్వరంతో కూతుర్ని అడిగాడు. అతని స్వరం విని జూలీ ఉలిక్కిపడింది. ప్రతి రాత్రీ తాళంచెవి ఆమెకే ఒప్పగించేవాడు తండ్రి. ఆ రాత్రి తన చేతి కిమ్మని ఎందు కడిగాడు? ఆమెచిన్నతనంలో ఆమెని దండించడానికి మాత్రమే అలా అడిగేవాడు. ఆమె అతనివంక చూసింది. "నా గదిలో మరిచిపోయాను." అని చెప్పి వెళ్ళిపోయింది. కాని తిన్నగా తన గదికి వెళ్లడానికిబదులు జూలీ మేడ దిగి ఇమాన్యూల్‌దగ్గర కెళ్ళింది. "ఆ తాళంచెవి మాత్రం ఆయన కివ్వవద్దు" అన్నాడు ఇమాన్యూల్. "రేపు పొద్దున్న ఒక్కక్షణం ఆయన్ని విడిచివెళ్లకు." అన్నాడు. ఎందుకని అతన్ని అడిగింది. కాని అత నంతకంటె చెప్ప లేదు.

తెల్లవారుజామున మూడుగంటలవరకు మారెల్ తన గదిలో పచార్లు చేస్తున్నట్లు భార్య గమనిస్తూనే ఉంది. చివరికి పడకమీద గుభాలున పడి నిద్రపోయాడు. స్త్రీలిద్దరూ భయంతో రాత్రంతా ఒకరి నొకరు విడవకుండా గడిపారు. సాయంకాలంనించి మాక్సిమిలియన్ వస్తాడని నిరీక్షిస్తున్నారు.

ఉదయం ఎనిమిది గంటలకి మారెల్ మేడ దిగివచ్చాడు. రాత్రంతా మేలుకున్నట్లు అతని ముఖమే స్పష్టంగా చెపుతోంది. ముఖం బొత్తిగా వాడిపోయింది. ఆ పూట భార్యపట్ల మరీ దయతో ఉన్నాడు. కుమార్తెపట్ల మరింత ప్రేమ చూపాడు.

ఇమాన్యూల్ సలహాని జూలీ మరిచిపోలేదు. తండ్రి వీధిలోకి వెడుతున్నప్పుడు ఆమె వెంట వెళ్లడానికి ప్రయత్నించింది. కాని బుజ్జగిస్తూ, ఆమెని వారించాడు. "మీ అమ్మతో ఉండు" అన్నాడు. ఇంత స్థిరభావంతో అతను కుమార్తెతో మాట్లాడ్డం ఇన్నాళ్లకిదే మొదటిసారి. కాని ఆమెపట్ల అతని ప్రేమ రెండింతలు వ్యక్తమయింది. జూలీ పట్టుదల వహించలేకపోయింది.

మరుక్షణంలో హఠాత్తుగా తలుపులు తెరుచుకున్నాయి. ఆమె నెవరో పట్టుకున్నారు. ఆమె నుదుటిని ముద్దుపెట్టుకున్నారు. తలెత్తి చూసింది. "అన్నా!" అని బిగ్గరగా కేక వేసింది.

జూలీకేక విని తల్లి వచ్చింది. కుమారుని చేతుల్లో వాలిపోయింది. "జూలీ, వెళ్లి మీ నాన్నకి చెప్పు మాక్సిమిలియన్ వచ్చాడని" అంది తల్లి. జూలీ రెండు అంగల్లో గది దాటిపోయింది. కాని ఆమెకి మేడమెట్లమీద ఒక వ్యక్తి ఎ[illegible]యానాడు. అతని చేతిలో ఒక ఉత్తరం ఉంది. "జూలీ అంటే మీరేనా?" అన్నాడు. అతని మాటవరస చూస్తే ఇటాలియన్ దేశస్థుడనుకోవాలి.

"అవునండి" అంది జూలీ.

"ఈ ఉత్తరం చదవండి. మీ తండ్రి క్షేమం దీనిపైన ఆధారపడి ఉంటుంది."

జూలీ తటాలున ఉత్తరం లాక్కుని విప్పిచూసింది. అందులో ఇలా ఉంది:

"వెంటనే మైలాన్ వీధిలో 15వ నంబరుఇంటికి వెళ్లు. మేడమీదిగది తాళంచెవి అడిగి దర్వాన్ వద్ద తీసుకో. ఆ గదిలో కిటికీలో ఒకమూల ఎర్రఊలుతో అల్లిన పర్సు ఒకటుంటుంది. అది తీసుకెళ్లి వెంటనే నీ తండ్రి కియ్యి. అది ఇవాళ పదకొండు గంటలకి ముందే ఆయన చేతి కందడం అవసరం. నేను చెప్పినది మరొకమాట చెప్పకుండా చేస్తానని నాకు మాటిచ్చావు. ఆ మాట జ్ఞాపకం ఉంచుకో—సింద్‌బాద్."

జూలీ ఆనందంతో ఒక్క వెర్రికేక పెట్టింది. తలెత్తి చూసింది, కాని ఉత్తరం ఇచ్చిన వ్యక్తి అక్కడ లేడు. మళ్ళీ ఉత్తరంచూసింది. కింద మరికొన్ని వాక్యాలు కనిపించాయి.

"నువ్వు స్వయంగా ఈపని చెయ్యాలి. ఒంటరిగానే వెళ్లాలి. నీతోకూడా ఇంకొక రున్నా, లేక నీకు బదులు మ రెవరిని పంపినా, తన కేమీ తెలియదని దర్వాన్ చెపుతాడు."

దీనితో ఆమె ఉత్సాహం సగంపోయింది. ఇందులో కుట్ర ఏదైనా ఉందా? ప్రమాద మేమైనా ఉందా? ఆ వయస్సులో ఉన్న యువతులికి ఎటువంటి ప్రమాదాలు సంభవించగలవో ఆ అమాయికకు తెలియదు. జూలీ కొంచెం సందేహించింది. సలహా తీసుకోవా లనుకుంది. కాని చిత్ర మేమిటంటే, ఆమె తన తల్లినికాని, అన్ననికాని సలహా అడగలేదు. ఇమాన్యూల్‌ని అడిగింది.

"నువ్వు తప్పకుండా వెళ్లాలి జూలీ, నేను నీతోకూడా వస్తాను" అన్నాడు ఇమాన్యూల్.

"కాని నేను ఒంటరిగా వెళ్లాలనుంది ఉత్తరంలో" అంది జూలీ.

"లోపలికి ఒంటరిగానే వెళ్లవచ్చును. నేను వీధిమొగలో నీకోసం నిలబడిఉంటాను. నువ్వు తిరిగిరావడం ఆలస్యమైతే, అప్పుడు నేను లోపలికి వస్తాను."

"అయితే నేను తప్పకుండా వెళ్ళవలసిందేనా ?"

ఇమాన్యూల్ క్షణంసేపు ఆలోచించాడు. కాని వెంటనే ఏదో ఒకటి చెప్పెయ్యాలి. ఇలా అన్నాడు. "ఇటు విను. ఇవాళ తేదీ సెప్టెంబర్ ౫ కాదూ ?"

"అవును"

"ఇవాళ పదకొండు గంటల్లోగా ఎవ్వరూ మీ తండ్రికి సహాయం చెయ్యలేకపోయినట్లయితే, దివాలాతీసినట్లు ప్రకటించాలి కాదూ ?"

"అవునవును. అయితే త్వరగా రా, వెళ్లిపోదాం" అంది జూలీ.

ఇంతలోగా మారెల్ భార్య కుమారునికి తమ కష్టాలన్నీ వివరించిచెప్పింది. మాక్సిమిలియన్ ఆశ్చర్యపడ్డాడు. గబగబా తండ్రి గదికివెళ్లి తలుపు తట్టాడు. తండ్రి అక్కడ లేడు. మెట్లెక్కి అప్పుడే వస్తున్నాడు. కాని కొడుకుని చూడలేదు. మారెల్ తన గదికి వెళ్లేబదులు పడకగదికి వెళ్లాడు. తిరిగి వెంటనే వస్తూ కొడుకుని చూశాడు. ఆశ్చర్యపడి గబగబా అడుగులేసుకుంటూ వచ్చాడు. ఇద్దరూ ఒకరినొకరు కౌగలించుకున్నారు. కాని మాక్సిమిలియన్ ఉలిక్కిపడి వెనక్కి తగ్గాడు. తడబడుతున్న మాటలతో "ఇదేమిటి నాన్నా ? రెండు పిస్తోళ్లు కోటులో దాచుకున్నారేమిటి ? అన్నాడు.

కొడుకువంక నిదానంగా చూసి, "మాక్సిమిలియన్, నువ్వు పెద్దవాడవైనావు. ఇప్పుడు నువ్వు పురుషుడవ్. నీతైన వాడవు. అంతా చెప్తాను రా." అన్నాడు.

మారెల్ తన గది ప్రవేశించాడు. మాక్సిమిలియన్ అతన్ని అనుసరించాడు. తండ్రి కోటులోనించి పిస్తోళ్లు రెండూ తీసి మేజామీద ఒక చివర పెట్టాడు. గది తలుపులోగడియ వేసి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. తెరిచి ఉంచిన చిట్టాపుస్తకం కొడుక్కి వేలితో చూపాడు. ఈ పుస్తకంలో వాస్తవ పరిస్థితి లెక్కల్లో వ్రాసిఉంది. ఇంకొక అరగంటలో మారెల్ రెండులక్షల ఎనభైఏడున్నర వేల ఫ్రాంకులు చెల్లించాలి. అతనివద్ద ఉన్నది పదిహేను వేల రెండు వందల ఏభైయేడు ఫ్రాంకులే ఉంది.

"అది చూడు" అన్నాడు మారెల్.

యువకుడు గబగబా చూసి విస్తుపోయాడు.

"ఈ కష్టం గట్టెక్కడానికి చెయ్యవలసినదంతా చేశారా?" అన్నాడు యువకుడు.

"చేశాను" అన్నాడు మారెల్.

"అంటే అరగంటలో ఇంక మన పరువంతా బుగ్గైపోయినట్లేనా ?"

"అపఖ్యాతిని నెత్తురు కడిగివెయ్యగలదు," అన్నాడు మారెల్.

"అవును నాన్నా ! నాకు అర్థమయింది." అన్నాడు మాక్సిమిలియన్. పిస్తోళ్లవంక చేతులుచాచి, "ఒకటి మీకు, ఇంకొకటి నాకు" అన్నాడు.

మారెల్ అతని చేతిని అడ్డగించాడు.

"నీ తల్లీ, చెల్లెలూ ఉన్నారు. వాళ్లనెవరు చూస్తారు?" అన్నాడు మారెల్.

యువకుడొక్క క్షణం యోచించాడు. అతని ముఖంలో నిస్పృహ వచ్చింది. కళ్ళు భారంగా వాలిపోయాయి. మెల్లిగా లేచి కోటుపైనున్న సైనికహోదా చిహ్నాలు తీశాడు. తండ్రివంక చెయ్యిచాపి "అలాగే కానివ్వండి, నాన్నా ! మనశ్శాంతితో దేహం త్యజించండి. నేనే బ్రతుకుతాను" అన్నాడు.

మారెల్ ధ్యానపూర్వకంగా మోకాళ్లపైన వాలబోతున్న సమయంలో, మాక్సిమిలియన్ వృద్ధుణ్ని రెండు చేతులా లేవనెత్తి పరిష్వంగం చేసుకున్నాడు.

"నావల్ల దోషంలేదని నీకు తెలుసుకదా !" అన్నాడు మారెల్.

"తెలుసు నాన్నా ! తెలుసు. ఎప్పుడూ మీరు ఉత్కృష్టమైన నీతినే అనుసరించారు."

"అది చాలు నాకు. అంతే. ఇంక అంతా అయిపోయినట్లే. నువ్వింక నీ తల్లి చెల్లెళ్లవద్దకు వెళ్లు."

కుమారుడు మోకాళ్ళపై వొంగి తండ్రికి నమస్కరించాడు. "నాన్నా నన్ను ఆశీర్వదించండి" అన్నాడు. కుమారుని శిరస్సు రెండుచేతులా పట్టుకున్నాడు మారెల్. వంగి అతని తల ముద్దుపెట్టుకున్నాడు. "అవును నాయనా ! నిన్నాశీర్వదిస్తున్నాను. మూడు తరాల నీతివంతులు నిన్నాశీర్వదిస్తున్నారు. నా నోటితో వారు ఆశీర్వచనాలు పలుకుతున్నారు. విను నాయనా ! దురదృష్టంవల్ల కూలిపోయినదాన్ని భగవంతుడే తిరిగి నిలబెడతాడు. నేనిటువంటి చావు చచ్చిపోతున్నాను. ఎంతటి కఠినాత్ములకైనా జాలి కలగకపోదు. నాకు లభించని ఫలం నీకైనా దొరకవచ్చును. నువ్వు యువకుడవ్. పాటుపడి పనిచెయ్యి. ధైర్యంతో ప్రపంచంలోకి దూకు. పొదుపుగా నువ్వు, నీ తల్లి, చెల్లెలు గడపండి. ఇప్పుడు మిగిలిన ధనమే పెరిగి నీ చేతిలో పండి మీకు ఐశ్వర్యం లభిస్తుంది. ఆలోచించు. ఇక్కడనే ఈ ఆఫీసులో నే నిలిచి 'నా తండ్రి చెయ్యలేకపోయినదానిని నేను చేశాను. నేను చెయ్యవలసిన అవసరం ఉందని తెలిసే నా తండ్రి చనిపోయాడు' అని నువ్వు చెప్పగలగాలి."

యువకుడు బాధతో మూలిగాడు. ఇంక గత్యంతరం లేదని అతనికి ధృవపడింది. హృదయంలో పొంగివస్తున్న దుఃఖాన్ని అతని ఆత్మవిశ్వాసం జయించింది.

"ఇంక నువ్వు వెళ్లిపో. నీ తల్లినీ నీ చెల్లెలినీ దూరంగా తీసుకుపో" అన్నాడు మారెల్.

"నాకింక చెప్పవలసినదేమీ లేదా నాన్నా?" అన్నాడు మాక్సిమిలియన్ దీనంగా. మాటలు నోటిని పెగుల్చుకుని వస్తున్నాయి.

"ఉంది నాయనా. ఒక పవిత్రకార్యం ఉంది."

"చెప్పండి."

"దాక్షిణ్యంవల్లకానీ స్వార్థంవల్లకానీ, థామ్సన్ ఎండ్ ఫ్రెంచ్ కంపెనీ ఒక్కటే నాపట్ల దయతో ఉంది. అది స్వార్థమో దాక్షిణ్యమో ఇతరుల హృదయాలు కనిపెట్టేపని నాది కాదు. ఆ కంపెనీ ఏజంటు ఇక్కడికిప్పుడే వస్తాడు. రెండు లక్షల ఎనభైఏడున్నర వేల ఫ్రాంకులికి బిల్లు ఇస్తాడు. నాకు అతనిచ్చిన మూడు మాసాల గడువు ఈ పూటతో తీరిపోయింది. ముందుగా ఈ బిల్లు చెల్లించి, ఆ ఏజంటుని ఆదదరించు నాయనా"

"అలాగే చేస్తాను నాన్నా."

"ఇంక నన్ను ఒంటరిగా విడిచిపెట్టివెళ్ళిపో. నేనొంటరిగా ఉండాలి. నా మరణశాసనం నా డ్రాయర్లో ఉంటుంది."

యువకుడు ఇంకా కదలలేదు. అతనికి కదిలే సత్తువ పోయినట్లుంది.

"ఇటు విను మాక్సిమిలియన్" అన్నాడు మారెల్. "నేనూ నీ మాదిరిగానే సైనికుడి ననుకో. నేనొక యుద్ధవ్యూహంలో ఒక రంగాన్ని యుద్ధం నడుపుతున్నాననుకో. ఆ ప్రయత్నంలో నే నెలాగూ చచ్చిపోకతప్పదని నీకు తెలిసినపక్షంలో, నువ్వే మంటావ్? 'వెళ్లు నాన్నా! ఆలస్యమైతే అపఖ్యాతి రాగలదు. అపఖ్యాతికంటె చావు మేలు' అని చెప్పవా?"

"అవును" అన్నాడు యువకుడు బిగ్గరగా. తండ్రిని గాఢ పరిష్వంగం చేసుకుని "వెళ్లు నాన్నా!" అన్నాడు. తరవాత తండ్రిని వీడిచి, ఒక్క ఉదుటున గది విడిచి వెళ్లిపోయాడు.

మారెల్ దృష్టి ద్వారంవైపే నిశ్చలంగా ఉంది. తరవాత చేగంట మోగించాడు. వెంటనే కొక్లే ప్రత్యక్షమైనాడు. అతను బొత్తిగా మారిపోయినాడు. ఈ మూడురోజుల అనుభవం అతని ఆత్మవిశ్వాసాన్ని భగ్నపరిచింది. మారెల్ కంపెనీ ఇంక చెల్లింపులు కట్టిపెడుతుందనే భావం అతన్ని కుంగదీసింది. అకస్మాత్తుగా ఇరవై యేళ్లు పైబడినట్లున్నాడు.

మారెల్ అతన్ని చూసి "కొక్లే" అని పిలిచాడు. అతని మాటలిలా ఉన్నాయని వర్ణించ తరంకాదు.

"కొక్లే, నువ్వు వరండాలోనే ఉండు. థామ్సన్ ఎండ్ ఫ్రెంచ్ కంపెనీ ఏజంటుని నువ్వు మూడుమాసాలకిందట చూశావు. జ్ఞాపకం ఉందనుకుంటాను. అతను రాగానే నాకు వెంటనే తెలియపరుచు."

. . కొక్లే, సమాధానం చెప్పలేదు. శిరస్సు వంచుకున్నాడు. మెల్లిగా వెళ్లి వరండాలో బెంచిమీద కూర్చున్నాడు.

మారెల్ కుర్చీలో కూలిపోయాడు. అతనికళ్లు గడియారం మీదికి మళ్లాయి. ఇంక ఏడునిమిషాల వ్యవధిమాత్రం ఉంది. నిమిషాల ముల్లు అతి వేగంతో తిరుగుతున్నట్లుంది.

ఇప్పు డీవ్యక్తి మనస్సులో ఎటువంటి ఆలోచనలు తిరుగుతున్నాయో చెప్పడం కష్టం. వయస్సా బ్బై మీరలేదు. కాని అతి చిత్రమైన హేతుబుద్ధివల్ల, తాను జీవితంలో పరమార్థమనుకున్న సర్వాన్నీ, సంసార సుఖానురాగాల్నీ విడిచి, సర్వ బంధాలూ తెంచుకొనిపోవడానికి సమకట్టాడు. మనోవ్యథవల్ల వసివాడినా, అతని ముఖంలో వైరాగ్యజనితమైన ఒక నిశ్చలభావం వ్యక్తమౌతోంది. దుఃఖాశ్రువులతో నిండినా, అతని నేత్రాలు ఊర్ధ్వముఖంగా భగవంతునివంక తిరిగినాయి.

గడియారం ముల్లు నిమిషాలపై దూకుతోంది. పిస్తోళ్లు గుండ్లతో నింపబడ్డాయి. ఒక చెయ్యి చాచి ఒక పిస్తోలు తీశాడు. తన ప్రియతనయ పేరు ఉచ్చరించాడు. ఆ ఘోరమారణాయుధాన్ని చటుక్కున వొదిలేశాడు. కలం తీసి కాగితంపైన రెండు వాక్యాలు గీకాడు. తన కుమార్తెవీడ్కోలు పొందలేదనుకున్నాడు. గడియారంవంక చూశాడు. ఇంక లెక్కించడానికి నిమిషాలు లేవు. సెకండ్లుమాత్రం ఉన్నాయి. పిస్తోలు తీసుకున్నాడు. కిందిపెదవి జారింది. దృష్టిని నిమిషాల ముల్లుపైన నిగిడ్చాడు. మీటమీద వేలు మోపుతూ ఆగిపోయాడు.

నుదుటిమీద మృత్యువుశీతలహస్తం సోకినట్లయింది. మరణవేదన గుండెను పిండివేస్తోంది. మెట్లవద్ద తలుపు తెరిచిన చప్పుడయింది. తరవాత తనగదితలుపు తెరచిన చప్పుడయింది. గడియారం పదకొండు గంటలు కొడుతోంది. మారెల్ దృష్టి మరల్చలేదు. ఏజంటు వచ్చినట్లు కొక్లే చెపుతా డనుకున్నాడు. నోరు తెరిచి పిస్తోలు నోటిలోకి గురిపెట్టుకున్నాడు. హఠాత్తుగా కుమార్తె పిలుపు వినవచ్చింది. మారెల్ ముఖం తిప్పి చూశాడు. జూలీ కనపడింది. అతని చేతిలో పిస్తోలు జారిపడింది.

"నాన్నా! నాన్నా!" అని అరిచింది జూలీ. "మనం బతికిపోయాం" అంది. ఆమెకి ఆనందంతో ఊపిరాడ్డంలేదు. తండ్రి వొడిలో వాలిపోయింది. ఆమె చేతిలో ఎర్ర ఊలుతో అల్లిన పర్సు ఒకటుంది. మారెల్ ఉలిక్కిపడ్డాడు. పర్సు అందుకున్నాడు. ఒకప్పు డది తనదే నని అతనికి లీలగా తోచింది. పర్సు తెరిచాడు. ఒక అరలో రెండులక్షుల ఎనభైఏడున్నరవేల ఫ్రాంకుల బిల్లుంది. ఆ ధనం చెల్లించబడినట్లు దానిపైన సంతకం ఉంది. రెండో అరలో ఒక పెద్ద వజ్రం ఉంది. దానిపక్కనే చిన్న కాగితంపైన ఇలా వ్రాసివుంది "ఇది జూలీ కట్నం."

గడియారం గంటలు కొట్టడం పూర్తయింది. అవి అతని గుండెలో మారుమోగుతున్నాయి.

"అమ్మా. ఇది నీ కెక్కడ దొరికింది?" అన్నాడు మారెల్.

"మైలాన్‌వీధిలో ఒక మేడమీద గదిలో కిటికీలో ఉంది."

ఇంతలో మెట్లవద్దనించి మారెల్‌ను ఎవరో పేరుపెట్టి పిలిచారు.

జూలీ తటాలున లేచి నిలబడింది. "ఆయనే! ఆయన గొంతుకే" అంది. వెంటనే ఇమాన్యూల్ ప్రవేశించాడు అతని ముఖంలో ఆనందం తాండవిస్తోంది. "ఫరావో వచ్చింది! ఫరావో!" అన్నాడు బిగ్గరగా.

"ఏమి టన్నావ్? ఫరావో ఏమిటి? నీకు పిచ్చెత్తిందా ఇమాన్యూల్? అది పోయిందని నీకు తెలుసుగా?" అన్నాడు మారెల్.

"లేదండి! అది ఫరావోనౌకే! రేవు చేరుతోంది!"

మారెల్ కుర్చీలో వెనక్కి వాలిపోయాడు. అతనికి సత్తువ పోయింది. ఈ అద్భుతసంఘటనలవల్ల అతని బుద్ధి భ్రమిస్తోంది.

ఇప్పుడు కొడుకు వచ్చాడు.

"నాన్నా! ఫరావో పోయిందన్నా రెందుకు నాన్నా ఇప్పు డది రేవులోకి వస్తోందే?"

"నాయనా! అదే నిజమైతే, అదంతా ఈశ్వరుని అద్భుత లీల కాని మరొకటి కాదు! అది అసంభవం! అసంభవం!" అన్నాడు మారెల్.

కొక్లే వచ్చాడు: "ఇదేమిటండి? ఫరావో అంటున్నారేమిటి?"

"రండి రండి" అన్నాడు మారెల్. "వెళ్ళి అదేమిటో చూద్దాం. అదే అబద్ధమైతే, ఇంక భగవంతుడే మనల్ని కాపాడాలి."

అందరూ గబగబా మెట్లు దిగి వెళ్లారు. కింద మారెల్ భార్య ఎదురయింది. ఆమె ఇంతవరకూ భర్తని చూడ్డానికి సాహసించలేకపోయింది. త్వరలోనే అందరూ కానిబయర్ తీరం చేరారు. రేవుదగ్గర అనేకమంది జనం గుమిగూడారు. మారెల్ రాగానే తప్పుకుని దారి ఇచ్చారు. అందరూ 'ఫరావో వచ్చింది ఫరావో వచ్చింది' అంటున్నారు. రేవుసమీపంలోనే ఆ నౌక కనపడింది. ఓడ మునిముందు తెల్లని పెద్ద అక్షరాల్లో, "ఫరావో, మారెల్ ఎండ్ సన్, మార్సేల్స్" అని వ్రాసి ఉంది. చూసినవాళ్లు వాళ్లే కళ్లని వాళ్లే నమ్మలేకుండా ఉన్నారు. అయినా అదే ఓడ, భారతదేశంనించి నీలిమందు వేసుకుని వచ్చిందీ లంగరు వెయ్యబడింది. డెక్‌మీద కెప్టెన్ ఉన్నాడు. చుక్కానివద్ద పెనిలన్ ఉన్నాడు. మారెల్‌ని చూసి చెయ్యి ఆడించాడు. ఇంక

★ సాహిత్య సింహావలోకనం ★

'గుడ్డి దైవం'

'శ్రీ అమరేంద్ర' గారు రచించిన కథానిక జనవరి భారతిలో ప్రకటింపబడ్డది. దీనిలోని ఇతివృత్తం అతి సహజమయింది. "సామాన్య కుటుంబీకుడైన శాస్త్రి, పుట్టంధుడు మాతృహీనుడైన చిన్నతమ్ముడు మధును చేరదీసి ప్రేమిస్తాడు. భార్య 'కరుణ' కన్నకుమారునిలా పెంచుతుంది. విద్య(సంగీతము) చెప్పించమని ప్రోత్సహిస్తుంది. కాని కన్నకుమారుడే ఆకటిలో నకనకలాడిపోతోంటే స్త్రీ సహజమైన బలహీనతను కనపరుస్తుంది 'కరుణ'. ఇదంతా అప్పుడే వూరినుంచి వచ్చిన మధు వింటాడు. చాలా బాధపడ్తాడు. సహపాఠియైన సుధతో ఎచటికో వెళ్ళిపోతాడు. తరువాత కరుణ చాలా విచారిస్తుంది. భర్తచేత వెతికిస్తుంది. కాని కనపడడు మధు. కొంతకాలానికి తనకే పుట్టంధుడైన పుత్రుడు దయించటంతో ఆమెశోకం కట్టలు తెగుతుంది. భగవత్ప్రసాదం అని మధుని తలచుకొని కుమిలిపోతుంది. దీనిలోని సంభాషణలు అతి సున్నితంగా నడిచాయి. మధుకి వదిన అన్న మాటలకు ప్రాణత్యాగం చేస్తానన్న మధుతో సహపాఠి సుధ అన్నమాటలెంత హృదయవిదారకంగా వున్నాయో చూడండి. "ఛీ! పాడుమాటలు అనవద్దని చెప్పలా. పిరికిపందలాగా మాట్లాడతావేం? మనిద్దరం కలిసి పారిపోదాం. నువ్వు పాడు. నేను ఫిడేలు వాయిస్తాను. దేశదేశాలు పాడుకుంటూ తిరుగుదాం. మనమీద లోకానికి దయకలగదా? మన పొట్టలు నిండక పోతయ్యా?" ఇట్లానే నడచింది రచనంతా.

'అమ్మా! అమ్మా! వస్తున్నా!'

జులైమాసపు భారతిలో ప్రకటింపబడ్డ పై కథానిక శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి గారిది. ఎంతో బాగా వుంది. సంభాషణలను తనే ఆ అవస్థలో నున్నప్పుడు యెన్నివిధమైన భావాలు కల్గుతయ్యో వూహించి నడిపినాడు. రచయిత పాత్రపోషణలో అందె వేసిన చేయి అని ఈ కథానికే నిరూపిస్తోంది. రచయిత యిందులో సమకూర్చిన సంఘటనలు, పాత్రపోషణను పాఠకుడు సరిగా అర్థంచేసికొనటానికి వీలుగా వున్నయ్. మానవ సహజమైన దౌర్బల్యాన్ని *Toilor* వీరాస్వామి, స్త్రీసహజమైన ఓర్పును అతని భార్య కాంతమ్మ, చిన్నతనంలోని పసిభావాన్ని రేవతి ప్రదర్శించారు. అందువలననే పాఠకులను అంతగా ఆకర్షించగలిగిందీ కథానిక.

రావినూతల. రామచంద్రరావు. ఒంగోలు.

'ధర్మకర్తలు'

ఇది 'కరుణ కుమార' గారి కథ. ఆంధ్రదేశంలో గొప్పగా కథలు వ్రాసే నలుగు రైదుగురు కథకులలో 'కరుణకుమార' గారు ఒకరు. విభిన్న మనస్తత్వాలు గల మనుష్యుల్ని వారి కథల్లో మనం చూడవచ్చు - అనేదాంట్లో అతిశయోక్తి ఏమాత్రం లేదు. అటువంటి రకానికి చెందినదే -'ఆంధ్రజ్యోతి'లో వొచ్చిన 'ధర్మకర్తలు' అన్నకథ. పల్లెటూరి యొక్క సాంఘికరాజకీయాలు, ధర్మకర్తలు అని వూళ్లో ప్రతీతిగలవారి మనస్తత్వాలు, వారి విపరీతచర్యలు - పదవులకోసం ఒకళ్ళమీద ఒకళ్లకు మత్సరాలూ, అసూయలూ - మొదలైనవన్నీ ఆ కథలో కళ్లకు కట్టినట్టు, చిత్రించబడ్డయ్. ఆకథలో 'అసహజం' అన్నముక్కకి స్థానం ఎక్కడా కనిపించదు. ఆసంవత్సరం వెలువడిన కథాసాహిత్యంలో ఆకథకి ప్రత్యేకస్థానం యివ్వక తప్పదు.

'చెల్లనినోటు'

డిశెంబరు రెండోవారం 'ఆంధ్రపత్రిక వీక్లీ'లో ప్రచురింపబడిన 'సులోచన' గారి 'చెల్లనినోటు' అన్నకథ కూడా చెప్పుకో తగ్గదే. అందులో అన్నాదమ్ముల మనస్తత్వాలు, తమ్ముడు దుర్వ్యసనాలకు లోనై చెడిపోతూ ఆస్తిని ధ్వంసం చేస్తూంటే - భార్య' అతని అన్న-అతన్ని సత్క్రమమార్గంలోకి తీసుకురావాలనే పాట్లు వర్ణించబడ్డయ్. కాని 'చెల్లని నోటు' ఎంతవరకు చెల్లదో-అతనుకూడా అంతే. అతని కూతురుకు పెళ్ళిచేసే విషయంలో కష్టపడి అతనివల్ల కొసకు అవమానాన్ని పొందుతాడు, అన్న. ముఖ్యంగా ఈకథలో మనం గమనించవలసింది, రచయిత్రి పాఠకలోకానికి ధనాన్ని గురించీ, సమాజంలోని లోటుపాట్లను గురించీ, మధ్యతరగతికుటుంబాల దుస్థితినిగురించీ యిచ్చిన 'ఫిలాసఫీ' గొప్పగా వుంది. ఆ సంవత్సరం వెలువడిన మంచి కథలలో అదికూడా ఒకటి.

'వ్యర్థజీవితం'

ప్రఖ్యాత కథారచయితలైన శ్రీకొడవటిగంటి కుటుంబరావుగారి కథ యిది. 'ఆంధ్రజ్యోతి'లో వెలువడింది. ఇందులో న్యాయానికి కట్టుబడ్డ ఒక వ్యక్తియొక్క జీవితం చిత్రించబడ్డది. 'న్యాయానికి కూడు లేదు' అన్న సామెత యెలా నిజమో కూడ మనం గ్రహించవచ్చు. పాఠకుణ్ని తన కథలోకి లాగి చివరవరకూ ఓపికతో చదివించి తృప్తితో విడిచిపెట్టే నైపుణ్యం కుటుంబరావుగారి కలంలో వుంది.

—టి. యస్. రామయ్య

తమకళ్లని నమ్మకపోవడం ఎలాగ? మారెల్ ఒక్కడే కాదు, పదివేలమంది ఆ నౌకని ప్రత్యక్షంగా చూస్తున్నారు!

మారెల్ కుమారుని కౌగలించుకున్నాడు. చుట్టూ అందరూ ఆనందంతో కోలాహలం చేస్తున్నారు. వారిఆమధ్య ఒక వ్యక్తి పహారాబంక్ చాటున నిలబడి ఈ దృశ్యాన్ని తిలకిస్తున్నాడు అతని సగం నల్లనిగడ్డంలో కప్పబడిఉంది. అతని నేత్రాలలో జాలి, ప్రేమ ఉట్టిపడుతున్నాయి. "మీరు చేసిన సత్కార్యాలకి, మీ సచ్చరిత్రకి భగవంతుడే మిమ్మల్ని ఆశీర్వదించగలడు"అని ఆ వ్యక్తి గొణిగాడు. తరవాత అతను గబగబా జెట్టె ఎక్కి, "జకోపా! జకోపా!"అని పిలిచాడు. వెంటనే జెట్టీదగ్గర కొక తెడ్డుపడవ వచ్చింది. అది ఎక్కి అతను అంత దూరంలో ఉన్న ఒక చక్కని కొత్త బోటువద్దకు వెళ్ళాడు. ఒక్క ఉదుటున బోటులోకి లంఘించాడు. ఆనందం పట్టలేక చుట్టూ నలుగురితో గొడవగా మాట్లాడుతున్న మారెల్ వంక మరొకసారి చూశాడు. తననీవిధంగా రక్షించిన వారెవరో తెలియక మారెల్ మాటిమాటికీ ఆకాశంవంక చేతులెత్తి నమస్కరించడం చూశాడు.

బోటుపైన నిలబడి అపరిచితవ్యక్తి అప్పుడిలా అనుకున్నాడు! "ఇంక చాలు. ఇంతటితో దయాదాక్షిణ్యాలకీ, కృతజ్ఞతకీ స్వస్తిచెప్పు. మార్దవహృదయానికి సహజమైన సున్నిత భావాల నింక మాను. ఉత్తములకుపకృతి చెయ్యడాని కింతవరకూ దేవదూతవలె ప్రవర్తించాను. దుర్మార్గుల్ని శిక్షించడానికి ఇంక దుర్విధిపక్షాన సంచరించాలి." ★

"శేషనింగు కథలు"

ఈ సంవత్సరం మొత్తంలో తెలుగులో అచ్చైన పుస్తకాలెన్నో నేను చదవటం తటస్థించింది. కొత్త పుస్తకాల మోజు నాకు అపరిమితం కావడంచేత కొత్తగా వెలువడి నేను చదవని పుస్తకం (గత నాలు గేండ్లుగా) లేదనే చెప్పవచ్చు. సంవత్సర కాలంలో చదివిన అనేక పుస్తకాల్లో నన్నమితంగా ఆకర్షించిన పుస్తకం కర్నూలులోని, ఫన్‌లాండు ఏజన్సీసు వారు ప్రచురించిన 'శేషనింగు కథలు'.

ఈ పుస్తకం నన్నంతగా ఆకర్షించిన కారణాలు క్లుప్తంగా వ్రాస్తాను. మన వంటుకొనివున్న సమస్యలను తీసుకొని నగ్నంగా చిత్రించగల రచయితలు మనలో చాలా కొద్దిమంది. ప్రపంచ యుద్ధసమయం లో ప్రణయాన్ని గురించి, హిందూముస్లిం తగాదాసమయాల్లో వేదాంత విషయాలనుగూర్చి వ్రాయడం మన రచయితలకు అలవాటు. అందుకు యీ 'శేషనింగు కథల' రచయిత భిన్నంగా వర్తించాడు. తనే సంఘటనలు అనుదినం చూస్తున్నాడో, ఏ వాతావరణాన్ని అర్థం చేసుకొన్నాడో, వాటినే చక్కని భావంతో తేలికైన భాషతో సూటిగా ఘాటుగా యీ పన్నెండు చిన్నకథల్లోనూ వ్యక్తపరిచాడు. బలమైన భావాన్ని భాషద్వారా కాగితాలమీద కెక్కించటం యీ కథకునికి ఒక సుగుణమని పై పుస్తకాన్ని చదివిన ప్రతివారికీ తెలుస్తుంది.

ఈ చిన్నకథల్లో హృద్యంగా సంఘటనలను కళ్లకు కట్టేట్లు చూపేవి, 'కార్డుకోసం', 'అడకత్తెర' 'శేషనింగు మురా' 'మూకేలారకం' 'నిర్దోషి' అన్న కథలు.

ఈ ఐదు కథలూ ఐదు ముత్యాలు. తెలుగు కథాసాహిత్యంలో గౌరవమైన స్థానాన్ని, పొందదగినవి.

'శేషనింగుమురా'లో ప్రజారాజ్యం లోని పౌరుని బాధ్యతను శీతారామయ్య విప్పిచెప్తాడు. అధికారంలో అన్యాయం విశ్వవిహారం చేస్తున్నదంటాడు. ప్రభుత్వం పాలుతాగేపిల్లిఅన్న విషయం తెలుసుకొంటాడు. అంత చిన్నకథలో శీతారామయ్యది ఒక ప్రచండమైన పాత్ర.

'కార్డుకోసం' అన్న కథలో శేషనింగు గుమస్తాల వీపులు తడువుకునేట్లు చేస్తాడు రచయిత. తలవనితలంపుగా వచ్చేమార్పుకి ఆగలేక దుర్వినియోగం చేయడం మానవలక్షణమని యీ కథ బోధిస్తుంది.

'మకీలోకం' కేవలం ధనికుల ప్రాపకంతో బ్రతికే నడిచే అధికారుల కొరడాదెబ్బ. ఇందులో బీదవాడ్ని దబాయిస్తాడు యినస్పెక్టరు. కాని అతనే కౌన్సిలర్ అయ్యాక యినస్పెక్టరే ఆ కౌన్సిలరును నల్లమార్కెటు నేరంనుంచి తప్పించేందుకు ప్రయత్నించాడు.

'అడకత్తెర' బియ్యం మూటలు అమ్ముకునే ఒకడి విచిత్రకథ. పోలీసులు, టిక్కెటు పరిశీలకులు ఒకరికి తెలీకుండా మరొకరు డబ్బు కాజేయడంలో మధ్యన అడకత్తెరలో పడే బీదవాళ్ల కష్టాలను కళ్లకు కట్టినట్లుగా చిత్రించాడు రచయిత.

నిరంతరకృషితో, విశ్వసాహిత్యం లోని అత్యుత్తమ గ్రంథపఠనంతో యీ రచయిత తెలుగు కథకుల్లో ఒక అత్యుత్తమ రచయితగా మరికొంత కాలానికైనా పరిగణింపబడ్డం నిర్వివాదాంశం.

వి. శంకరశాస్త్రి,
కొత్తకోట.

అతిథి సత్కారం

రచన - కొడవటిగంటి

ఈ నాటికలోని శిల్పము పాత్రపోషణ సాధారణముగా వ్రాసేనాటికన్నా భిన్నముగానుండి హృదయమునకు చక్కిలిగింతలు పెట్టినట్లున్నది. ఇందులోని అతిథి మాటలనవి నగ్న సత్యములు, కాని ప్రపంచములోని ఏ అతిథి అభ్యాగతికి బాధకలుగు మాటలు మాట్లాడడు. అభ్యాగతిని సంతోషపెట్టుటకు సత్యమును మఱుగుపరగకుండా మాట్లాడిన మాటలు చదువువారికి నవ్వు కల్గించును. మర్యాద అను పేరుతో సంఘములో ఎన్ని అసత్యములు మనము చెప్పుచున్నామో అన్న విషయముమీద చక్కని వ్యంగ్య నాటిక ఇది. ఇది చదివినప్పుడు నాకు జార్జి బెర్నార్డుషా సూక్తి ఒకటి గుర్తుకు వచ్చినది. "నేను హాస్యమాడదలిస్తే నిజం చెప్పేస్తాను."

ఈ సంవత్సరము నేను చదివినవానిలో ఇది ఉత్తమ రచన అని నా అభిప్రాయం.

—ఎం. వీరయ్య, గుంటూరు.

ఆంధ్రోద్యమం

పిదప, "తెలుగు స్వతంత్ర"లో గత సంవత్సరం ఆంధ్రోద్యమ స్వరూపస్వభావాలను గురించి శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు వ్రాసిన వ్యాసాలుకూడా నాకు నచ్చినవి. ఈ వ్యాసాలలో వివిధ దృక్కోణాల నుంచి ఆంధ్రోద్యమాన్ని ఆయన సింహావలోకన చేశారు. ఆంధ్రోద్యమం పుట్టుపూర్వోత్తరాలనుగురించి ఆయన చక్కగా వివరించారు. ఒక్క మాటలో, - ఆంధ్రోద్యమాన్ని గురించి ఏమీ తెలియనివారికి కూడా దానిని గురించి సమగ్రంగా తెలుసుకొనడానికి ఆ వ్యాసాలు ఉపకరించినవి.

గల్పికలు

1950 మే లో కాబోలు శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు "ఆంధ్రవారపత్రిక"లో వ్రాశిన "క్లిష్ట సమస్య" అనే గల్పిక, ఇంకా అనేక గల్పికలు (అదే పత్రికలో వారే వ్రాశినవి) నాకు నచ్చినవి. వీటని "1950 లో నేను చదివిన ఉత్తమ రచనలు"గా భావిస్తున్నాను.

తుర్లపాటి వెంకట కుటుంబరావు గన్నవరం




★

ఇటీవల ప్రొఫెసర్ యం. రామమూర్తి పంతులుగారు, ఢిల్లీలో ప్రధానినెహ్రూ ఆవాసమందు తమ ధనుర్విద్యాకౌశలతను ప్రదర్శించి, ప్రధాని మన్నలకు పాత్రులైరి. చిత్రమునందు కవచభూషణాలంకృతులై నిలచియున్నవారు, శ్రీరామమూర్తిగారు.

★

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras.

Regd. No. M. 4479



డిస్ట్రిబ్యూటర్లు:

(1) గోకులకృష్ణా ఫిలిం డిస్ట్రిబ్యూటర్లు, విజయవాడ (ఆంధ్రా); (2) జీవన్ ఫిలిమ్స్, గుంతకల్లు (సీడెడ్, [illegible]);
(3) జగత్ పిక్చర్స్, సికింద్రాబాద్ (నైజామ్); (4) అమృత్ పిక్చర్సు, బెంగుళూరు ([illegible])
(5) శ్రీనివాస పిక్చర్సు, [illegible] (బొంబాయి).

మిగత వివరములకు: **విజయలక్ష్మి ప్రొడక్షన్సు, మద్రాసు-17.**